RNI NO. APBIL/2013/50718

LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్

ద్విభాషా దినపత్రిక

ఎడిటర్: చిలకమర్రి రెంరెడ్డి

www.localguidenews.com

LGTV

ప్రచురణ : , తెలంగాణ | సంపుటి 13, | సంచిక ,279 | పేజీలు -12 | మంగళవారం - 03 - నవంబర్ - 2026 | వెల రూ.2/-



ఢిల్లీలో కాలుష్యంపై ఉక్కుపాదం.. తొలిరోజే రూ.68 లక్షల జరిమానాలు!



కాలుష్యంపై పోరుకు ఢిల్లీలో వింటర్ యాక్షన్ ప్లాన్ ప్రారంభం


నిర్మాణ ప్రదేశాల్లో తనిఖీలు, దుమ్ము నియంత్రణ నిబంధనలు మీరిన వారికి ఫైన్లు

పీయూసీసీ లేని వాహనాలకు భారీగా చలాన్లు జారీ

రెండు చోట్ల ఓట్లు ఉంటే తొలగించాలా... వద్దా?

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, అరాచకాన్ని అంతం చేయాలి

- తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం కావాలా? వద్దా?
- "సర్దార్ పటేల్ లేకుంటే భారత్‌లో హైదరాబాద్ విలీనం అయ్యేది కాదు
- చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని కాంగ్రెస్ చూస్తోంది
- ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. మోదీపై అవినీతి ఆరోపణలు లేవు



హైదరాబాద్: నగరంలో బీజేపీ సోమవారం మహా పాదయాత్ర నిర్వహించింది. ఇందులో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్ రెడ్డి, ఇతర బీజేపీ నేతలు పాల్గొన్నారు. బషీర్‌బాగ్ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి బీజేపీ పాదయాత్ర నిర్వహించింది. అబిడ్స్ మీదుగా ఎంజే మార్కెట్ వరకు బీజేపీ పాదయాత్ర కొనసాగింది. ఎంజే మార్కెట్‌లో అమిత్ షా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. హైదరాబాద్‌లో చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి అమ్మవారిని కూడా అమిత్‌షా దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పాదయాత్ర ముగిశాక మిగతా 2 లో



ఓబీసీ గణనపై తీర్మానం చేయండి: సీఎం రేవంత్‌కు కవిత బహిరంగ లేఖ

- ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్
- జనగణనలో ఓబీసీ కులగణనపై తీర్మానం చేయాలని విజ్ఞప్తి
- ఆదివాసీల మతానికి ప్రత్యేక కాలమ్ చేర్చాలని సూచన



వరుస ఓటములతో కాంగ్రెస్ పార్టీ నైరాశ్యంలో ఉంది

- హైదరాబాద్‌లో పాదయాత్రకు ముందు కాంగ్రెస్‌పై అమిత్ షా ఆసక్తికర పోస్ట్!
- అరాచక మార్గాల్లో అధికారం కోసం ప్రయత్నిస్తోందని ఆరోపణ
- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపు
- హైదరాబాద్ పాదయాత్రలో పాల్గొంటున్నట్లు ఎక్స్‌లో ప్రకటన
- కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా బీజేపీ నేతల భాగస్వామ్యం



గ్రోక్ ఏఐతో ఆదాయం కంటే ఖర్చే ఎక్కువ: ఎలాన్ మస్క్

గ్రోక్ ఏఐ ఆదాయం, ఖర్చులపై ఎలాన్ మస్క్ వ్యాఖ్యలు

సర్వర్ ఖర్చుల నియంత్రణకే వినియోగంపై పరిమితులని వెల్లడి

ఏఐ కారణంగా భారీగా పెరుగుతున్న టెక్ కంపెనీల అప్పులు

భారీ వర్షాలను అందిపుచ్చుకుని జలాశయాలు నింపాలి

మురసు తుఫానుపై సీఎం చంద్రబాబు ఆర్టీజీఎస్ సమీక్ష...

- పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అత్యధిక వర్షపాత అంచనా...
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్టమైన ముందస్తు చర్యలకు పదును
- అర్నబ్‌తో పోలిస్తే మురసు తుఫాను తక్కువ తీవ్రత
- దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలకు అవకాశం
- 50 టీఎంసీల మేర వరద ప్రవాహాలు వస్తాయని అంచనా
- సమర్థ నీటి నిర్వహణతో చెరువులు, రిజర్వాయర్లు నింపాలి
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి




అమరావతి: కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్టు అంచనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను మిగతా 2 లో

తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి: అమిత్ షా

- తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చుకుందని ఆరోపణ
- 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని వ్యాఖ్య
- ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదని విమర్శ
- ఈవీఎంలపై రాహుల్ గాంధీ వైఖరిని ప్రశ్నించిన షా
- తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని థీమా



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని, రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకుని 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. మిగతా 2 లో




ఏపీ తీరం వైపు దూసుకొస్తున్న 'మురసు' తీవ్ర తుఫాను

- తీరం తాకనున్న 'మురసు' తుపాను..
- ఒంగోలుకు 170 కి.మీ దూరంలో కేంద్రీకృతం
- నెల్లూరు-నర్సాపురం మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 120 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం
- కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలో అతి భారీ వర్షాలు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారుల హెచ్చరిక

రీపోలింగ్ అన్ని కేంద్రాల్లో నిర్వహించాలి: షర్మిల డిమాండ్



- చంద్రబాబు ప్రభుత్వంపై ఏపీసీసీ చీఫ్ షర్మిల తీవ్ర విమర్శలు
- ఎన్నికల్లో భారీగా రిగ్గింగ్, దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆరోపణ
- రిగ్గింగ్‌లో చంద్రబాబు సొంత బీహార్‌ను మించిపోయారని వ్యాఖ్య
- అక్రమాలు జరిగిన చోట రీ-పోలింగ్ నిర్వహించాలని ఈసీకి డిమాండ్
- దోషులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



ఏపీలో పరిషత్ పోరు.. ఈ నెల 4,5 తేదీల్లో సెలవు ప్రకటించిన ప్రభుత్వం

నవంబర్ 5న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్

ఎన్నికల ఏర్పాట్ల కోసం

4, 5 తేదీల్లో ప్రభుత్వ సెలవులు

ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

నవంబర్ 7న ఓట్ల లెక్కింపు ప్రక్రియ

రాష్ట్రవ్యాప్తంగా బరిలో 50 వేలకు పైగా అభ్యర్థులు

నవంబర్ 11 నుంచి కేటీఆర్ బస్సు యాత్ర..

29న భారీ బహిరంగ సభ

మేడిగడ్డ నుంచి గోదావరి బేసిన్ వరకు యాత్ర

- కేటీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ బస్సు యాత్రకు సన్నాహాలు
- రైతుల సాగునీటి కష్టాలను ఎండగట్టడమే లక్ష్యం



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బస్సుయాత్రకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. నవంబర్ 11 నుంచి 14వ తేదీ మధ్య మిగతా 2 లో

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com

ఢిల్లీలో కాలుష్యంపై ఉక్కుపాదం.. తొలిరోజే రూ.68 లక్షల జరిమానాలు!

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తీవ్రమవుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధికారులు 'వింటర్ యాక్షన్ ప్లాన్'ను కఠినంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా తొలిరోజైన ఆదివారమే వాహన తనిఖీలు, నిర్మాణ ప్రదేశాల్లో నిబంధనల ఉల్లంఘనలపై కొరడా ఝుళిపించారు. ఒక్క రోజులోనే మొత్తం రూ.68.4 లక్షల జరిమానాలు విధించారు. అధికారిక లెక్కల ప్రకారం, ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు కలిసి దాదాపు 15,000 వాహనాలను తనిఖీ చేశారు. పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికేట్ (పీయూసీసీ) లేని 566 వాహనాలకు రూ.56.6 లక్షల జరిమానా విధించారు. సరిహద్దుల వద్ద నిబంధనలు ఉల్లంఘించి, ఢిల్లీలో ప్రవేశించడానికి ప్రయత్నించిన 1,539 వాహనాలను వెనక్కి పంపారు. వీరి నుంచి రూ.2 లక్షల ఫైన్ వసూలు చేశారు. బీఎస్-6 ప్రమాణాలు లేని ఇతర ప్రాంత వాహనాలను ఢిల్లీలోకి రాకుండా నిలిపివేశారు. మరోవైపు, నిర్మాణ పనుల వల్ల ఏర్పడే దుమ్ము కాలుష్యంపై కూడా అధికారులు దృష్టి సారించారు. మొత్తం 300 నిర్మాణ ప్రాంతాలను తనిఖీ చేయగా, 32 చోట్ల నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. వీరికి పర్యావరణ నష్టపరిహారం కింద రూ.9.8 లక్షలు విధించారు. కొన్ని నిర్మాణాలకు మూసివేత ఆదేశాలు, షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ చర్యలపై ఢిల్లీ పర్యావరణ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా 'ఎక్స్'లో స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ వింటర్ యాక్షన్ ప్లాన్ ఫిబ్రవరి 28 వరకు అమల్లో ఉంటుందని, ఈ కాలంలో పార్కింగ్ ఫీజుల పెంపు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో 50% హాజరు వంటి నిబంధనలు కూడా ఉంటాయని అధికారులు తెలిపారు. అయితే, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలకు, అత్యవసర సేవలకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

గ్రోక్ ఏఐతో ఆదాయం కంటే ఖర్చే ఎక్కువ: ఎలాన్ మస్క్

ఢిల్లీ: ఉత్పాదకత పెంచుకోవడానికి కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వైపు చూస్తున్నాయి. అయితే, ఈ టెక్నాలజీ నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతుండటంతో సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సైతం ఇదే విషయంపై స్పందించారు. తన 'ఎక్స్' సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లోని 'గ్రోక్' ఏఐ చాట్‌బాట్‌కు వస్తున్న ఆదాయం కంటే నిర్వహణ ఖర్చే ఎక్కువగా ఉందని ఆయన అంగీకరించారు. ఎక్స్‌లోని ప్రీమియం యూజర్లు కొందరు, తమ వారపు గ్రోక్ వినియోగ పరిమితి వేగంగా అయిపోతోందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనిపై స్పందించిన ఒక యూజర్, ఈ లిమిట్‌ను రీసెట్ చేయాలని మస్క్‌ను కోరారు. ఈ నేపథ్యంలోనే మస్క్ పైవిధంగా స్పందించారు. సర్వర్ ఖర్చులు మరింత పెరగకుండా ఉండేందుకే వినియోగంపై కఠినమైన పరిమితులు విధించాల్సి వస్తోందని ఆయన వివరించారు. మరోవైపు, ఏఐ కోసం టెక్ కంపెనీలు చేస్తున్న అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఆల్ఫాబెట్, అమెజాన్, యాపిల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, టెస్లా వంటి దిగ్గజ సంస్థల మొత్తం అప్పు 2026 మధ్య నాటికి 578 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.54 లక్షల కోట్లు) చేరుకుందని తెలిపింది. 2025లో ఈ అప్పు 399 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ఏఐ టెక్నాలజీ అభివృద్ధి, నిర్వహణ ఎంత ఖర్చుతో కూడుకున్నదో స్పష్టం చేస్తోంది.

రెండు చోట్ల ఓట్లు ఉంటే తొలగించాలా... వద్దా?:

హైదరాబాద్: నగరంలో బీజేపీ సోమవారం మహా పాదయాత్ర నిర్వహించింది. ఇందులో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్ రెడ్డి, ఇతర బీజేపీ నేతలు పాల్గొన్నారు. బషీర్‌బాగ్ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి బీజేపీ పాదయాత్ర నిర్వహించింది. అబిడ్స్ మీదుగా ఎంజే మార్కెట్ వరకు బీజేపీ పాదయాత్ర కొనసాగింది. ఎంజే మార్కెట్‌లో అమిత్ షా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. హైదరాబాద్‌లో చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి అమ్మవారిని కూడా అమిత్‌షా దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పాదయాత్ర ముగిశాక నిర్వహించిన సభలో అమిత్ షా జై శ్రీరాం నినాదాలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం కావాలా? వద్దా? అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, అరాచకాన్ని అంతం చేయాలని పిలుపునిచ్చారు. "సర్దార్ పటేల్ లేకుంటే భారత్‌లో హైదరాబాద్ విలీనం అయ్యేది కాదు. అరాచక శక్తులను బీజేపీ అంతం చేస్తోంది. చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని కాంగ్రెస్ చూస్తోంది. 13 కోట్ల ఓట్లను తొలగించారని రాహుల్ గాంధీ అంటున్నారు. రెండు చోట్ల ఓట్లు ఉంటే తొలగించాలా... వద్దా? ఎస్ఐఆర్‌తో అక్రమ వలసదారులను తొలగిస్తున్నాం. కాంగ్రెస్ అండ్ కో ఎస్ఐఆర్ ఆపాలని చూస్తోంది. దేశంలో కాంగ్రెస్ వెంటిలేటర్‌పై ఉంది. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. మోదీపై అవినీతి ఆరోపణలు లేవు. తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. 2014లో మోదీ గెలిచారు అప్పుడు ఎస్ఐఆర్ ఉందా? 2019లోనూ మోదీ విజయం సాధించారు.. అప్పుడు ఎస్ఐఆర్ ఉందా? కాంగ్రెస్‌కు మాక్ పార్లమెంటే కరెక్ట్. అందులోనైనా రాహుల్ ప్రధాని రోల్ ఎంచుకోవాలి. ఎందుకంటే రాహుల్ ఎప్పటికీ ప్రధాని కాలేరు" అని అమిత్ షా తెలిపారు.

తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి: అమిత్ షా

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని, రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకుని 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. రేవంత్ రెడ్డి ద్వారా రాహుల్ గాంధీకి ఈ ట్యాక్స్ వెళుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిందని, ఆ పార్టీ వెంటిలేటర్‌పై ఉందని విమర్శించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్‌ను కాపాడలేరని అన్నారు. తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. 'లోకతంత్ర బచావో - అరాచకత హటావో' నినాదంతో తెలంగాణ బీజేపీ ఈ పాదయాత్రను నిర్వహించింది. బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభమైన యాత్ర అబిడ్స్ మీదుగా మోజంజాహీ మార్కెట్ వరకు సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న విమర్శలకు బీజేపీ ఇచ్చిన ప్రతివ్యూహంలో భాగంగా జరిగింది. ఈవీఎంలపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలపైనా అమిత్ షా స్పందించారు. ఈవీఎంల వల్లే ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయన్నది కాంగ్రెస్ వాదన అయితే, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని ప్రశ్నించారు. కేరళం, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆ పార్టీ విజయాలు ఎలా సాధ్యమయ్యాయని నిలదీశారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, ఆయన పాలనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని అన్నారు. మోదీ ఇచ్చిన హామీలు అమలయ్యాయని పేర్కొంటూ, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం కోల్పోతోందని అమిత్ షా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని కాపాడటం రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు సోమవారం మధ్యాహ్నం అమిత్ షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సహా పలువురు పార్టీ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావుతో పాటు ఎంపీ రఘునందన్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఐటీసీ కాకతీయ హోటల్‌కు చేరుకున్న అమిత్ షా అక్కడ భోజన విరామం తీసుకున్నారు. పార్టీ ముఖ్య నేతలతో పాటు పలువురు ప్రముఖులతోనూ సమావేశమయ్యారు. అనంతరం ప్రారంభమైన పాదయాత్రలో కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాంచందర్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ పాదయాత్రకు 'లోకతంత్ర బచావో - అరాచకత హటావో' (ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం -- అరాచకవాదాన్ని అంతం చేద్దాం) అనే పేరు పెట్టింది. ఢిల్లీలో నిన్న కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు నిర్వహించిన 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి ప్రతిగా, ఎస్ఐఆర్‌పై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని బీజేపీ నేతలు ప్రకటించారు. హైదరాబాద్ పాదయాత్రతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ ప్రణాళిక రూపొందించింది.

ప్రతి మండలంలో కూటమి జెండాలు రెపరెపలాడాలి: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి: రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి జెండాలు రెపరెపలాడాలని, ఆ దిశగా ఎంపీటీసీ స్థానాల్లో పైచేయి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కూటమి పార్టీల ముఖ్యనేతలతో ఆయన సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థానాలనూ కూటమి పార్టీలే కైవసం చేసుకోవాలని, అందుకు అనుగుణంగా జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకోవాలని లక్ష్యం నిర్దేశించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానికంగానూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆయన అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రతి ఇంటికీ సంక్షేమం అందించామని గుర్తుచేశారు. ప్రజల ఆశలు నెరవేర్చేలా సుపరిపాలన అందిస్తున్నామని, ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ లక్ష్య సాధన కోసం కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తితో అందరూ ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలన్నారు. స్థానిక ఎన్నికలపై తాను, పవన్ కల్యాణ్, మాధవ్ నిరంతరం చర్చించుకుంటున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మాత్రం పెద్ద ఎత్తున పోలింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. కూటమి ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పులివెందులలో హింస సృష్టించేందుకు కొందరు ప్రయత్నించినా కూటమి నేతలు సంయమనం పాటించారని అభినందించారు. త్వరలో జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఒకవైపు ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ, మరోవైపు 'అర్నబ్', 'మురసు' తుపానుల సహాయక చర్యలను సమర్థంగా చేపడుతున్నామని, విరిగిన స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను గాడిలో పెట్టామని చంద్రబాబు వివరించారు. ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబరు 5న జరగనుండగా, నవంబరు 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

ఏపీ తీరం వైపు దూసుకొస్తున్న 'మురసు' తీవ్ర తుఫాను

అమరావతి: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. ఇది ఏపీపై పెను ప్రభావాన్ని చూపేందుకు సిద్ధమైంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ తుపాను నవంబర్ 2వ తేదీ (సోమవారం) అర్ధరాత్రి 11:30 గంటల నుంచి మరుసటి రోజు, నవంబర్ 3వ తేదీ (మంగళవారం) తెల్లవారుజామున 4:00 గంటల మధ్యలో నెల్లూరు, నర్సాపురం మధ్య, ఒంగోలుకు దక్షిణంగా తీరాన్ని దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, గరిష్ఠంగా గాలి వేగం గంటకు 120 కిలోమీటర్లకు చేరుకోవచ్చని అధికారులు హెచ్చరించారు. ప్రస్తుతం ఈ తుపాను పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో, నెల్లూరుకు ఆగ్నేయంగా 110 కిలోమీటర్లు, బాపట్లకు 190 కిలోమీటర్లు, తిరుపతికి 160 కిలోమీటర్లు, కావలికి 130 కిలోమీటర్లు, ఒంగోలుకు ఆగ్నేయంగా 170 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. వాయవ్య దిశగా కదులుతూ ఇది వేగంగా తీరానికి చేరువవుతోంది.

భారీ నుంచి అతి భారీ వర్షాలు

'మురసు' తుపాను ప్రభావంతో రానున్న రెండు రోజులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. ముఖ్యంగా నవంబర్ 2, 3 తేదీల్లో కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు (21 సెం.మీ కంటే ఎక్కువ) నమోదయ్యే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నవంబర్ 3న తెలంగాణలోనూ అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి.

సముద్రం అల్లకల్లోలం.. 2 మీటర్ల ఎత్తున అలలు

తుపాను తీరం దాటే సమయంలో సముద్రం తీవ్రంగా అల్లకల్లోలంగా మారుతుంది. ముఖ్యంగా దక్షిణ కోస్తాంధ్రలోని లోతట్టు ప్రాంతాలను ఉప్పెన ముంచెత్తే ప్రమాదం ఉంది. అలల ఉద్ధృతి సాధారణం కంటే 1.5 నుంచి 2 మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. బాపట్ల, కృష్ణా, ప్రకాశం జిల్లాలపై ఈ ప్రభావం అధికంగా ఉండొచ్చని తెలిపారు.

నవంబర్ 2 సాయంత్రం నుంచి 3వ తేదీ ఉదయం వరకు సముద్రపు అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల తీర ప్రాంతాల్లో గంటకు 80-90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడం మొదలై, రాత్రికి 120 కిలోమీటర్లకు చేరుకుంటుంది.

అధికారులు అప్రమత్తం.. మత్స్యకారులకు హెచ్చరిక

తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తీర ప్రాంత జిల్లాల యంత్రాంగాలను సిద్ధం చేసి, సహాయక చర్యలకు ఏర్పాట్లు చేస్తోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తుపాను తీరం దాటిన తర్వాత కూడా దీని ప్రభావం కొనసాగుతుంది. నవంబర్ 3వ తేదీ ఉదయానికి గాలి వేగం గంటకు 70-80 కిలోమీటర్లకు తగ్గి, సాయంత్రానికి మరింత బలహీనపడనుంది. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లరాదని అధికారులు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. నవంబర్ 4వ తేదీ ఉదయం వరకు నైరుతి బంగాళాఖాతంలోకి వెళ్లవద్దని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షాలను అందిపుచ్చుకుని జలాశయాలు నింపాలి

అమరావతి: కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్టు అంచనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అర్నబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే చాలా వరకు సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని సీఎం తెలిపారు. అర్నబ్ ప్రభావాన్ని ఎదుర్కొనేలా శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు ముందస్తు ఏర్పాట్లు చేశామని, ఇప్పుడు మురసు తుఫాను ప్రభావాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. అర్నబ్ తుఫాను కారణంగా శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు 31 వేల విద్యుత్ స్తంభాలను క్షేత్రస్థాయికి పంపించామని అధికారులు వివరించారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది వస్తున్నారని, వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు. మురసు తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో 30 సెంటీమీటర్లు, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రెయిన్లను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అధికారులు అంచనా వేశారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉందని, నాగార్జునసాగర్‌కు కూడా భారీగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని ఆదేశించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ బేసిన్‌లోని జలాశయాల్లో నీటిని నిల్వ చేసుకునేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మార్కాపురంలోని కంభం చెరువుతో పాటు ఆయా జిల్లాల్లోని మీడియం, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాలను కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షించాలని సీఎం సూచించారు. మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగునీటి సంఘాలను క్రియాశీలం చేసి ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టిన పనులను వినియోగించుకోవాలని, ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. డ్రెయిన్లలో పూడిక కారణంగా పంటలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో గర్భిణులను ముందుగానే ఆసుపత్రుల్లో చేర్పించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 3,066 మంది గర్భిణీలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కచ్చా ఇళ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అవసరాన్ని బట్టి మోహరించాలన్నారు. రైల్వే మార్గాలు, జాతీయ రహదారుల వద్ద లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటే రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. మత్స్యకారుల బోట్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు, గాలులు, వరద ప్రవాహాలపై నిరంతరం పర్యవేక్షించాలని, సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ముఖ్య మంత్రి సూచించారు. ప్రతి రెండు గంటలకు ఓసారి పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భరోసా కల్పించాలని, కలెక్టర్లు ఎప్పటి కప్పుడు హెచ్చరికల ప్రకటనలు విడుదల చేయాలని చెప్పారు. తుఫాను అనంతర పునరుద్ధరణ పనులను 48 గంటల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పంటల బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, వ్యవసాయ, జలవనరులు, అగ్ని మాపక సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు వర్చువల్ గా హాజరయ్యారు.

ఎన్నికల సంఘం అధికార పార్టీకి కొమ్ముకాయడం దారుణం: జగన్

అమరావతి: రాష్ట్ర ఎన్నికల సంఘం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తొత్తుగా మారిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అక్రమాలే ఇందుకు నిదర్శనమని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థే అధికార పార్టీకి కొమ్ముకాయడం దారుణమని ఆయన మండిపడ్డారు. పులివెందులలో 80 పోలింగ్ బూత్‌లకు గాను 70 చోట్ల తమ పార్టీ ఏజెంట్లను టీడీపీ గూండాలు అడ్డుకున్నారని జగన్ ఆరోపించారు. పోలీసుల సహకారంతోనే బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారు దాడులకు పాల్పడి, తమ ఏజెంట్లను బూత్‌ల నుంచి బయటకు లాగేశారని తెలిపారు. ఓటర్ల స్లిప్పులు లాక్కొని, బూత్‌లను ఆక్రమించి రిగ్గింగ్, సైక్లింగ్‌కు పాల్పడ్డారని, వీటికి స్పష్టమైన వీడియో ఆధారాలున్నాయని పేర్కొన్నారు. అయితే, 70 బూత్‌లలో అక్రమాలు జరిగితే, కేవలం 4 బూత్‌లలో మాత్రమే రీపోలింగ్‌కు ఆదేశించడం దారుణమని జగన్ అన్నారు. ఇది ప్రజలను మభ్యపెట్టే కంటితుడుపు చర్య కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి వాటిని స్వేచ్ఛాయుత ఎన్నికలు అంటారా? అంటూ ఎన్నికల సంఘం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తరహా ఘటనలు కేవలం పులివెందులకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా జరిగాయని జగన్ తెలిపారు. కడప, తిరుపతి, కర్నూలు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం కార్పొరేషన్లతో పాటు మాచర్ల, కుప్పం, పుత్తూరు, నంద్యాల వంటి అనేక మున్సిపాలిటీల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ అక్రమాలపై న్యాయపోరాటం చేస్తామని... గెలుపు ఆలస్యమైనా అంతిమంగా న్యాయం, ధర్మమే గెలుస్తాయని ఆయన పునరుద్ఘాటించారు.

రీపోలింగ్ అన్ని కేంద్రాల్లో నిర్వహించాలి: షర్మిల డిమాండ్

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో అధికార కూటమి భారీ ఎత్తున రిగ్గింగ్, దౌర్జన్యాలకు పాల్పడిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. "రిగ్గింగ్ అనే పదానికి కూటమి ప్రభుత్వం కొత్త నిర్వచనం ఇచ్చింది. రిగ్గింగ్ చేయడంలో చంద్రబాబు సౌత్ బీహార్‌ను మరిపించారు. ప్రజల్లో మద్దతు లేక, ఓటమి భయంతోనే బూత్ క్యాప్చరింగ్, దొంగ ఓట్లతో గెలవాలని చూడటం సిగ్గుచేటు" అని షర్మిల విమర్శించారు. ఎన్నికల సంఘాన్ని బానిసగా చేసి, ప్రజల తీర్పును అపహాస్యం చేశారని, ఇది దేశ ఎన్నికల చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయమని ఆమె అభివర్ణించారు. ఒకవైపు పారదర్శకత అని నీతులు చెబుతూ, మరోవైపు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికల వ్యవస్థను శాసించడం ఎలాంటి ప్రజాస్వామ్యమని షర్మిల ప్రశ్నించారు. ప్రశాంత వాతావరణంలో కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా భయానక పరిస్థితుల్లో, దాడులు, దౌర్జన్యాల మధ్య ఎన్నికలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే స్పందించాలని షర్మిల డిమాండ్ చేశారు. బూత్ క్యాప్చరింగ్, దొంగ ఓట్లు, దౌర్జన్యాలు జరిగినట్లు వీడియో ఆధారాలు ఉన్న ప్రతి పోలింగ్ కేంద్రంలో వెంటనే పోలింగ్ రద్దు చేసి, రీ-పోలింగ్ నిర్వహించాలని కోరారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోని వెబ్‌కాస్టింగ్, సీసీటీవీ ఫుటేజ్‌లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని, అక్రమాలకు సహకరించిన రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, పోలీసులపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఏపీలో పరిషత్ పోరు.. ఈ నెల 4,5 తేదీల్లో సెలవు ప్రకటించిన ప్రభుత్వం

అమరావతి: ఏపీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఇప్పుడు రాష్ట్ర యంత్రాంగం మొత్తం పరిషత్ ఎన్నికలపై దృష్టి సారించింది. రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు నవంబర్ 5న పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు, ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా రెండు రోజుల పాటు సెలవులు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పోలింగ్ ఏర్పాట్ల కోసం నవంబర్ 4న, పోలింగ్ నిర్వహణ కోసం నవంబర్ 5న సెలవు దినాలుగా ప్రకటించారు. పోలింగ్ కేంద్రాలుగా ఉపయోగించే పాఠశాలలకు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఈ సెలవులు వర్తిస్తాయి. కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా పోలింగ్ జరిగే ప్రాంతాల పరిధిలోని ప్రైవేట్ సంస్థల ఉద్యోగులకు, దుకాణాల్లో పనిచేసే కార్మికులకు కూడా నవంబర్ 5న వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించింది. వాస్తవానికి ఈ ఎన్నికల పోలింగ్ నవంబర్ 3న జరగాల్సి ఉండగా, మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌లో మార్పుల కారణంగా వాయిదా పడింది. ప్రస్తుతం నవంబర్ 5న పోలింగ్ నిర్వహించి, నవంబర్ 7న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 9,829 ఎంపీటీసీ స్థానాలకు గాను 46,045 మంది, 659 జెడ్పీటీసీ స్థానాలకు 4,770 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీతో పాటు జనసేన, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పోటీ చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు అధికారులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

వరుస ఓటములతో కాంగ్రెస్ పార్టీ నైరాశ్యంలో ఉంది

హైదరాబాద్: వరుస ఎన్నికల ఓటములతో కాంగ్రెస్ పార్టీ నైరాశ్యంలో కూరుకుపోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా అధికారంలోకి రావడం సాధ్యం కాకపోవడంతో అరాచక మార్గాల ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ కుట్రపూరిత ప్రయత్నాల నుంచి దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'లోక్‌తంత్ర బచావో - అరాచకత హటావో' (ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం - అరాచకవాదాన్ని అంతం చేద్దాం) మహా పాదయాత్రలో తాను పాల్గొంటున్నట్లు అమిత్ షా వెల్లడించారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పాదయాత్రలో అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, తెలంగాణ బీజేపీ నేతలు, పార్టీ కార్యకర్తలు పాల్గొంటున్నారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తారని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. పాదయాత్ర ముగిసిన తర్వాత నిర్వహించనున్న బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించనున్నారు. కాంగ్రెస్ పార్టీపై ఆయన మరిన్ని విమర్శలు చేసే అవకాశం ఉండటంతో సభలో ఆయన ప్రసంగంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

నవంబర్ 11 నుంచి కేటీఆర్ బస్సు యాత్ర.. 29న భారీ బహిరంగ సభ

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బస్సుయాత్రకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. నవంబర్ 11 నుంచి 14వ తేదీ మధ్య రెండు రోజుల పాటు కేటీఆర్ బస్సు యాత్ర చేపడతారని తెలిపారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర, గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా సాగుతుందని వివరించారు. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తూ, రైతుల ఇబ్బందులను ఆధారాలతో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. మరోవైపు, తెలంగాణ ఉద్యమంలో చారిత్రక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29న భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు గంగుల తెలిపారు. 2009లో కేసీఆర్‌ను అరెస్టు చేసిన అలుగునూరు లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో ఈ సభను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ సభకు సుమారు 50 వేల మంది ప్రజలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

మురసు తుపానుపై పవన్ కల్యాణ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు

అమరావతి: మురసు తుఫాను ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుపాను పరిస్థితులపై అధికారులతో చర్చించి, యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మురసు తుపాను కారణంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని పవన్ కల్యాణ్ అధికారులకు వివరించారు. భారీ వర్ష సూచన ఉన్న ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే హెచ్చరించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వాగులు, వంకల వద్దకు ఎవరూ వెళ్లకుండా కట్టడి చేయాలన్నారు. తుపాను అనంతరం తాగునీరు, విద్యుత్ సరఫరాను వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా, మురసు తుపాను తీవ్ర తుఫానుగా మారి దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

ఓబీసీ గణనపై తీర్మానం చేయండి సీఎం రేవంత్‌కు కవిత బహిరంగ లేఖ

హైదరాబాద్: జాతీయ జనగణనలో ఓబీసీల కులగణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. ఓబీసీ కులగణనతో పాటు, ఆదివాసీల మతాన్ని నమోదు చేసేందుకు కూడా ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానాలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా, బీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం ప్రయోజనాలు అందడం లేదని కవిత తన లేఖలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఓబీసీల జనాభాపై చట్టబద్ధమైన, అధికారిక గణాంకాలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ఆమె అభిప్రాయపడ్డారు. కులాల వారీగా లెక్కలు తేలితేనే వారికి సంక్షేమ ఫలాలు సరిగ్గా అందుతాయని స్పష్టం చేశారు. అదేవిధంగా, ఆదివాసీల ప్రత్యేక జీవనశైలి, సంస్కృతి, ప్రకృతి ఆరాధనను దృష్టిలో ఉంచుకుని జనగణనలో వారి మతాన్ని నమోదు చేయడానికి ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ నుంచి ఇంటింటి జనగణన కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ తీర్మానాలను ఆమోదించాలని కవిత కోరారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

ఎన్కతల గ్రామంలో పశువుల నీటి తొట్టి నిర్మాణానికి మార్కింగ్



లోకల్ గైడ్, మోమిన్ పేట వికారాబాద్ జిల్లా : మోమిన్ పేట మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పంచాయతీ మరియు 'కేవీఆర్ (కేవీర్) ట్రస్ట్' సంయుక్తంగా కీలక అడుగు వేశాయి. కేవీఆర్ ట్రస్ట్ ఆర్థిక సౌజన్యంతో గ్రామంలో నిర్మించనున్న పశువుల తాగునీటి తొట్టి (వాటర్ ట్యాంక్) స్థలాన్ని సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. గ్రామ సర్పంచ్ పటేల్ శ్రీకాంత్ గౌడ్, గ్రామ కార్యదర్శి నర్సింలు మరియు పంచాయతీ అధికారుల సమక్షంలో ఈ స్థల సేకరణ, మార్కింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ... వేసవికాలంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామంలోని పశువులకు నీటి ఎద్దడి కలగకుండా ఉండేందుకే కేవీఆర్ ట్రస్ట్ ఈ సామాజిక బాధ్యతను చేపట్టిందని తెలిపారు. పశువులకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. పశువుల సంక్షేమం కోసం ముందుకు వచ్చి నీటి తొట్టి నిర్మాణాన్ని చేపడుతున్న కేవీఆర్ ట్రస్ట్ ఉదారతను గ్రామ సర్పంచ్, పంచాయతీ అధికారులు మరియు గ్రామస్తులు కొనియాడి, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక పరిజ్ఞానంపై రెండు రోజుల యాజమాన్య వికాస కార్యక్రమం

ఈ నెల 19, 20 తేదీల్లో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో నిర్వహణ..

ఆసక్తి ఉన్నవారికి అవకాశం



పఠాన్ చేరు, నవంబర్ 02 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): వ్యూహాత్మక వ్యాపార నిర్ణయాలు తీసుకోవడంలో మేనేజర్లకు అవసరమైన ఆర్థిక పరిజ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించేందుకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజుల యాజమాన్య వికాస కార్యక్రమం (ఎండీపీ) నిర్వహించనున్నారు. అకౌంటింగ్, ఫైనాన్స్ విభాగం ఆధ్వర్యంలో 'సంఖ్యల నుంచి వ్యూహం వరకు: నిర్వాహక నైపుణ్యం కోసం ఆర్థిక పరిజ్ఞానం' అనే అంశంపై హైబ్రిడ్ విధానంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఫైనాన్స్‌లో అధికారిక విద్యా నేపథ్యం లేని మేనేజర్లు, వృత్తి నిపుణులకు ఆర్థిక, వాణిజ్యపరమైన అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఆర్థిక విశ్లేషణ, వ్యయ నిర్మాణాలు, బడ్జెట్ రూపకల్పన, మూలధన కేటాయింపు, పెట్టుబడిపై రాబడి, పెట్టుబడి మూల్యాంకనం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. అలాగే ఆర్థిక విలువ జోడింపు (ఈవీఏ), మూలధన సగటు వ్యయం (డబ్ల్యుఏసీసీ), మూలధన ఆస్తుల ధరల నమూనా (సీఏపీఎం), ఆర్థిక అంచనాలపై ఆచరణాత్మక అవగాహన కల్పిస్తారు. వాస్తవ వ్యాపార సందర్భాలు, ప్రత్యక్ష అభ్యాసాలు, కేస్ స్టడీల ద్వారా ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం, వ్యాపార పనితీరును విశ్లేషించడం, పెట్టుబడి అవకాశాలను అంచనా వేయడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేస్తారు. ఈ కార్యక్రమాన్ని అకౌంటింగ్, ఫైనాన్స్ విభాగానికి చెందిన డాక్టర్ సుశోభన్ పాల్, డాక్టర్ మెరుగు వేణుగోపాల్ నిర్వహిస్తారు. పాల్గొనేవారికి అభ్యాస సామగ్రితో పాటు ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఆసక్తి ఉన్నవారు పేర్ల నమోదు, రుసుము తదితర వివరాల కోసం 84209 66501 నంబర్‌ను సంప్రదించవచ్చు. లేదా ఏఎవపస్రత్ఖుఎ.వంబ కు ఈ-మెయిల్ చేయవచ్చు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, నవంబర్- 02: లోకల్ గైడ్: ప్రజా వినతుల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన కే.రవీంద్ర బాబు సర్వే నెంబర్ 230 లో ఉన్న భూమి సర్వే చేసి రికార్డు మార్పు చేయగలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏదులాపురం పట్టణానికి చెందిన పలువురు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ ప్రోటోకాల్ ఉల్లంఘిస్తూ ఎన్నికైన ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని వీటిని సవరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు కూసుమంచి మండలం తురకగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ బుర్ర కృష్ణ తమ గ్రామంలో కొమ్ము ఇందిరమ్మకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించడం జరిగిందని దురదృష్టవశాత్తు కుటుంబ సభ్యులందరూ మరణించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ ఇంటికి చట్టబద్ధమైన హక్కు దారులు ఎవరైనా ఉన్నారు విషయాన్ని పరిశీలించాలని, చట్టపరమైన హక్కు దారులు ఎవరూ లేకపోతే మరో లబ్ధిదారుల్ని ఎంపిక చేసే పంపిణీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. చింతకాని మండలం వందనం గ్రామం చెందిన ప్రజలు మత్స్య శాఖ సభ్యులు వందనం గ్రామ చెరువుకు సాగర్ ఎడమ కాలు ద్వారా నీటి సరఫరా పునరుద్ధరించి చెరువులు నింపాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎస్ఈ ఇరిగేషన్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, డిఆర్ఓ సీహెచ్. రామ్మూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవు -- గ్రంధి ప్రవీణ్ కుమార్





ఖమ్మం జిల్లా ప్రతినిధి నవంబర్ 02: లోకల్ గైడ్ : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కాంగ్రెస్ వాణిజ్య విభాగ అధ్యక్షుడు గ్రంధి ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని పలు బియ్యం దుకాణాలను ఆయన పరిశీలించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ సూచనల మేరకు రైస్ మిల్లర్లు, బియ్యం వ్యాపారులు ప్రభుత్వ నిర్ణీత ధరలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. 26 కిలోల బియ్యం బ్యాగులపై ధరల వివరాలను వినియోగదారులకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. బీపీటీ బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్ బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటీ బియ్యం కిలో రూ.79 చొప్పున విక్రయించాలని పేర్కొన్నారు. నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయించే వ్యాపారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. బియ్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఎవరైనా అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే వినియోగదారులు సంబంధిత పౌర సరఫరాల అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

దాడులు తాత్కాలికం.. నిఘానే శాశ్వత పరిష్కారం!

మహిళల అండాలతో అక్రమ దందా.. 43 మంది మహిళల గుర్తింపుతో బయటపడిన అంతర్రాష్ట్ర నెట్‌వర్క్. చట్టాలు, తనిఖీలు ఉన్నా ఆగని అక్రమాలు.. ఐవీఎఫ్ కేంద్రాల నుంచి ఏజెంట్ల వరకు కదలాల్సిన దర్యాప్తు.. మహిళల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం భరోసా ఏదీ సంపాదకీయం। వనం రామకృష్ణ నేరం వెలుగుచూస్తే దాడులు.. నిందితులు పట్టుబడితే అరెస్టులు.. ఆ తర్వాత కొద్దిరోజుల చర్చ.. మళ్లీ యథాతథ పరిస్థితి! ప్రజల భద్రతకు ముప్పుగా మారుతున్న అక్రమ వ్యాపారాల విషయంలో ఇదే పాత పద్ధతి కొనసాగితే సమస్యకు పరిష్కారం ఎక్కడ? హైదరాబాద్‌లో వెలుగుచూసిన మహిళల అండాల అక్రమ సేకరణ వ్యవహారం ప్రభుత్వ యంత్రాంగానికి ఈ ప్రశ్నను బలంగా సంధిస్తోంది. మహిళల శరీరాన్నే సంపాదనకు సాధనంగా మార్చుకునే స్థాయికి అక్రమ ముఠాలు తెగబడుతుంటే.. నిఘా వ్యవస్థ ఏం చేస్తున్నట్లు? ఒకటి కాదు.. రెండు కాదు.. 43 మంది మహిళలను గుర్తించి రక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే ఈ వ్యవహారం వెనుక ఉన్న నెట్‌వర్క్ తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. మల్కాజిగిరి ఎస్‌ఓటీ, బేగంపేట, సరూర్‌నగర్ పోలీసులు నిర్వహించిన సోదాలు కొంతమంది నిందితులను పట్టుకోవడానికే పరిమితం కాకుండా, ఈ అక్రమ వ్యవస్థ మూలాలను వెలికితీయడానికి ఆరంభం కావాలి.





పేదరికమే పెట్టుబడి.. మహిళలే లక్ష్యం!

ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే మహిళలను గుర్తించడం.. డబ్బు ఆశ చూపడం.. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు రప్పించడం.. అద్దె ఇళ్లు, హాస్టళ్లలో ఉంచడం.. అండాల దాన ప్రక్రియకు సిద్ధం చేయడం.. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడవుతున్న అంశాలు ఇవి. ఒక్కోసారి అండాల దానానికి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లిస్తామంటూ ఆశ చూపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హార్మోన్ల ఇంజెక్షన్లు, మందులు వినియోగించినట్లు మహిళల వాంగ్మూలాల్లో వెల్లడైన అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆధార్ వివరాలు, అఫిడవిట్లు, సమ్మతి పత్రాల్లో అక్రమాలు జరిగాయా అన్నది కూడా తేలాల్సి ఉంది. ఇక్కడే అసలు సమస్య దాగి ఉంది. ఆర్థిక అవసరాల్లో ఉన్న మహిళకు డబ్బు ఆశ చూపడం ఒక ఎత్తయితే.. ఆమె ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను దాచిపెట్టి వైద్య ప్రక్రియలకు సిద్ధం చేయడం మరో ఎత్తు. మహిళ అంగీకరించిందనే ఒక్క కారణంతో ప్రతి చర్య చట్టబద్ధం అయిపోదు. ఆమెకు ప్రక్రియ గురించి పూర్తిస్థాయి అవగాహన ఉందా? ఎలాంటి ఆరోగ్య ప్రమాదాలు ఎదురుకావచ్చు? చికిత్స అనంతరం వైద్య సహాయం ఎవరు అందిస్తారు? బీమా సౌకర్యం ఉందా? అనే విషయాలు స్పష్టంగా వివరించాలి. ఆర్థిక బలహీనతను సమ్మతిగా మార్చి దోపిడీకి పాల్పడితే దాన్ని వైద్య సేవగా ఎలా పరిగణించగలం?

అండాల సేకరణ వెనుక అసలు సూత్రధారులెవరు?

మహిళలను సమీకరించిన ఏజెంట్లు ఎవరు? వారికి డబ్బు సమకూర్చిన వ్యక్తులెవరు? వసతి ఏర్పాట్లు చేసినవారెవరు? ఏ కేంద్రాలకు తీసుకెళ్లారు? సేకరించిన అండాలను ఎక్కడ వినియోగించారు? ఈ ప్రక్రియ ద్వారా ఎంతమేర ఆర్థిక లావాదేవీలు జరిగాయి? ఇవన్నీ దర్యాప్తులో తేలాల్సిన కీలక ప్రశ్నలు. మధ్యవర్తులను అరెస్టు చేసి కేసు ముగిస్తే అసలు సూత్రధారులు తప్పించుకునే ప్రమాదం ఉంది. ఈ నెట్‌వర్క్‌కు ఆర్థికంగా అండగా నిలిచినవారు, వైద్యపరమైన సహకారం అందించినవారు ఎవరైనా ఉంటే వారిని కూడా ఆధారాలతో గుర్తించాలి.అయితే దర్యాప్తులో కొన్ని వైద్య కేంద్రాల పేర్లు ప్రస్తావనకు వచ్చినంత మాత్రాన వాటి ప్రమేయం నిర్ధారణైనట్లు కాదు. ఆధారాలు లేకుండా సంస్థలను నిందించడం ఎంత తప్పో, ప్రభావవంతమైన సంస్థలపై విచారణకు వెనుకాడటం కూడా అంతే తప్పు. ప్రతి కేంద్రం రికార్డులు, సీసీటీవీ దృశ్యాలు, వైద్యుల అర్హతలు, ఆర్థిక లావాదేవీలను నిష్పక్షపాతంగా పరిశీలించాలి.

చట్టాలు ఉన్నాయి.. వాటిని అమలు చేసేదెవరు?

సహాయక పునరుత్పత్తి సాంకేతికత నియంత్రణ చట్టం--2021 (ఏఆర్‌టీ చట్టం) ఈ రంగంలో వైద్య సేవలు, ఏఆర్‌టీ క్లినిక్‌లు, బ్యాంకుల నమోదు, దాతల రక్షణకు స్పష్టమైన నిబంధనలు కల్పించింది. అండాల దాతల అర్హతలు, వైద్య పరీక్షలు, సమ్మతి, బీమా, అండాల సేకరణకు సంబంధించిన పరిమితులు చట్టంలో నిర్దేశించబడ్డాయి. వాణిజ్యపరమైన అండాల కొనుగోలు, విక్రయాలకు చట్టం అనుమతించదు. మరి ఈ నిబంధనలన్నీ అమలవుతున్నాయా? ఒక రాష్ట్రంలో అండాలను దానం చేసిన మహిళ మరో రాష్ట్రంలో మళ్లీ అదే ప్రక్రియకు గురైతే గుర్తించే వ్యవస్థ ఉందా? నకిలీ పత్రాలతో దాతల వివరాలను మార్చితే పట్టుకునే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందా? ఒక కేంద్రం అనుమతులు రద్దయిన తర్వాత మరో పేరుతో కార్యకలాపాలు సాగిస్తే గుర్తించగలుగుతున్నారా? చట్టంలో నిబంధనలు ఉండటం మాత్రమే సరిపోదు. వాటిని ఉల్లంఘించడానికి అవకాశం లేకుండా పర్యవేక్షణ ఉండాలి.

గత ఘటనలు హెచ్చరించినా.. మారని పరిస్థితి!

తెలంగాణలో అండాల అక్రమ సేకరణ వ్యవహారం గతంలోనూ వెలుగుచూసింది. 2025లో సృష్టి ఐవీఎఫ్ కేసు అనంతరం మరో ముఠాను పోలీసులు గుర్తించడం, ఫెర్టిలిటీ కేంద్రాల పాత్రపై విచారణ జరగడం, ప్రభుత్వం తనిఖీలు చేపట్టడం తెలిసిందే. అందుబాటులో ఉన్న నివేదికల ప్రకారం రాష్ట్రంలో 477 నమోదిత ఏఆర్‌టీ, సరోగసీ కేంద్రాలు ఉండగా, 379 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. 50 చోట్ల ఉల్లంఘనలు గుర్తించినట్లు, రెండు కేంద్రాల రిజిస్ట్రేషన్లు రద్దు కాగా, తొమ్మిది కేంద్రాల అనుమతులు సస్పెండ్ చేసినట్లు వార్తలు వెలువడ్డాయి.ఇన్ని తనిఖీలు, చర్యల తర్వాత కూడా మరో భారీ నెట్‌వర్క్ బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో గుర్తించిన లోపాలను సరిదిద్దారా? ఉల్లంఘనలకు పాల్పడిన కేంద్రాలపై తీసుకున్న చర్యలు ఎంతవరకు ఫలించాయి? ఏజెంట్ల కదలికలపై నిఘా పెట్టారా? తనిఖీలు ఆసుపత్రులకే పరిమితమై, వాటి వెనుక పనిచేసే మధ్యవర్తుల వ్యవస్థను విస్మరిస్తున్నారా? గత ఘటనల నుంచి గుణపాఠాలు నేర్చుకోకపోతే ఎన్ని దాడులు చేసినా ప్రయోజనం ఏముంటుంది?

మహిళల ఆరోగ్యంతో ప్రయోగాలా?

అండాల సేకరణలో హార్మోన్ల మందుల వినియోగం, అండాశయాల పర్యవేక్షణ, వైద్య పరీక్షలు అత్యంత కీలకం. సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా ఈ ప్రక్రియ చేపడితే ఓవేరియన్ హైపర్‌స్టిమ్యులేషన్ సిండ్రోమ్ (ఓహెచ్ఎస్ఎస్), తీవ్రమైన కడుపునొప్పి, ఉబ్బరం, రక్తం గడ్డకట్టడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అరుదైన సందర్భాల్లో ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు.డబ్బు ఆశ చూపి మహిళలకు ఇంజెక్షన్లు ఇచ్చి వదిలేస్తే వారి ఆరోగ్య బాధ్యత ఎవరిది? చికిత్స తర్వాత ఏవైనా సమస్యలు తలెత్తితే వైద్య సహాయం అందించేది ఎవరు? మహిళలకు బీమా కల్పించారా? వారి ఆరోగ్య చరిత్రను నమోదు చేశారా? రక్షించిన 43 మంది మహిళలకు తక్షణమే సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించాలి. అవసరమైన చికిత్స, మానసిక కౌన్సెలింగ్, దీర్ఘకాలిక ఆరోగ్య పర్యవేక్షణ కల్పించాలి. వారిని నిందితులుగా కాకుండా రక్షణ, పునరావాసం అవసరమైన బాధితులుగా చూడాలి. వారి వ్యక్తిగత వివరాలకు గోప్యత కల్పించాలి.

దాడులకే పరిమితం కాకుండా వ్యవస్థాగత చర్యలు అవసరం!

ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వం తక్షణమే సమగ్ర కార్యాచరణ చేపట్టాలి. దాతల వివరాలను చట్టబద్ధమైన జాతీయ రిజిస్ట్రీతో అనుసంధానించి, గోప్యతను కాపాడుతూ అర్హతలు, గత దాన ప్రక్రియల వివరాలను ధ్రువీకరించాలి. పోలీసు, వైద్యారోగ్య, కార్మిక, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. అనుమానాస్పద ఏజెంట్లు, మధ్యవర్తులు, అక్రమ వసతి కేంద్రాలపై నిఘా పెంచాలి.ఐవీఎఫ్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతోపాటు, వైద్య రికార్డులు, సమ్మతి పత్రాలు, బీమా వివరాలు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించాలి. అక్రమాలకు ఆధారాలు లభించిన సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. రక్షించిన మహిళలకు అందించిన వైద్య సహాయం, తనిఖీల ఫలితాలు, ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలను ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రజలకు వెల్లడించాలి. అప్పుడే పర్యవేక్షణ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

నేరం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. నేరానికి ముందే అడ్డుకట్ట వేయాలి!

సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు ఐవీఎఫ్ వంటి ఆధునిక వైద్య విధానాలు గొప్ప ఆశాకిరణం. ఆ వైద్య పరిజ్ఞానంపై ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతినకూడదు. అదే సమయంలో మాతృత్వం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల ఆశలను, ఆర్థికంగా బలహీనంగా ఉన్న మహిళల అవసరాలను అక్రమ వ్యాపారానికి పెట్టుబడిగా మార్చుకునే వారిని ఉపేక్షించకూడదు.ప్రతి ముఠా బయటపడినప్పుడు అరెస్టుల సంఖ్యను ప్రకటించడమే విజయంగా భావించకూడదు. ఆ ముఠా ఎలా ఏర్పడింది? ఎన్ని రోజులుగా పనిచేస్తోంది? ఎన్ని మంది మహిళలు ప్రభావితమయ్యారు? ఎవరెవరు లాభపడ్డారు? మళ్లీ ఇలాంటి ఘటన జరగకుండా ఏం చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాలి. నేరాలను అరికట్టే వ్యవస్థ ముందస్తుగా పనిచేసినప్పుడే ప్రజలకు నిజమైన భద్రత లభిస్తుంది.మహిళల శరీరం వ్యాపార వస్తువు కాదు.. వారి ఆరోగ్యం అక్రమ సంపాదనకు పెట్టుబడి కాదు! దాడులు చేసి ముఠాలను పట్టుకోవడం పోలీసుల తక్షణ బాధ్యత అయితే.. ఇలాంటి ముఠాలు పుట్టుకురాకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయడం ప్రభుత్వ బాధ్యత. అరెస్టులతో అక్రమాలకు తాత్కాలిక అడ్డుకట్ట పడవచ్చు.. పటిష్ఠమైన పర్యవేక్షణతోనే వాటికి శాశ్వత ముగింపు సాధ్యం!

వనం రామకృష్ణ,
9440724576
మేడ్చల్ జిల్లా లోకల్ గైడ్ స్టాఫ్ రిపోర్టర్.

ఎర్రబెల్లి సతీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు..

తెలిపిన మారబోయిన రవి యాదవ్

ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్ష



సైబరాబాద్, నవంబర్ 02 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): ఎల్లమ్మబండ ఆల్విన్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు జన్మదిన వేడుకలు సోమవారం ఎల్లమ్మబండలోని గోదా కృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ నాయకులు మారబోయిన రవి యాదవ్ పాల్గొని సతీష్ రావుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి సతీష్ రావుకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్ల జీవించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరింత చురుగ్గా ముందుకు సాగుతూ, రాజకీయ రంగంలో ఉన్నత పదవులు అలంకరించాలని, మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాంత్ యాదవ్, వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరలకు మించి సన్నబియ్యం విక్రయాలు.. పట్టించుకోని వ్యాపారులు

-ధరల నియంత్రణ కాగితాలకే పరిమితం.. సామాన్యుల జేబులకు చిల్లులు

-హెచ్చరికలకే పరిమితమైన అధికారులు.. అధిక ధరలతో వినియోగదారులపై భారం



శేరిలింగంపల్లి, నవంబర్ 02 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సన్నబియ్యం ధరలకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం గరిష్ట చిల్లర ధరలను నిర్ణయించినప్పటికీ మార్కెట్లో వ్యాపారుల తీరు మారడం లేదు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ పలు దుకాణాల్లో పాత ధరలకే బియ్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. దీంతో సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. బియ్యం నిత్యావసర వస్తువు కావడంతో ధరల పెరుగుదల ప్రతి కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం కొన్ని రకాల సన్నబియ్యం ధరలు కిలోకు రూ.80 నుంచి రూ.95 వరకు చేరడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరల నియంత్రణకు పౌరసరఫరాల శాఖ నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం బీపీటీ, కేఎన్ఎం రకాల బియ్యం కిలో గరిష్ట ధర రూ.66గా, తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్) రకానికి రూ.74గా, హెచ్ఎంటీ, జై శ్రీరాం రకాల బియ్యానికి రూ.79గా నిర్ణయించారు. ఈ ధరలకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులు, మిల్లర్లను ప్రభుత్వం హెచ్చరించింది. మరోవైపు బియ్యం ధరల పెరుగుదలపై ప్రజల నుంచి ఆందోళన వ్యక్తం కావడంతో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాపారులు, మిల్లర్లు, అధికారులతో సమావేశమై మార్కెట్ పరిస్థితులను సమీక్షించారు. అధిక ధరలకు విక్రయాలు, అక్రమ నిల్వలు, నల్లబజారు వ్యాపారానికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో పౌరసరఫరాలు, అమలు విభాగం, పోలీసు, జీఎస్టీ, తూనికలు-కొలతల శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపడుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లపై ప్రత్యేక నిఘా పెట్టారు. బేగంబజార్, నాంపల్లి, మహారాజ్‌గంజ్ ప్రాంతాలలోను తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయితే అధికారుల తనిఖీలు, హెచ్చరికలు వ్యాపారులకు పరిమితమవుతున్నాయని వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల వారీగా ధరలను పరిశీలించి, నిర్ణయించిన గరిష్ట ధరలకు మించి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రతి దుకాణంలో బియ్యం రకాల వారీగా గరిష్ట ధరలను వినియోగదారులకు కనిపించేలా ప్రదర్శించాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నల్గొండ జాతీయ మహాసభలకు తరలిరండి - కురవిలో రైతు సంఘం పిలుపు



లోకల్ గైడ్ నవంబర్ 02 మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కేంద్రంలోరైతు సంఘం జాతీయ మహాసభల జయప్రదం కోసం ప్రచారం. ఏఐకేఎస్ మహాసభలను జయప్రదం చేయాలి: రైతు సంఘం కురవి మండల కమిటీ నల్గొండలో జరుగు ?రైతు సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కురవి మండల రైతు సంఘం ఆధ్వర్యంలో కురవి మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి నల్లపు సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల వల్ల తెలంగాణ రైతాంగం తీవ్ర సమస్యలు ఎదుర్కొంటుందని, రైతాంగ సమస్యల సాధన కోసం నల్లగొండలో ఈనెల 15 నుండి 18 వ తేదీల్లో జరుగనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ రైతు సంఘం జాతీయ మహాసభలకు ప్రతి ఒక్క రైతు కుటుంబం హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 15న లక్ష మంది రైతులతో భారీ ప్రదర్శన తదనంతరం నల్గొండ ఎన్జీ కళాశాల గ్రౌండ్లో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభకు దేశ నలుమూలల నుండి 1500 మంది రైతు ఉద్యమ నేతలు మరియు ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సభలో ప్రధానంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి వాటి పరిష్కారానికి భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జక్కుల మల్లయ్య, పిట్టల వెంకన్న, మల్లేడి కోటయ్య, కేదాసు మాధవరావు, కొండబత్తుల వెంకన్న, మోహన్ రావు, మాలోతుభద్రు, లక్ష్మి, వీరన్న, రాము, సీతారాం తదితరులు పాల్గొన్నారు.


అక్రమంగా అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

కస్టమర్ సర్వీస్ పాయింట్ కేంద్రాన్ని అడ్డుపెట్టుకుని అక్రమ వడ్డీ వ్యాపారం

నిందితుడి వద్ద నుంచి చెక్కు, బ్యాంకు పాస్ పుస్తకం, డిపాజిట్ రశీదులు, నకిలీ రబ్బరు ముద్ర స్వాధీనం

ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ బి. ప్రవీణ్ కుమార్





అదిలాబాద్ లోకల్ నవంబర్ 2: అరెస్టు అయిన నిందితుడి వివరాలు:అడే కైలాష్ (36)సా/శీ రాదయ్య,వృత్తి: వినియోగదారుల సేవా కేంద్రం యజమానినివాసం: జల్దా గ్రామం, ఇచ్చోడ మండలం.ఇచ్చోడ:ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ ఎక్స్ రోడ్ వద్ద ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో నిర్వహిస్తున్న వినియోగదారుల సేవా కేంద్రాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని ఇచ్చోడ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు అమాయక ప్రజలకు అధిక వడ్డీపై అప్పులు ఇచ్చి వారి వద్ద నుంచి చెక్కులు, ఇతర పత్రాలు సేకరిస్తూ, ఎలాంటి చట్టబద్ధమైన అనుమతి లేకుండా అక్రమంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అంతేకాకుండా బ్యాంకు సేవా కేంద్రం ముద్రను దుర్వినియోగం చేస్తూ నకిలీ రబ్బరు ముద్రను ఉపయోగించినట్లు గుర్తించారు. ఈ మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో 501/2026, తెలంగాణ ప్రాంత వడ్డీ వ్యాపారుల చట్టం సెక్షన్ 3(5)(బి) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి వద్ద నుంచి ఒక ఖాళీ చెక్కు, ఒక బ్యాంకు పాస్ పుస్తకం, సేవా కేంద్రం ముద్రతో ఉన్న రెండు బ్యాంకు డిపాజిట్ రశీదులు, నాలుగు బ్యాంకు డిపాజిట్ రశీదులు, ఒక నకిలీ రబ్బరు ముద్రను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేని వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి అప్పులు తీసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, ఆర్థిక లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

బాధితుల ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి

సమస్యలు పరిష్కారమైనప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది

పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహణ

జిల్లా వ్యాప్తంగా 34 ఫిర్యాదులను నేరుగా స్వీకరించిన జిల్లా ఎస్పీ

సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి సమస్యల పరిష్కారానికి సూచనలు

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్



అదిలాబాద్ లోకల్ గైడ్ నవంబర్ 2 : బాధితుల ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 34 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి నేరుగా విన్నవించారు. ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ బాధితుల సమస్యలను స్వయంగా విని, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితుల సమస్యలను పరిష్కరించినప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం, విశ్వాసం మరింత పెరుగుతాయని తెలిపారు. ప్రజలు పోలీసుల ద్వారా పరిష్కరించదగిన సమస్యలపై నిర్భయంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని లేదా నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 8712659973 వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు లేని, గంజాయి మరియు మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను నిర్మించేందుకు యువత, ప్రజలు పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, సిబ్బంది వాణిశ్రీ, వామన్, సునీల్, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

నోటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

దీపావళి వేళ దంతాల పరిశుభ్రతను నిర్లక్ష్యం చేయొద్దు.. రోజువారీ దంత సంరక్షణతోనే

ఆరోగ్యకరమైన చిరునవ్వు-స్మిత డెంటల్ క్లినిక్ అధినేత..డాక్టర్ శ్రీధర్ రెడ్డి



శేరిలింగంపల్లి, నవంబర్ 02 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): దీపావళి పండుగ సందర్భంగా ఇళ్లను శుభ్రం చేసుకోవడంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం, ముఖ్యంగా నోటి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్మిత డెంటల్ క్లినిక్ అధినేత డాక్టర్ శ్రీధర్ రెడ్డి సూచించారు. పండుగ సమయంలో స్వీట్లు, ఇతర తీపి పదార్థాలు, చిరుతిళ్లు అధికంగా తీసుకోవడం వల్ల దంత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల పండుగ వేడుకల్లో ఆహారపు అలవాట్లతోపాటు దంతాల సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజూ దంతాలపై పేరుకుపోయే పాచి (ప్లేక్)ను సక్రమంగా తొలగించకపోతే దంతక్షయం, చిగుళ్ల సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రోజుకు కనీసం రెండుసార్లు బ్రష్ చేయడం, దంతాల మధ్య పేరుకుపోయిన ఆహార పదార్థాలను శుభ్రం చేయడం, తీపి పదార్థాల వినియోగాన్ని పరిమితం చేయడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రాత్రి నిద్రపోయే ముందు తప్పనిసరిగా దంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సరైన టూత్‌పేస్ట్ ఎంపిక కూడా ముఖ్యమని డాక్టర్ శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. దంత సంరక్షణలో నిత్యం పాటించే చిన్న చిన్న జాగ్రత్తలే భవిష్యత్తులో వచ్చే అనేక సమస్యలను నివారించగలవని వివరించారు. దీపావళి పండుగ వేళ ఆనందోత్సాహాలతో గడుపుతూనే నోటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, పండుగకే పరిమితం కాకుండా ఏడాది పొడవునా దంత పరిశుభ్రత అలవాట్లను కొనసాగించాలని డాక్టర్ శ్రీధర్ రెడ్డి ప్రజలకు సూచించారు. క్రమబద్ధమైన దంత సంరక్షణతో ఆరోగ్యకరమైన చిరునవ్వును సొంతం చేసుకోవచ్చని తెలిపారు.

తెలంగాణలో స్మైల్ ప్రో (- స్మైల్ ప్రో వీసు మాక్స్ 800) టెక్నాలజీని పరిచయం చేసిన తొలి కార్పొరేట్ ఐ కేర్ చెయిన్‌గా మ్యాక్సివిజన్

ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ నటుడు నాగార్జున



కుత్బుల్లాపూర్ నవంబర్ 2 (లోకల్ గైడ్ ప్రతినిధి) : హైదరాబాద్‌లోని సోమాజిగూడ కేంద్రంలో మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అత్యాధునిక 'స్మైల్ ప్రో' (స్మైల్ ప్రోబివిస్సు మాక్స్ 800) టెక్నాలజీ ప్రారంభమైంది. ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా విచ్చేసి మ్యాక్సివిజన్ అధికారుల సమక్షంలో దీన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి, చైర్మన్ డాక్టర్ జీఎస్‌కే వేలు, చీఫ్ క్లినికల్ ఆఫీసర్ డాక్టర్ వరుణ్ మల్హోత్రా, డాక్టర్ అనిత సి.కామర్తి, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ గణేష్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ టెక్నాలజీని ప్రవేశపెట్టడం ద్వారా తెలంగాణలో 'విసుమాక్స్ 800' సాంకేతికతను అందిస్తున్న తొలి కార్పొరేట్ ఐ కేర్ చెయిన్‌గా మ్యాక్సివిజన్ అవతరించింది. ఈ నెక్ట్-జెన్ లేజర్ సర్జరీ ద్వారా కార్నియాలో ఎలాంటి ఫ్లాప్ సృష్టించకుండా, అతి చిన్న కోత ద్వారా కేవలం 10 సెకన్లకంటే తక్కువ సమయంలో చికిత్స పూర్తి కావడం, తక్కువ కోలుకునే సమయం ఉండటం దీని ప్రత్యేకత. తగిన అర్హత ఉన్న రోగులలో మయోపియా, ఆస్టిగ్మాటిజం వంటి సాధారణ దృష్టి సమస్యలను సరిచేయడానికి ఇది దోహదపడుతుంది. నేత్ర వైద్య రంగంలో అత్యాధునిక సాంకేతికతలను స్వీకరిస్తూ రోగులకు మెరుగైన సేవలను అందించాలనే తమ నిబద్ధతను ఈ వేదికగా వైద్య నిపుణులు పునరుద్ఘాటించారు. రెఫ్రాక్టివ్ ప్రొసీజర్లతో పాటు కంటిశుక్లం, రెటినా, గ్లకోమా, కార్నియా కేర్ వంటి సమగ్ర సేవలను మ్యాక్సివిజన్ అందిస్తోంది. ఈ అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో రోగులకు మరింత మెరుగైన, నమ్మకమైన కంటి వైద్య సేవలు అందనున్నాయి. అత్యున్నత ప్రమాణాలు కలిగిన ఈ వైద్య విధానం ద్వారా రోగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరగా కోలుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులోనూ ఇలాంటి అధునాతన టెక్నాలజీలను పరిచయం చేస్తూ, ప్రజలకు మరింత నాణ్యమైన కంటి సంరక్షణను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని మ్యాక్సివిజన్ యాజమాన్యం స్పష్టం చేసింది.

రోహిత అవయవదానం ఆరుగురికి పునర్జన్మ

చిన్నారి త్యాగం స్ఫూర్తిదాయకం.. కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని ప్రశంసించిన..సీపీ సజ్జనార్



హైదరాబాద్, నవంబర్ 02 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): బాలానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన 13 ఏళ్ల చిన్నారి గూడ రోహిత అవయవదానం ద్వారా ఆరుగురికి కొత్త జీవితాన్ని ప్రసాదించింది. చిన్న వయసులోనే ఆమె అవయవదానం ద్వారా పలువురి జీవితాల్లో వెలుగులు నింపడం స్ఫూర్తిదాయకమని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ కొనియాడారు. కూకట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న రోహిత రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. చికిత్స పొందుతున్న క్రమంలో బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ, ఆమె కుటుంబ సభ్యులు గొప్ప మనసుతో అవయవదానానికి అంగీకరించారు. వారి నిర్ణయంతో ఆరుగురు ప్రాణాలు నిలబెట్టుకునే అవకాశం కలిగింది. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ చిన్నారి కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని అభినందించారు. రోహిత భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆరుగురి జీవితాల్లో చిరస్థాయిగా జీవిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి మానవతా నిర్ణయాలు సమాజంలో అవయవదానంపై మరింత అవగాహన కల్పిస్తాయని, రోహిత కుటుంబం అందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



లోకల్ గైడ్ నవంబర్ 02.మహబూబాబాద్ : వసతి గృహాల నిర్వహణలలో క్షేత్రస్థాయి తనిఖీ నివేదికలు ఇవ్వాలి.పక్కా డైట్ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలి. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అన్ని విభాగాలకు సంబంధించిన విద్యాసంస్థలు వసతి గృహాల నిర్వహణలో ప్రత్యేక అధికారులు తనిఖీ నిర్వహించి నివేదికలను వెంటనే సమర్పించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న పక్కా డైట్ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని విద్యార్థినీ విద్యార్థులకు అందించాలని, నాణ్యమైన సరుకులు కొనుగోలు చేయాలని, షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఫుడ్ కు సంబంధించిన టైం ఫోటోలు తెప్పించుకోవాలన్నారు, సిల్క్ డెవల్పమెంట్ కోర్సులపై దృష్టి పెట్టిన సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారిని నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిపిఓ రేవంత్, న్యాయ సేవ సహకార సంస్థ ప్రతినిధి లతో కలిసి కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ



క్షేత్రస్థాయిలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మండల ప్రజాపరిషత్ కార్యాలయాలలో కొనసాగే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం చేసుకున్న దరఖాస్తులను వేగంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు, ప్రజలకు సత్వరమైన సేవలు అందించే కోసం డివిజనల్, మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు, జిల్లాలోని అన్ని విభాగాల విద్యాసంస్థలు వసతి గృహాలలో త్రాగునీరు సరఫరా, విద్యుత్, హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ లపై ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి అట్టి నివేదికలను వెంటనే సమర్పించాలని సూచించారు, విద్యా సంస్థ లలో చిన్న చిన్న మైనర్ రిపేర్ లు ఒక్క లక్ష లోపు ఉంటే వెంటనే పనుల ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని, అనుమతి తక్షణమే ఇవ్వడం జరిగిందన్నారు.మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు అందాయి. జిల్లా కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు సమర్పించారు.కేసముద్రం మండలం సర్వపురం తండాకు చెందిన పి. భద్రు తన తండ్రి నుంచి సంక్రమించిన పట్టా భూమి (సర్వే నం. 191/10/3, ఖాతా నం. 861) ధరణి పోర్టల్‌లో ఆబ్జెక్షన్ (అన్-అప్రూవ్డ్) గా నమోదైందని, పరిశీలించి డిజిటల్ సంతకంతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.నెల్లికుదురు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన బి. రంగమ్మ తన పాత ఇల్లు కూలిపోవడంతో నిలువ నీడ లేక ఇబ్బంది పడుతున్నానని, సర్వే రికార్డులలో తప్పుగా ఆర్సీసీ భవనంగా నమోదైన అంశాన్ని సరిచేసి ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్జీ అందజేశారు.మహబూబాబాద్ పట్టణంలోని 28వ వార్డులో గల దాదాపు 200 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన 'హనుమంతుని గడ్డ శ్రీ భక్త హనుమాన్ దేవాలయం' రక్షణ, నిర్వహణ మరియు అభివృద్ధి నిమిత్తం తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకోవాలని చుక్కల నరేష్ వినతిపత్రం సమర్పించారు.ఈ రోజు ప్రజావాణిలో జిల్లా మొత్తంలో (181) అర్జీలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లా స్థాయి: (115) డివిజన్ స్థాయి: (07), మండల స్థాయి: (59) దరఖాస్తులు వచ్చాయి, మండలలో అధికారులతో గూగుల్ మీట్ ద్వారా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ పరిష్కారం చేసారు.ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దేశిత గడువులోగా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు సత్వర న్యాయం చేయాలని స్పష్టం చేశారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పర్యవేక్షకులు, రాజేష్, దామోదర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

-- ఎన్నికల వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం ఆపాలి....!

డిఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు గూగులోతు సూర్య ప్రకాష్ , మడకం వంశీ లు డిమాండ్.....



లోకల్ గైడ్ నవంబర్ 2 హైదరాబాద్/ఎల్ బి నగర్: కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థను తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని డిఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు గూగులోతు సూర్య ప్రకాష్, మడకం వంశీలు తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ఉపయోగించుకొని పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగిస్తున్నారని సోమవారం ఎల్ బి నగర్ మెట్రో స్టేషన్ సమీపంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నిరసన చేపట్టారు...ఈ పరిణామాలు పరోక్షంగా బీజేపీకి రాజకీయ ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయని ఆరోపించారు. ఈ దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతోందని, ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా పత్రాల దుర్వినియోగం కూడా జరుగుతోందని మండిపడ్డారు. ఎంపీలను ప్రలోభపెట్టి ప్రభుత్వాలను మార్చడం, వివాదాలు సృష్టించడం వంటి రాజకీయ పరిణామాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారుతున్నాయని అన్నారు.దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్ల తొలగింపునకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలిగిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఎస్ఐఆర్ (ర×=) ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, ఎన్నికల సంఘం పనితీరుపై పారదర్శక విచారణ జరిపించాలని కోరారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం అధికారంలో ఉన్న ప్రభుత్వానికి అనుకూలంగా కాకుండా రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం విద్యార్థి, యువజన సంఘాలు దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరుస్తూ ఓటు హక్కు పరిరక్షణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు అవినాష్,రఘురామ్ గౌడ్, తరుణ్,వంశీ,గణేష్,ఆదిత్య,విష్ణు,వినయ్, అరుణ్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు..

చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు అదృశ్యం

ఇంటర్మీడియట్ విద్యార్థి సందీప్, యువతి మౌనిక ఆచూకీ కోసం కుటుంబ సభ్యుల ఆందోళన. .పోలీసులకు ఫిర్యాదు


సైబరాబాద్, నవంబర్ 02 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు అదృశ్య ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇంటర్మీడియట్ విద్యార్థి నల్లబెల్లి సందీప్ (18), నల్లగండ్లకు చెందిన బోయిని మౌనిక (21) అదృశ్యం కావడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ఇద్దరి ఆచూకీ కనుగొనాలని కోరుతూ కుటుంబ సభ్యులు చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలలు ఇలా ఉన్నాయి.. చందానగర్‌లోని శిల్పా ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న నల్లబెల్లి సింహాచలం కుమారుడు సందీప్ పటాన్‌చెరులోని మంజీరా కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. అక్టోబర్ 31న కళాశాలకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాడు. అనంతరం స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా మరో ఘటనలో నల్లగండ్ల ఆస్తా గ్రీన్ హోమ్స్‌లో నివసించే బోయిని తుకారాం కుమార్తె మౌనిక అక్టోబర్ 31న మధ్యాహ్నం స్నానం చేస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వరప్రసాద్ అనే యువకుడిని ఆమె గతంలో ప్రేమిస్తున్నట్లు చెప్పిందని, అతడిపై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. "అదృశ్యమైన వారి వివరాలు" సందీప్ నలుపు, ఎరుపు టీ-షర్టు, నలుపు ప్యాంటు ధరించి ఉండగా, మౌనిక ఊదా రంగు చుడీదార్ ధరించి ఉంది. సందీప్ ఆచూకీ తెలిసిన వారు 8897 677493, మౌనిక ఆచూకీ తెలిసిన వారు 63006 52682 నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. పోలీసులు ఇద్దరి అదృశ్య ఘటనలపై విచారణ జరిపి ఆచూకీ కనుగొనాలని బాధిత కుటుంబాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

జోగిని సుధాకర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు ఇద్దరి అరెస్ట్

పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ అక్షాంష్ యాదవ్







యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి చౌటుప్పల్ నవంబర్ 2 (లోకల్ గైడ్): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లో జరిగిన జోగిని సుధాకర్ హత్య కేసును చౌటుప్పల్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. హత్య కేసులో నిందితులు ఏ 1 గా ఉన్న పవన్ కుమార్ ఏ2 గా ఉన్న హర్ష సంతోష్ పాండే ఇద్దరినీ అరెస్టు చేశామని సోమవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో జిల్లా ఎస్పీ అక్షాంష్ యాదవ్ తెలిపారు. సుధాకర్ స్వామి పై స్పృ చల్లి కాళ్లు చేతులు చీరలతో కట్టేసి కత్తితో వెనుక భాగం వైపు పొడిచి హత్య చేశారని అనంతరం బంగారం, వెండి, నగదును సుధాకర్ స్వామి స్కార్పియో కారులోనే పారిపోయారని తెలిపారు. బంధువులు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు కారు నెంబరు సాంకేతిక ఆధారాలతో నాగపూర్ వైపు వెళుతుందని గుర్తించి జాతీయ రహదారి 44 పై గల టోల్ ప్లాజా ను అలర్ట్ చేస్తూ సంబంధిత పోలీసు వారికి సమాచారం ఇవ్వడం తో నేరస్తులను గంజాల్ టోల్ ప్లాజా నిర్మల్ జిల్లా వద్ద అ అరెస్టు చేశామని నిందితుల నుండి కిలో 300 గ్రాముల బంగారం, మూడు కేజీల వెండి రూ. 9,03300 నగదు స్కార్పియో కారును స్వాధీనం చేసుకున్నారు .వీటి మొత్తం విలువ 1, 73,63300 ఉంటాయని తెలిపారు. నిందితులపై సి ఆర్ నంబర్609 / 2026 యూ/ఎస్ 103(1),309(4),309(6), 305(బి) ఆర్/డబ్ల్యూ 3(5) బిఎన్ఎస్ ప్రకారం వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశామని అనంతరం చౌటుప్పల్ లోని కోర్టుకు తరలించామని తెలిపారు. ఈ కేసులో నేరస్తులను పట్టుకోవడంలో జిల్లా ఎస్పీ అక్షాంష్ యాదవ్ ఆదేశాల ప్రకారం డిఎస్పి మధుసూదన్ రెడ్డి సూచన ప్రకారం నేరం జరిగిందని తెలిసిన మూడు గంటలలోపే నేరస్తులను దొంగిలించిన సొత్తుతో సహా పట్టుకోవడం జరిగిందని ఈ కేసు విషయంలో నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్య వహించిన అధికారులు డిఎస్పి మధుసూదన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ డి. సతీష్ రెడ్డి, ఎస్సై ప్రవీణ్ కుమార్, సి సి ఎస్ ఎస్ ఐ కనకటి యాదగిరి, ఎస్సై రవీందర్, ఎస్సై అజయ్ భార్గవ్ సిబ్బంది నరేష్, నర్సిరెడ్డి, ఉపేందర్, జానకి రాములు, శ్రీను, సందీప్, నాగూర్ వలి, శేఖర్, నరేష్, భరద్వాజ్ ,వెంకన్న ,జంగయ్య, మహేష్, సందీప్, ఉపేందర్ వెంకటేశ్వర్లు, జంగులు, సైదులు, నాగరాజు లను పి ఎస్పి అభినందించి రివార్డులను అందజేశారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలి

డివిజన్‌కు 3 వేల నుంచి 4 వేల ఓట్లు నమోదు చేయించాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



శేరిలింగంపల్లి, నవంబర్ 02 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి చందానగర్ డివిజన్‌లో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ ముఖ్య నాయకులతో ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ..ఓటరు నమోదు గడువుకు సమయం తక్కువగా ఉన్నందున పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో 3 వేల నుంచి 4 వేల వరకు పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉమ్మడి చందానగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి - ఎస్పీ డా. శబరీష్



లోకల్ గైడ్ నవంబర్ 2.మహబూబాబాద్ : మాదకద్రవ్య రహిత సమాజం కోసం 3,000 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టిన ఇందుకూరి విజయలక్ష్మి (62) ని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ అభినందించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులు, యువతతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ నుంచి న్యూఢిల్లీ వరకు సుమారు 3,000 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టిన విజయలక్ష్మి సోమవారం మహబూబాబాద్ జిల్లా మీదుగా ఢిల్లీకి వెళ్తున్న క్రమంలో జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 62 ఏళ్ల వయస్సులోనూ సమాజ శ్రేయస్సు కోసం ఇంతటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు, యువతకు వివరించి వారిని మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు.మహబూబాబాద్‌లో కళాశా లల్లో అవగాహన ఈ యాత్రలో భాగంగా మహబూబాబాద్ టౌన్‌లో డీఎస్పీ తిరుపతిరావు, ఎస్సై అరుణ్, సూరయ్యల మార్గదర్శకత్వంలో పలు స్థానిక కళాశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విజయలక్ష్మి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష మంది విద్యార్థులకు అవగాహన లక్ష్యం. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా లక్ష మంది విద్యార్థులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ యాత్ర చేపట్టారు. అక్టోబర్ 22న ఏపీలోని భీమవరం అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ యాత్ర డిసెంబర్ 10న న్యూఢిల్లీలో ముగియనుంది. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

కోమటిరెడ్డి పై కూసుకుంట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం: కాసర్ల శ్రీనివాస్ రెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి చౌటుప్పల్ నవంబర్ 2 (లోకల్ గైడ్): చౌటుప్పల పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి పై జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలనకు వచ్చినా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలను మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కమిటీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నాం అని మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మచ్చలేని నాయకుడనీ ఆయన పై అసత్య ఆరోపణలు చేస్తే నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు బుద్ధి చెప్పుతారని అన్నారు.అఖిలపక్షం ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ పనులు పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీర్మానం చేసి అధికారులతో మాట్లాడారని నియోజకవర్గ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తున్న రాజగోపాల్ రెడ్డి పేద ప్రజల కోసం విద్యా వైద్య మాలిక సదుపాయాల విషయంలో రాజీ పడకుండా అభివృద్ధి చేస్తున్న రాజగోపాల్ రెడ్డి పై అవాకుల చివాకులు పెడితే ఖబర్దార్ కూసుకుంట్ల ప్రభాకర్ అని తీవ్రంగా మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇప్ప వెంకటేష్, అధికార ప్రతినిధి శ్యామకూర యాదయ్య, ఉపాధ్యక్షులు అంతటి బాలరాజు గౌడ్ , వర్కాల కుమారు, చెరుకు లింగస్వామి, ఎండి ,వహిద్వీన్, బండమీది మల్లేష్, గుండె బోయిన ఐలయ్య, ఎండి పరాజ్, మట్టపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 50 ఫిర్యాదులు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు- అధికారులకు..సిఎంసి ఆదేశాలు

సైబరాబాద్, నవంబర్ 02 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 50 ప్రజా ఫిర్యాదులు స్వీకరించారు. విభాగాల వారీగా టౌన్ ప్లానింగ్‌కు 27, ఇంజినీరింగ్‌కు 14, పారిశుద్ధ్యానికి 2, సరస్సుల విభాగానికి 2, ట్రేడ్ లైసెన్స్, పశువైద్య, ప్రకటనలు, విద్యుత్, రెవెన్యూ (ఆస్తి పన్ను) విభాగాలకు ఒక్కో ఫిర్యాదు చొప్పున అందాయి. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య, పరిశీలన లింక్ కేటాయించారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన పౌర సేవలు అందించేందుకు సిఎంసి కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

ఎండిన పంట పొలాల సర్వేను పరిశీలించిన వ్యవసాయ అధికారి

లోకల్ గైడ్ ఆమనగల్లు, నవంబర్ 2 : ఆమనగల్లు మండలంలోని కోనాపూర్, శెట్టిపల్లి, పోలేపల్లి గ్రామాల్లో ఎండిన పంట పొలాల సర్వేను వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ సోమవారం పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో పర్యటించి పంట నష్టానికి సంబంధించిన సర్వే వివరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, రైతులు తమ గ్రామాల్లో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అందుబాటులో ఉండి, ఎండిన పంట పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు చూపించాలని సూచించారు. పంట నష్టపోయిన విస్తీర్ణాన్ని సర్వేలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. సర్వే ప్రక్రియకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోనాపూర్ సర్పంచ్ శ్రీలత, శెట్టిపల్లి సర్పంచ్ జంగమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారులు భూదేవి, మీనాక్షి, ప్రభావతితో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రియా యోగా శిక్షణ.. పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ఖానాపూర్ విజేత హైస్కూల్ విద్యార్థులకు

ఉచిత యోగా తరగతులు

ప్రతి విద్యార్థి ఐదు మొక్కలు నాటి సంరక్షించాలి:

డా. సత్యం స్వామీజీ





కుత్బుల్లాపూర్ నవంబర్ 2 (లోకల్ గైడ్ ప్రతినిధి) : విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు యోగా, ఆయుర్వేదం, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేసే ఉద్దేశంతో నిర్మల్ జిల్లా నవాబ్‌పేట్‌లోని సత్యం ట్రెడిషనల్ మెడిసినల్ ట్రీట్‌మెంట్ యోగాశ్రమం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖానాపూర్‌కు చెందిన విజేత హైస్కూల్ విద్యార్థులకు డా. సత్యం స్వామీజీ ఉచితంగా క్రియా యోగా తరగతులు నిర్వహించారు.యోగాశ్రమ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో డా. సత్యం స్వామీజీ విద్యార్థులకు క్రియా యోగా ప్రాముఖ్యతను వివరించడంతో పాటు స్వయంగా యోగా సాధన చేయించారు. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత పెంపొందుతాయని తెలిపారు. అలాగే ఆయుర్వేద వైద్య విధానాలు, వాటి విశిష్టతలను వివరించారు. యోగా, ఆయుర్వేదానికి సంబంధించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం విద్యార్థులు యోగాశ్రమంలోని ప్రకృతి వాతావరణాన్ని సందర్శించి ఆనందంగా గడిపారు. ఆశ్రమంలో పెంచుతున్న పచ్చని చెట్లు, వివిధ రకాల అరుదైన పండ్ల మొక్కలను ఆసక్తిగా పరిశీలించారు. మియాజాకి మామిడి, ప్యాషన్ ఫ్రూట్, నోని, అవకాడో తదితర పండ్ల మొక్కల ప్రత్యేకతలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి పరిరక్షణ, జీవవైవిధ్యం, పచ్చదనం ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా. సత్యం స్వామీజీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కనీసం ఐదు మొక్కలు నాటి, అవి పెద్దయ్యే వరకు బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఎదురయ్యే కరువు పరిస్థితులను ముందుగానే గుర్తించి, ప్రకృతి పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. సమృద్ధిగా వర్షాలు కురవడానికి పచ్చదనం ఎంతో అవసరమని, చెట్ల పెంపకం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం నాటే మొక్కలే భవిష్యత్ తరాలకు ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుతాయని వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు యోగా, ఆయుర్వేదం, ప్రకృతి పరిరక్షణపై విలువైన అవగాహన కలగడంతో పాటు ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన అనుభూతి లభించింది.ఈ కార్యక్రమంలో విజేత హైస్కూల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, సత్యం ట్రస్ట్ ట్రెజరర్ మేడి చంద్రశేఖర్, ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరిశోధన ఫలాలు క్షేత్రస్థాయిలో వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాలను ఎదుర్కొనేలా ఉండాలి

- ఐ సి ఏ ఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్.జాట్.





రాజేంద్రనగర్ నవంబర్ 2, (లోకల్ గైడ్):పరిశోధన ఫలితాలు క్షేత్రస్థాయిలో వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేలా ఉండాలని డేర్ కార్యదర్శి, ఐసిఐఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎం ఎల్ జాట్ అన్నారు. ఐసిఎఆర్ పరిశోధన నిర్వహణ నిపుణుల (ఆర్ఎంపి) కోసం 'నాయకత్వ శ్రేష్ఠత'పై రాజేంద్రనగర్ లోని నార్మ్ లో నిర్వహించిన కార్యనిర్వాహక సమావేశం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ జాట్ మాట్లాడుతూ, భారతదేశ వ్యవసాయ పరిశోధన అజెండాను అభివృద్ధి చెందుతున్న ప్రపంచ సవాళ్లకు అనుగుణంగా మార్చడానికి ఒక వ్యూహాత్మక, అనుకూలమైన దృక్పథాన్ని అభివృద్ధి చేయడం ఎంతో అవసరం అన్నారు. పరిశోధన ఫలితాలు క్షేత్రస్థాయి వ్యవసాయ సవాళ్లను పరిష్కరించేలా, గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరచేలా ఉండాలాన్నారు. రైతు-కేంద్రీకృత ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థల వైపు ఒక నమూనా మార్పు కోసం ఆయన పిలుపునిచ్చారు. వేగంగా మారుతున్న వ్యవసాయ, పర్యావరణ పరిణామాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిర్వాహక సామర్థ్యాలను బలోపేతం చేయవలసిన ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, ఆర్ఎమ్పి అధికారులు సమకాలీన కార్యనిర్వాహక నిర్వహణ నైపుణ్యాలతో సన్నద్ధం కావాలని డాక్టర్ జాట్ ఉద్ఘాటించారు. ఐసిఎఆర్ సంస్థలన్నింటిలో కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడానికి, వనరుల అనుకూల కేటాయింపును ఆర్థిక, మౌలిక సదుపాయాలు, మానవ వనరుల సమర్థవంతమైన వినియోగాన్ని ఆయన సమర్థించారు. నార్మ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. మీనాక్షి సుందరం పరిశోధన నాయకత్వాన్ని, సంస్థాగత ప్రభావాన్ని బలోపేతం చేయడంలో వ్యూహాత్మక కార్యనిర్వాహక అభివృద్ధి యొక్క ప్రాముఖ్యత ఎంతో అవసరం అన్నారు. జాయింట్ డైరెక్టర్, ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ వందన సమర్పణ చేశారు.అంతకుముందు, ఎన్ఏఐఆర్ఎమ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ మానవ వనరుల విభాగం అధిపతి డాక్టర్ బి. గణేష్ కుమార్ కార్యక్రమ నివేదికను సమర్పించారు. ఎన్ఏఐఆర్ఎమ్ లో నిర్వహించిన 19వ ఈడీపీ ఈ డీ పి పదమూడు మంది సీనియర్ వ్యవసాయ పరిశోధన నాయకులు హాజరయ్యారు.

అంగన్వాడి టీచర్స్ ఆయా పోస్టులకు దరఖాస్తులు



అదిలాబాద్ లోకల్ నవంబర్ 2 : అదిలాబాద్ జిల్లా కేంద్రంలో... స్థానిక ఐసిడిఎస్ అదిలాబాద్ అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఓ సౌందర్య మాట్లాడుతూ... అంగన్వాడి టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకున్నవారు... అదిలాబాద్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని చాందా మన్నూర్ గ్రామాల దరఖాస్తుదారులు...ఈ నెల తేదీ 3న అనగా మంగళవారం నాడు / అంకోలి, పిప్పల్ దరి గ్రామాల దరఖాస్తుదారులు ఈనెల తేదీ 4 బుధవారం నాడు.../ యాపల్ గూడ,మావల గ్రామాల దరఖాస్తుదారులు తేదీ 5 గురువారం నాడు/ గుడిహత్నూర్ నుండి దరఖాస్తు చేసుకున్న అర్హులైన దరఖాస్తుదారులు...6 వ తేదీ శుక్రవారం నాడు... జిల్లా కేంద్రంలో స్థానిక బాబు జగ్జీవన్ రామ్ గారి చౌక్ లో గల సిడిపిఓ ఐసిడిఎస్ అదిలాబాద్ అర్బన్ ప్రాజెక్ట్ కార్యాలయం లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, గౌరవ జిల్లా కలెక్టర్ రాజర్షి షా గారి ఆధ్వర్యంలో నియామకాలు చాలా పారదర్శకంగా జరుగుతాయని.. దరఖాస్తుదారుల వారి వారి మెరిట్ ప్రకారం ప్రాధాన్యత ఉంటుంది కాబట్టి ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని అంటే నమ్మవద్దని కోరారు.

మియాపూర్ సర్కిల్లో వీధి వ్యాపార జోన్ల నిర్వహణపై సమావేశం

-ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు.. టౌన్ వెండింగ్ కమిటీ చర్చలు



సైబరాబాద్, నవంబర్ 02 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం మియాపూర్ సర్కిల్-48 కార్యాలయంలో టౌన్ వెండింగ్ కమిటీ (టీవీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ), అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ), పోలీస్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, ప్రాజెక్ట్ ఆఫీసర్ (పీఓ), ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీధి వ్యాపార జోన్ల గుర్తింపు, నియంత్రణ, నిర్వహణపై చర్చించారు. వీధి వ్యాపార కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడటం, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టడంపై సమీక్షించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వీధి వ్యాపార జోన్లను క్రమబద్ధంగా నిర్వహించాలని సమావేశంలో చర్చించారు.

ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ



కామారెడ్డి జిల్లా, (లోకల్ గైడ్) : రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలో సోమవారం రోజున లబ్ధిదారు కమ్మరి కృష్ణవేణి ఇందిరమ్మ ఇల్లుకు గ్రామ సర్పంచ్ శివారాణి రాజేందర్ ఆధ్వర్యంలో భూమి పూజ చేసి ముగ్గు పోశారు,, అనంతరం ఇందిరమ్మ ఇల్లు అక్కుపత్రాన్ని లబ్ధిదారునికి అందజేశారు, ప్రతి ఇల్లు లేని పేద కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని లన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ అరుణ్, వార్డ్ మెంబర్స్ అమీర్ , రాజలింగం, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు ఆరే రవి, ఇంద్రమ్మ ఇల్లు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,బిస్ కాలనీ లో 33 కెవి విద్యుత్ లైన్ తొలగించాలి



నారాయణపేట నవంబర్ 2: మాగనూరు మండల కేంద్రంలోని ఎస్సి బీసీ కాలనీలో 33 కెవి విద్యుత్తు లైను తొలగించాలని కాలనీ వాసులు ప్రజావాణిలో ఎంపీ ఓ కళ్యాణికి వినతి పత్రం సమర్పించారు. గతం లో ఇంటి స్థలాలను ప్రభు త్వం ఇల్లు నిర్మించుకొను టకు కేటాయించింది కానీ విద్యుత్తు లైను ఉండడం మూలంగా లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోలేక పోతున్నారు.దీనివల్ల ఇల్లు నిర్మించుకొనుటకు ఇబ్బం దులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉందనీ పేర్కొన్నారు.ఈ లైను ఇండ్ల మధ్యలో ఉండటం మూలం గా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో ఇట్టి విషయాన్ని అధికార దృష్టికి తెచ్చిన ఎలాంటి ప్రయోజనం లేదనీ అధికారుల స్పందించి కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 33 కెవి విద్యు త్తు లైను తొలగించి ఇంటి నిర్మాణాలకు సహకరించా లని కోరారు. ఈ కార్యక్ర మంలో కాలనీవాసులు ఉప సర్పంచ్ పెద్దింటి రాజు పుంజనూరు ఆంజనేయు లు కావలి నరేందర్ ఎండి హనీఫ్ బ్యాగరి దత్తు పెద్దిం టి పరశు రాం చాకలి వెంకటేష్ జంగిటి వాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా ఖో-ఖో శిక్షణ శిబిరంలో తెలంగాణ జట్టు క్రీడాకారులు విజేతలుగా నిలవాలి



నారాయణపేట నవంబర్ 2: రాష్ట్ర మంత్రివర్యులు క్రీడాశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఖేలో ఇండియా ఖో ఖో శిక్షణ శిబిరాన్ని మక్తల్ పట్టణంలో క్రీడా మైదానం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మక్తల్ మినీ మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హనుమంతు 16వ వార్డు కౌన్సిలర్ పావని పాల్గొన్నారు. ఈ సందర్భం గా పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పట్టణ అధ్యక్షులు ఏ రవికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ డి గణేష్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ కట్ట సురేష్ , కోళ్ల వెంకటేష్, కౌన్సిలర్ రహీం పటేల్ ,నీలప్ప ముదిరాజ్, నీలా గౌడ్,ఆర్ఎంపి శంకర్ ,ఏఎంసీ డైరెక్టర్ ఫయాజ్ మంజూరు ఇలాహ, డివోఎస్ఓ వెంకటశెట్టి వివిధ పాఠశాల పిడి లు,కోచ్ లు పాల్గొన్నా రు.ఖేలో ఇండియా కార్యక్ర మంలో భాగంగా నిర్వహి స్తున్న ఖో-ఖో శిక్షణ శిబిరంలో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారివెంకటేష్ శెట్టి ఆకాంక్షించారు.క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, నిరం తర సాధనతో తమ నైపు ణ్యాలను మెరుగుపరు చుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావ డంతో పాటు, జాతీయ స్థాయిలో కూడా రాణించా లని తెలిపారు. క్రీడాకారుల కు అవసరమైన శిక్షణ, ప్రోత్సాహం అందించేందు కు క్రీడా శాఖ కృషి చేస్తోందని పేర్కొన్నారు. క్రీడాకారులు ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకొ ని తమ ప్రతిభను నిరూపించుకోవాలని అన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వర పరిష్కారం చూపాలి

ఎస్ డి సి రాజేందర్ గౌడ్

నారాయణపేట నవంబర్ 2 : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వాటిని సంబంధిత శాఖల అధికా రులు క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఎస్.డి.సి.రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్ సూచించా రు.సోమవారం జిల్లా కలెక్ట రేట్‌లోని ప్రజావాణి హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ అంశాలపై అర్జీలను సమర్పించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఎస్ ఎస్.డి.సి.రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్ అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. ప్రజావాణిలో అంది న ప్రతి ఫిర్యాదును బాధ్య తాయతంగా పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్క రించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.కాగా, సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 49 అర్జీలు అందినట్లు కలెక్టరేట్ ప్రజావాణి విభాగం అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక

మృతి చెందిన హోంగార్డ్ కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుంది: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట నవంబర్ 2: నారాయణపేట జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డు గా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన బాలకృష్ణ కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ అండగా నిలిచింది. పోలీస్ వెల్ఫేర్ నిధి నుంచి మంజూరైన రూ. 15వేల పరిహార చెక్కు ను సోమవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మృతుడి భార్య భవానికి అందజేశా రు.కొత్తపల్లి మండలం గోకుల్ నగర్‌కు చెందిన బాలకృష్ణ నారాయణపేట జిల్లా పోలీస్ శాఖలో హోం గార్డుగా విధులు నిర్వహిం చారు. ఆయన ఆకస్మిక మరణంతో భార్య భవాని, ముగ్గురు చిన్నారులు కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ లో బాలకృష్ణ అందించిన సేవలను గుర్తు చేసుకున్నా రు. విధి నిర్వహణలో భాగంగా పోలీస్ శాఖకు సేవలందించిన సిబ్బంది కుటుంబాలకు శాఖ ఎల్ల ప్పుడూ అండగా ఉంటుం దని, ఆపద సమయంలో వారికి అవసరమైన సహా య సహకారాలు అందిం చేందుకు పోలీస్ శాఖ ముందుంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్,ఆర్ ఎస్పై శివ శంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ టి ఆర్ ఎస్ అభ్యర్థిగా ఆకాష్ కొల్లూరు ను గెలిపించాలి

టి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



నారాయణపేట నవంబర్ 2 : రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో టి ఆర్ ఎస్ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు ను గెలిపించాలని నారాయణపేట జిల్లా టి ఆర్ ఎస్ అధ్యక్షుడు గవినో ల్ల శ్రీనివాస్ కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లాలోని అర్హులైన పట్టభ ద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకో వాలని కోరారు.గతంలో పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకొని ఓటు వేసినవారు సైతం ప్రస్తుత ఎన్నికల కోసం మళ్లీ కొత్తగా ఫారం--18 నింపి నమోదు చేసుకోవాలనిసూచించారు.తెలంగాణ రక్షణ సేన పార్టీ తరఫున పట్టభద్రుల ఎమ్మె ల్సీ ఎన్నికల్లో బలహీన వర్గాలకు చెందిన ఆకాష్ కొల్లూరును పార్టీ అభ్యర్థిగా బరిలో నిలబెట్టడం జరిగిందని తెలిపారు.నిరుద్యోగులు, ఉద్యోగులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలకు చట్టసభల్లో గొంతుకగా నిలవడమే తెలంగాణ రక్షణ సేన లక్ష్యమని పేర్కొన్నారు. పట్టభద్రుల హక్కుల పరిరక్షణ, నిరుద్యోగ సమస్యల పరిష్కారం, ఉద్యోగ అవకాశాల కల్పన, విద్యారంగ అభివృద్ధి, పట్టభద్రుల సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాటం చేస్తుందని గవినోళ్ల శ్రీనివాస్ తెలిపారు.పట్టభద్రుల అభివృద్ధి, యువత భవిష్యత్తు, బలహీన వర్గాల ప్రాతినిధ్యం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.నారాయణపేట జిల్లాలోని అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు ఉలిగుండం అనంత్ రెడ్డి, విట్లపూర్ గుట్టల నర్సింహా, మొగలమాడక నర్సిములు పాల్గొన్నారు.

అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తాం.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్.

దేవునిబండ తండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, (లోకల్ గైడ్) : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం దేవునిబండ తండా గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం సర్పంచ్ ఎం. శ్రీను నాయక్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీను నాయక్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. అర్హత కలిగిన వారందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు దేవునిబండ తండా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్యామ్‌లాల్, సర్పంచులు ఆర్. బాబు నాయక్, శివకుమార్, జంగయ్య, మాజీ సర్పంచులు కె. యాదయ్య, కె. బాలు, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, పుల్లారెడ్డి, దేవగిరి నవీన్, వార్డు సభ్యులు పి. జాను, పి. మారు, డి. ఈశ్వర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాదావత్ విరేష్, కె. దశరథ్, డి. సుమన్, లక్ష్మణ్, జగన్, గ్రామ నాయకులు భాస్కర్ నాయక్, శంకర్ నాయక్, మూడవత్ చందు తదితరులతో పాటు గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు..

ప్రకటనలకు కొత్త నిబంధనలు.. అనుమతి లేకుంటే భారీ జరిమానాలు!

టూ లెట్ బోర్డులకూ వర్తింపు..

మై క్యూర్ యాప్ ద్వారా ముందస్తు అనుమతి తప్పనిసరి



హైదరాబాద్, నవంబర్ 02 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): నగరంలో ప్రకటనలు, హోర్డింగ్స్, టూ లెట్ బోర్డుల ఏర్పాటుపై ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసు కొచ్చింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రకటనలు ఏర్పాటు చేయాలంటే మై క్యూర్ యాప్ లేదా అధికారిక ప్రకటనల పోర్టల్ ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవడం తప్ప నిసరి. అనుమతి లేకుండా ప్రకటనలు ఏర్పాటు చేస్తే జరిమా నా లు విధించ డంతోపాటు వాటిని తొలగించే చర్యలు చేపడతారు. కొత్త విధానం ప్రకారం తాత్కాలిక ప్రకటనలకు గరిష్ఠంగా మూడు రోజుల వరకు అనుమతి ఉంటుంది. వీటికి రోజుకు రూ.1వేయి నుంచి రూ.4 వేల వరకు రుసుము చెల్లించాలి. హైపర్‌లోకల్ ప్రకటనలకు ఒకటి నుంచి ఏడు రోజుల వరకు అనుమతి కల్పించారు. వీటికి రోజుకు రూ.100 నుంచి రూ.500 వరకు రుసుము నిర్ణయించారు. ఈ కేటగిరీలో టూ లెట్ బోర్డులు కూడా ఉన్నాయి. ప్రకటనలు ఏర్పాటు చేయాలనుకునే వారు ముందుగా యాప్‌లోకి వెళ్లి సంబంధిత కేటగిరీని ఎంపిక చేసుకుని, ప్రకటన స్థలానికి సంబంధించిన స్లాట్‌ను బుక్ చేసుకోవాలి. అనుమతి లభించిన అనంతరం ప్రత్యేక క్యూఆర్ కోడ్ జారీ చేస్తారు. ఆ క్యూఆర్ కోడ్‌తోపాటు అనుమతి వివరాలను ప్రకటనపై నిర్దేశిత విధంగా ప్రదర్శించాలి. ఇప్పటివరకు ఇష్టానుసారంగా రోడ్ల వెంట, భవనాలపై టూ లెట్ బోర్డులు ఏర్పాటు చేస్తున్న పరిస్థితికి కొత్త నిబంధనలతో నియంత్రణ తీసుకురానున్నారు. అయితే ప్రతి టూ లెట్ బోర్డును వ్యాపార ప్రకటనగా పరిగణించి జరిమానా విధిస్తారనే అర్థం కాదు. సంబంధిత నిబంధనల ప్రకారం అనుమతి అవసరమా లేదా అనేది పరిశీలించాలి. నిబంధనలు ఉల్లంఘించి ఏర్పాటు చేసిన ప్రకటనలను అధికారులు తొలగించడంతోపాటు జరిమానాలు విధించనున్నారు. ప్రజలు, వ్యాపారులు ప్రకటనలు ఏర్పాటు చేసే ముందు అనుమతులు పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

ధరల దోపిడీని అరికట్టాలి.. పేదలను ఆదుకోవాలి!

కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్..

ప్రతి మనిషికి 12 కిలోల బియ్యం, 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి

కారేపల్లి, నవంబర్ 2 (లోకల్ గైడ్ న్యూస్): ఎల్‌నినో, కరువు ప్రభావం పేరుతో నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారం మోపడం సరికాదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలను తక్షణమే నియంత్రించి, ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా ప్రతి మనిషికి నెలకు 12 కిలోల బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని కోరారు. సోమవారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ డిమాండ్లు చేశారు. కరువు పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచుతున్నారని నాగేశ్వరరావు విమర్శించారు. పెరిగిన ధరలను అరికట్టడంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి దుకాణంలో సరుకుల ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, బ్లాక్ మార్కెట్‌కు పాల్పడుతూ అధిక ధరలకు సరుకులు విక్రయించే మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యంతో పాటు మంచి నూనె, కందిపప్పు, గోధుమలు, జొన్నలు, పంచదార, టీ పొడి, ఉప్పు, కారం, పసుపు తదితర 14 రకాల నిత్యావసర సరుకులను ప్రజలకు అందించాలని కోరారు.



నిత్యావసర ధరల పెరుగుదలతో పేద కుటుంబాల జీవనం భారంగా మారిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని సూచించారు.

కూలీలకు 200 రోజుల ఉపాధి కల్పించాలి

కరువు ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 200 రోజుల ఉపాధి హామీ పని కల్పించాలని, కొలతలతో సంబంధం లేకుండా రోజువారీ కూలీని రూ.800 చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు కల్పించడం ద్వారా కరువు పరిస్థితుల్లో గ్రామీణ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. అలాగే రైతుల రుణాలను మాఫీ చేసి, కొత్త రుణాలు అందించడం ద్వారా అన్నదాతలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరువు నివారణ చర్యల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజలకు అండగా నిలవాలని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయడంతో పాటు, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి పేదలు, వ్యవసాయ కూలీలు, రైతులను ఆదుకోవాలని కొండబోయిన నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రంగారెడ్డి కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదుల విలువ.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, (లోకల్ గైడ్): రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెలుగుతాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు ప్రజావాణి లో అధికారులకు మొత్తం 116 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని,ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 67 ఫిర్యాదులు, ఇతర శాఖలకు సంబంధించి 49 ఫిర్యాదులు అందాయి. మొత్తం 116 అర్జీలు స్వీకరించిన అధికారులు వాటిని సంబంధిత శాఖలకు పంపించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో కుటుంబంపై వరుస దాడులు

శరణ్య చేయి విరగొట్టిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎస్పీ, అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఆర్టీఐ స్టేట్ డిప్యూటీ సెక్రటరీ మేకల పోచయ్య



మెదక్ నవంబర్ 3 లోకల్ గైడ్) : పట్టణంలోని గోల్కొండ వీధిలో మంత్రాలు చేస్తున్నారనే నెపంతో ఓ కుటుంబంపై వరుస దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీఐ సభ్యుడు మేకల పోచయ్య డిమాండ్ చేశారు. ఒకే కుటుంబంపై గోల్కొండ వీధికి చెందిన కొందరు నిందితులు మూడు సార్లు దాడికి పాల్పడ్డారని, ఈ దాడుల్లో శరణ్య అనే యువతి చేయి విరిగిందని ఆయన తెలిపారు. నిందితుల వేధింపులు, దాడుల కారణంగా తమ కుటుంబానికి ప్రాణభయం ఉందని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్‌లకు వినతిపత్రాలు సమర్పించి తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఒకే కుటుంబంపై పలుమార్లు దాడులు జరగడం ఆందోళనకరమని మేకల పోచయ్య పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రాణహాని ఉందని, అధికారులు వెంటనే స్పందించి వారి నివాస ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబంపై దాడులకు పాల్పడిన వారిని గుర్తించి, ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి తగిన పోలీసు రక్షణ కల్పించి, భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా జిల్లా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మేకల పోచయ్య డిమాండ్ చేశారు.

ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన.. బాధితులకు చట్ట పరంగా న్యాయం చేయాలని అధికారులకు ఎస్పీ ఆదేశం



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి లోకల్ : సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో నుంచి వచ్చిన దాదాపు 34 మంది బాధితు లసమస్యలను, ఫిర్యాదులను సవివరంగా విని సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ గలాల్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.బాధితుల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన నిబంధనల ప్రకారం సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖపై నమ్మకంతో వస్తున్నందున, వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్నామని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి చట్ట పరిధిలో సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్, తెలిపారు.

మియాపూర్ సర్కిల్ ప్రజావాణికి 6 ఫిర్యాదులు

ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు



సైబరాబాద్, నవంబర్ 02 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) మియాపూర్ సర్కిల్-48 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 6 ఫిర్యాదులు స్వీకరించారు. విభాగాల వారీగా టౌన్ ప్లానింగ్‌కు 3, ఇంజినీరింగ్‌కు 2, పట్టణ జీవవైవిధ్య విభాగానికి (యూబీడీ) ఒక ఫిర్యాదు అందాయి. రెవెన్యూ, ఆరోగ్యం, పారిశుధ్యం, యూసీడీ, విద్యుత్, ఇరిగేషన్, పశు వైద్య విభాగాలకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

సింగరేణి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా తురక సాంబయ్య

రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక.. నూతన కార్యవర్గం ఏర్పాటు



కారేపల్లి, నవంబర్ 2 (లోకల్ గైడ్ న్యూస్): ఖమ్మం జిల్లా సింగరేణి మండల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా తురక సాంబయ్య రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సింగరేణి పెద్ద చెరువు కట్ట వద్ద ఎన్నికల అధికారి జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. సంఘానికి చెందిన 140 మంది సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా తురక కోటేశ్వరరావు, కార్యదర్శిగా చింతల సంపత్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా గిరిపోయిన వెంకన్న, బోళ్ల లచ్చయ్య, తురక రాజు, పేరున గురువులు, తురక లక్ష్మి, గంగారబోయిన జానకమ్మ ఎన్నికయ్యారు. రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తురక సాంబయ్యకు సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, సంఘాన్ని మరింత అభివృద్ధి చేయాలని సభ్యులు ఆకాంక్షించారు. మత్స్యకారుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు గంగారబోయిన సత్యం, దిండి లచ్చయ్య, గంగారబోయిన యాదగిరి, పెద్దమ్మ సత్యం, తురక రవి, ముదిరాజ్ పెద్దమనిషి తురక రాంబాబు, గొడుగు శ్రీనివాస్, ఉడతల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశా లల్లో "సురక్షిత్ బచ్‌పన్ అభియాన్" పై న్యాయమూర్తుల అవ గాహన



నారాయణపేట నవంబర్ 2: సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ లో భాగంగా శనివారం జిల్లాలోని మూడు పాఠశాలల్లో ఒకేసారి అవగాహన కార్యక్రమాలు నిర్వహించా రు. ఈ కార్యక్రమాల్లో న్యాయమూర్తులు పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.మోడరన్ ఉన్నత పాఠశాల, నారాయణపేటలో సీని యర్ సివిల్ జడ్జి, ఫ్యాక్ సెక్రటరీ,డి ఎల్ ఎస్ ఏ వింధ్య నాయక్ పాల్గొన్నారు. "నా బాల్ వివాహ్, నా బాల్ శోషణ్" అంశంపై బాల్య వివాహాలు నేరమని పోక్సో చట్టం గురించి వివరించారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిప ల్ జూనియర్ సివిల్ జడ్జి పాల్గొని "మేరా బచ్‌పన్, మేరా అధికార్" అంశంపై ప్రతి బిడ్డకు ఉన్న హక్కులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలియ జేశారు.శ్రీ సాయి ఉన్నత పాఠశాలలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అవినాష్ పాల్గొని "జాగృక్ బచ్‌పన్, సశక్తి భారత్" అంశంపై పిల్లలు అప్రమ త్తంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుందని, 1098 టోల్ ఫ్రీ నంబర్ గురించి వివరించారు.అనంతరం న్యాయమూ ర్తులు మాట్లాడుతూచైల్డ్ వెల్ఫేర్ కమిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ పాత్ర వివరిస్తూ, లైంగిక వేధింపులు, బాల కార్మికులు, మానవ రవాణా నుండి రక్షించబడిన పిల్లలను 24 గంటల్లో సి దబ్ల్యు సి ముందు ప్రవేశపెడతారని తెలిపారు. వారికి సురక్షితమైన ఆశ్రయం, వైద్య సహాయం మరియు కౌన్సెలింగ్ అందిస్తారన్నారు.భరోసా కేంద్రం గురించి – లైంగిక వేధింపులకు గురైన పిల్లలు పోలీస్ స్టేషన్లు, హాస్పిటళ్లు, కోర్టుల చుట్టూ తిరగకుండా ఒకే గొడుగు కింద అన్ని సేవలను అందిస్తుందని తెలిపారు. సఖి సెంటర్ గురించి – హింసకు గురైన బాలికలకు ఒకే చోట అన్ని రకాల సేవలను అందిస్తుం దని వివరించారు.లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మిపతి గౌడ్ గారు మాట్లాడుతూ డి ఎల్ ఎస్ ఏ పాత్రను వివరిస్తూ, జిల్లా మెజిస్ట్రేట్, జిల్లా విద్యాశా ఖాధికారి, ఎస్పి లతో కూడిన జిల్లా స్థాయి కమి టీల ద్వారా ఈ ప్రచారాన్ని పర్యవేక్షిస్తున్నామన్నారు.చివరగా విద్యార్థులచే "జాగ్రత్త, సురక్ష, సంరక్షణ – ప్రతి బిడ్డ హక్కు" అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ రోజు తెలుసుకున్న చట్టాలను ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు, స్నేహితు లకు చెప్పాలని సూచిం చారు. అనంతరం సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ గోడ స్టిక్కర్లను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ డిపార్ట్మెంట్ సిబ్బంది కరిష్మా, నరసింలు, భరోసా, సఖి సెంటర్ శారద, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యా యులు సాగర్ తదితరులు, ఉపాధ్యాయులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: బాలకృష్ణ తెంటెక్కి

నేడు పేటలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

నారాయణపేట నవంబర్2: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఈ నెల 3న నిర్వహించే విద్యుత్ వినియోగదారుల దినో త్సవాన్ని పురస్కరించు కొని, నారాయణపేట సర్కిల్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.నవీన్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా 3న ఉదయం 11:00 గంటల నుండి నారాయణ పేట సర్కిల్ కార్యాలయం, కోస్గి సబ్ డివిజన్ కార్యాల యం మక్తల్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో నిర్వహించ బడతాయి.ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల నుంచి విద్యుత్ సరఫరా అంతరాయాలు, మీటర్ సమస్యలు, విద్యుత్ బిల్లులు, కొత్త సర్వీసులు తదితర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారనీ తెలిపారు.అదేవిధంగా వినియోగదా రుల హక్కులు, విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సి.జి.ఆర్.ఎఫ్)విద్యుత్ అంబుడ్స్‌మన్ సేవలు, విద్యుత్ భద్రత మరియు విద్యుత్ పొదుపుపై అవగా హన కల్పించనున్నారు.కావున విద్యుత్ వినియోగ దారులు తమ సమస్యలు, ఫిర్యాదులతో సంబంధిత కార్యాలయాలకు హాజరై ఈ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. నవీన్ కుమార్ కోరారు.

దీర్ఘకాల సేవల అనంతరం పదవీ విరమణ పొందిన
ఉద్యోగులకు ఘన సన్మానం.... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

అక్టోబర్ 2026లో పదవీ విరమణ పొందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్





ఖమ్మం, నవంబర్ -02: లోకల్ గైడ్: ప్రభుత్వ ఉద్యోగులుగా సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు, విద్యారంగానికి సేవలందించిన ఉద్యోగుల సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారుసోమవారం కలెక్టరేట్‌లో అక్టోబర్ 2026లో పదవీ విరమణ పొందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.ఇంటర్మీడియట్ విద్యాశాఖకు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిరిపురంలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఎస్. సత్యనారాయణ శాస్త్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నయాబజార్, ఖమ్మంలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసిన జి. వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందిన సందర్భంగా వారిని సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా ఎన్నో సంవత్సరాల పాటు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ విద్యారంగ అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం వారు తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా,ఆయురారోగ్యాలతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

124 వరోజు కు చేరిన లయన్స్ క్లబ్ నిత్య 'అన్న దానం'



నారాయణపేట నవంబర్ 2: మానవ సేవే మాధవ సేవ అనే లక్ష్యంతో లయ న్స్ క్లబ్ ఆఫ్ నారాయణ పేట ఆధ్వ ర్యంలో ఏడాది పాటు నిర్వహిస్తున్న విల్స్ అండ్ మిల్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అన్నదానము కార్యక్రమ ములో భాగంగా సోమవారం నాటికి 124 వరోజు లకు చేరింది.శ్రీ రాఘవేంద్ర సేవాసమితి ఆధ్వర్యం రఘు ప్రేమ తీర్థులు అన్నదానం స్పాన్సర్ చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని వివేకానంద మున్సిపల్ పార్క్ వద్ద ఎన్ ఎచ్ ఎం ఉద్యోగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్ మాట్లాడు తూ సమా జంలో అవసర మైన వారికి అండగా నిల వడం, సామా జిక బాధ్యత గా భావి స్తూ,లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్య క్రమాలు కొన సాగిస్తున్నామని తెలి పారు.ఈ కార్యక్ర మంలో యులయన్స్ సరిత బట్టాడ్ , శ్రీనివాస్ లాహోటి,కన్నా జగదీష్, పుత్పాక్ రమేష్, డాక్టర్ సచిన్ , కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రపంచాన్ని ప్రత్యక్షంగా చూసిన మోడల్ స్కూల్ విద్యార్థులు.

- గచ్చిబౌలి స్టేడియంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇండస్ట్రియల్ టూర్.



లోకల్ గైడ్/బంట్వారం: విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, క్రీడారంగంలోని అవకాశాలపై అవగాహన కల్పించేందుకు బంట్వారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పర్యటన నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ బ్యూలా నేతృత్వంలో విద్యార్థులు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియాన్ని సందర్శించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా చేపట్టిన ఈ పర్యటనలో స్టేడియంలోని క్రీడా మైదానాలు, ఆధునిక సదుపాయాలు, క్రీడాకారులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. క్రీడల ప్రాముఖ్యత, శారీరక దృఢత్వం, క్రమశిక్షణతో పాటు క్రీడారంగంలో భవిష్యత్తు అవకాశాలపై విద్యార్థులు అవగాహన పొందారు. తరగతి గది బోధనకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయి అనుభవం కల్పించే ఇలాంటి పర్యటనలు విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడతాయని పాఠశాల ప్రిన్సిపల్ బ్యూలా పేర్కొన్నారు.

మాక్ పార్లమెంట్‌లో మెదక్ జిల్లాకు రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం

విద్యార్థిని ఆర్తి చంద్ర, ఉపాధ్యాయులు, కార్యక్రమ నిర్వాహకులను అభినందించిన జిల్లా కలెక్టర్



మెదక్ నవంబర్ 2 .(లోకల్ గైడ్) : రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ సంబంధిత విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులను అభినందించారు.ఈ సందర్భంగా తెలంగాణ మోడల్ స్కూల్ శంకరంపేట-ఆర్‌కు చెందిన విద్యార్థిని ఆర్తి చంద్ర, పాఠశాల ప్రిన్సిపాల్ వాణి కుమారి . గైడ్ టీచర్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు . ూమీలను కలెక్టర్ అభినందించారు. రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించిన నర్సింలు, రవిబాబు, జిల్లా స్థాయిలో కార్యక్రమ విజయానికి కృషి చేసిన దేవి సింగ్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు.విద్యార్థినులు ప్రతిభను చాటుతూ జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంబంధిత ప్రతి ఒక్కరినీ అభినందించి భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగమయ్య తదితరులు ఉన్నారు

జీఓ 58, 59 దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలనను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలి

భూమి విస్తీర్ణం, హద్దులు, భూమి స్వభావాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలి

చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, సహజ నీటి ప్రవాహ మార్గాల్లోని భూములకు క్రమబద్ధీకరణ చేయరాదు



ఖమ్మం, నవంబర్ -02: లోకల్ గైడ్: జీఓ 58, 59 కింద వచ్చిన దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో ట్రైనీ కలెక్టర్ పారన్ కుమార్‌తో కలిసి జీఓ 58, 59 దరఖాస్తుల పరిశీలనపై జిల్లా అధికారులు, తహసీల్దార్ల తో జిల్లా కలెక్టర్ దివాకర సమీక్ష సమావేశం, గూగుల్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివాస గృహాలు నిర్మించుకొని నివసిస్తున్న వారికి ఆయా స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీఓ 58, 59లను అమలు చేస్తున్నదని తెలిపారు. జీఓ 58 ప్రకారం 125 చదరపు గజాల లోపు ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న నివాస గృహాలను క్రమబద్ధీకరిస్తారని, 125 చదరపు గజాలకు మించిన స్థలాల్లో నిర్మించుకున్న గృహాలను ప్రభుత్వం నిర్దేశించిన రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపుతో క్రమబద్ధీకరిస్తారని వివరించారు. జీఓ 59 క్రింద క్రమబద్ధీకరించిన భూములకు పట్టా హక్కులు కల్పించబడతాయని, నిబంధనల ప్రకారం వాటిని ఇతరులకు విక్రయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.దరఖాస్తుదారుడు స్వయంగా సంబంధిత స్థలంలో గృహం నిర్మించుకొని నివాసం ఉంటున్నట్లయితేనే నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణకు అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. తప్పుడు ధృవ పత్రాలు సమర్పించి ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను సైతం క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉన్నందున అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.జీఓ 58, 59 దరఖాస్తుల పరిశీలన పర్యవేక్షణ కోసం మండలాల వారీగా ప్రత్యేక జిల్లా అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. సత్తుపల్లి, ఖమ్మం అర్బన్ మండలాల్లో అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినందున అక్కడ రెండు నుంచి మూడు మంది జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు.నియమించిన ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి, నవంబర్ 15వ తేదీలోగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రతి ప్రత్యేక అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి జిల్లా స్థాయిలో రూపొందించిన ప్రత్యేక ఆన్‌లైన్ లింక్ ద్వారా పరిశీలన వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణ జరిపి, సంబంధిత స్థలాన్ని స్వయంగా పరిశీలించాలని, భూమి విస్తీర్ణాన్ని ఖచ్చితంగా కొలవాలని ఆదేశించారు.దరఖాస్తుదారుడి ఆధీనంలోనే సంబంధిత స్థలం ఉందా? నిజంగా ఆ స్థలంలో నివాస గృహం నిర్మించుకొని నివసిస్తున్నారా? అనే అంశాలను నిర్ధారించుకోవాలని తెలిపారు. చిన్న ఇంటి నిర్మాణం ఉండి, అధిక విస్తీర్ణంలో భూమిని క్లెయిమ్ చేసే సందర్భాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థలానికి సంబంధించిన నాలుగు వైపుల హద్దులు, భూమి స్వభావం, విస్తీర్ణం తదితర వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని ఆదేశించారు.దరఖాస్తుదారుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తూనే, నిబంధనల అమలులో ఎలాంటి అలసత్వం చూపరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ క్రమబద్ధీకరణకు అనుమతించరాదని తెలిపారు. కాలువలు, చెరువులు, సహజ నీటి ప్రవాహ మార్గాలకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రతి దరఖాస్తుదారుడి నుంచి సంబంధిత ఆధార పత్రాలన్నింటినీ సేకరించాలని, క్షేత్ర స్థాయి పరిశీలన సమయంలో దరఖాస్తుదారుడితో పాటు నివాస గృహం ఫొటోలను తీయాలని తెలిపారు. పరిశీలించిన ఇంటి ఫొటోలను జియో కోఆర్డినేట్స్‌తో సహా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన పరిశీలన నివేదిక, సంబంధిత అధికారుల అభిప్రాయాలను తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్-2026 ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేయాలి...

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

ఏఎస్‌డీ జాబితా, డిలీషన్ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

ఫారం-6, 7, 8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

ప్రతి తొలగింపు, మార్పునకు సరైన ఆధారాలతో స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయాలి

రికార్డులు, ఆధారాలను పక్కాగా నిర్వహించాలి

నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం కావాలి



ఖమ్మం, నవంబర్ -02: లోకల్ గైడ్: తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలు, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్) జాబితాలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను సంబంధిత ఆధారాలతో ధ్రువీకరించాలని, సరైన విచారణ లేకుండా ఏ ఒక్క అర్హులైన ఓటరు పేరు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో ఏవైనా అభ్యంతరాలు వచ్చినప్పుడు సంబంధిత రికార్డులు అందుబాటులో ఉండేలా పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. నోటీసులు జారీ చేసిన ప్రతి ఓటరుకు నిబంధనల ప్రకారం స్పందించేందుకు, తమ వాదనలు వినిపించేందుకు తగిన అవకాశం కల్పించాలని తెలిపారు. క్షేత్రస్థాయి విచారణను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రతి దశలో తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.జిల్లాల వారీగా ఏఎస్‌డీ జాబితా, డిలీషన్ జాబితా, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు అన్ని వివరాలను మరోసారి పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.భారత ఎన్నికల సంఘం ఎస్ఐఆర్-2026 ప్రక్రియకు సంబంధించి సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో, నవంబర్ 26, 2026వ తేదీలోగా నోటీసుల జారీ, విచారణలు, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. నవంబర్ 30, 2026వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉన్నందున, ఈ గడువులను దృష్టిలో ఉంచుకొని అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, జిల్లాలో 175841 అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లుండగా, 175163 పరిష్కరించినట్లు తెలిపారు. దరఖాస్తులను నిబంధనల మేరకు సూపర్ చెక్ ప్రక్రియ చేసినట్లు అన్నారు. ఏఎస్ డి జాబితా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. ఫాం-6, 7 లను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదుకు 96000 దరఖాస్తులు రాగా, 83879 దరఖాస్తులు ఆమోదించినట్లు, ప్రస్తుత ఎన్నికలకు ఇప్పటికీ 81000 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదయ్యేలా అవగాహన, ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.ఎ. రాజు, డీటీ అన్సారీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ.. రోడ్డంతా జలమయం!

అభివృద్ధి నిధులు మంజూరైనా..

అధ్వానంగా రోడ్లు, మురుగు కాలువలు..

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై

పట్టణ ప్రజల ఆగ్రహం..

నీటి పొదుపుపై కలెక్టర్ సూచనలు బేఖాతరు..

తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్..



నల్గొండ లోకల్ గైడ్ ప్రతినిధి : పట్టణ కేంద్రంలోని గడియారం సెంటర్ నుంచి రామగిరి వెళ్లే మార్గంలో మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ లీకేజీ కావడంతో రోడ్డంతా నీటితో జలమయంగా మారింది. అసలే ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో విలువైన తాగునీరు ఇలా వృథాగా రోడ్డుపై పారుతుండటంపై పట్టణ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.ఒకవైపు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, ఒక్క బొట్టు నీటిని కూడా వృథా చేయకూడదని ప్రజలకు, అధికారులకు సూచిస్తుండగా.. మరోవైపు మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి నీరు వృథాగా రోడ్డుపై పారుతుండటం అధికారుల పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. నీటి పొదుపుపై ఉన్నతాధికారులు చేస్తున్న సూచనలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి నిధులు మంజూరైనా.. సమస్యలు పరిష్కారం వెక్కడ?

నల్గొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నగర మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని, నగర అభివృద్ధికి అవసరమైన నిధులు సైతం మంజూరయ్యాయని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. అయితే పట్టణంలోని పలు డివిజన్లలో రోడ్లు, మురుగు కాలువలు అధ్వానంగా ఉండటం, చిన్నపాటి వర్షాలకే రహదారులు జలమయంగా మారడం వంటి సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నగర అభివృద్ధికి నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై నీరు నిలిచిపోవడం, మురుగు కాలువలు సక్రమంగా శుభ్రం చేయకపోవడం, పైప్‌లైన్ లీకేజీలను సకాలంలో గుర్తించి మరమ్మతులు చేపట్టకపోవడం వంటి సమస్యలతో పట్టణ ప్రజలు సతమతమవుతున్నారు.

ప్రజల సొమ్ము వృథా అవుతోందని ఆవేదన..

నగర అభివృద్ధి కోసం కేటాయిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లఅభివృద్ధి పనులు నిర్వీర్యమవుతున్నాయని, ప్రజల సొమ్ము దుర్వినియోగం అవుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు సమస్యలను పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించాలి..

నగర అభివృద్ధికి ఆటంకంగా మారుతున్న సమస్యలపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీని వెంటనే అరికట్టి, నీటి వృథాను నివారించాలని, పట్టణంలోని అన్ని డివిజన్లలో రోడ్లు, మురుగు కాలువల పరిస్థితిని సమీక్షించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.నగర అభివృద్ధి కోసం మంజూరైన నిధులను ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగించి, నల్గొండ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.ఉన్నతాధికారులు ఈ సమస్యలపై స్పందించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: భాలకిష్ణ తిరుపతి

నారాయణపేటలో అభివృద్ధి శూన్యం ..

ప్రతి వార్డుకు రూ.10 లక్షలు కేటాయించాలి

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ డిమాండ్



నారాయణపేట నవంబర్ 2: నారాయణపేట పట్టణంలో బి జె పి మున్సిపల్ చైర్మన్ కొండా శ్వేత సత్య యాదవ్ బాధ్యతలు చేపట్టి 9 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి లేదని నారాయణపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ ఒక ప్రకటనలోవిమర్శించారు.మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 4 కౌన్సిల్ సమావేశా లు జరిగినప్పటికీ పట్టణం లోని ఏ ఒక్క వార్డులోనూ అభివృద్ధి పనులకు నిధు లు కేటాయించకపోవడం విచారకరమని విమర్శిం చారు.ప్రతి కౌన్సిల్ సమావే శంలోనూ బిల్లుల ఆమోదా నికే ప్రాధాన్యత ఇస్తున్నారే తప్ప, వార్డుల అభివృద్ధిని, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. వార్డుల అభివృద్ధి కోసం నిధులు అడిగితే మున్సిపాలిటీలో డబ్బులు లేవని చెప్పడం ఎంతవరకు సమంజసమనిప్రశ్నించారు.పట్టణం లో అనేక వార్డుల్లో చిన్న చిన్న సమస్యలు చాలా ఉన్నాయి 9 నెలలు గడుస్తున్నా పరిష్కరించ డంలో విఫలం అయ్యారు. పట్టణంలోని వార్డుల అభివృద్ధిపై శ్రద్ద చూపించా లని, ప్రజాధనాన్ని ప్రజల అవసరాల కోసం వినియో గించాలని సూచించారు.కనీసం ఈ కౌన్సిల్ సమా వేశంలోనైనా వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, నారాయణపేట పట్టణంలోని ప్రతి వార్డుకు రూ.10 లక్షల చొప్పున అభివృద్ధి నిధులు కేటా యించాలని మున్సిపల్ చైర్మన్‌ను డిమాండ్ చేశారు.

చెక్‌డ్యామ్ తెగి.. పంట పొలం కోత!

నాలుగేళ్లుగా రైతుకు తప్పని కష్టాలు

పంట పొలాన్ని పరిశీలించి న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి



మిడ్జిల్ నవంబర్ 2(లోకల్ గైడ్): దుందుభి నదిపై నిర్మించిన చెక్‌డ్యామ్ తెగిపోవడంతో పంట పొలం కోతకు గురై తీవ్రంగా నష్టపోయానని వాడ్యాల గ్రామానికి చెందిన రైతు జాహిర్ ఆవేదన వ్యక్తం చేశారు. మిడ్జిల్ మండలం వాడాల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 238లో ఉన్న తన వ్యవసాయ భూమి చెక్‌డ్యామ్ తెగిపోవడం కారణంగా దెబ్బతిని, సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.గత నాలుగు సంవత్సరాలుగా ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ తనకు న్యాయం జరగడం లేదని రైతు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మిడ్జిల్ మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ రాఘవేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాన్ని పరిశీలించి, జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. తనకు జరిగిన పంట భూమి నష్టంపై విచారణ జరిపి తగిన న్యాయం చేయడంతో పాటు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని రైతు అధికారులను విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచిత సాంకేతిక శిక్షణ

టాస్క్--అమెజాన్ వెబ్ సర్వీసెస్ మధ్య అవగాహన ఒప్పందం





లోకల్ గైడ్ ఆమనగల్లు, నవంబర్ 2: తెలంగాణ రాష్ట్రంలో లక్ష మంది విద్యార్థులకు కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్‌తో పాటు అత్యాధునిక సాంకేతిక అంశాల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 643 కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి సంబంధించి తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), అంతర్జాతీయ సాంకేతిక సంస్థ అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) మధ్య సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టాస్క్ ముఖ్య నిర్వహణ అధికారి (సీఓఓ) సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణఈ శిక్షణలో భాగంగా విద్యార్థులకు కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, యంత్ర అభ్యాసం, జనరేటివ్ ఏఐ వంటి అంశాల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించనున్నారు. సైద్ధాంతిక పరిజ్ఞానంతో పాటు ప్రత్యక్షంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే అనుభవాన్ని కూడా కల్పించనున్నారు.ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులతో పాటు కళలు, వాణిజ్య విభాగాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా ప్రత్యేక శిక్షణా మార్గాలు అందుబాటులో ఉంటాయి. ఏడాది పాటు 900కు పైగా ఉచిత ఆన్‌లైన్ కోర్సులను అభ్యసించే అవకాశం కల్పించనున్నారు.శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలుశిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ ధ్రువీకరణ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రాయితీ వోచర్లు అందించడంతో పాటు, సాంకేతిక రంగ నిపుణులతో సమావేశాలు, హ్యాకథాన్‌లు నిర్వహించనున్నారు.పాల్గొనే కళాశాలల అధ్యాపకులకు కూడా ఆధునిక సాంకేతిక అంశాల్లో శిక్షణ అందించనున్నారు.యువతకు నూతన అవకాశాలురాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించడం, మెరుగైన ఉపాధి అవకాశాలకు మార్గం కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, టాస్క్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నితిన్ రెడ్డి, ఏడబ్ల్యూఎస్ ఇండియా, దక్షిణ ఆసియా అధ్యక్షుడు సందీప్ దత్తా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

కడ్తాల్‌ను కరువు మండలంగా ప్రకటించే వరకు బీఆర్ఎస్ పోరాటం



లోకల్ గైడ్ ఆమనగల్లు, నవంబర్ 2: రైతులను ఆదుకోకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ హెచ్చరించారు. కడ్తాల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించే వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.సోమవారం కడ్తాల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారని, అయినప్పటికీ ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించకపోవడం దారుణమని విమర్శించారు. k9ల్వకుర్తి నియోజకవర్గంపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు.రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదుమాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించామని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. పంటలు ఎండిపోయి పెట్టుబడులు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంత రైతుల కష్టాలను గుర్తించి వెంటనే కడ్తాల్‌ను కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే రాజీనామా చేయాలిఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ, రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. రైతుల సమస్యలపై స్పందించని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు శ్యామల ముదిరాజ్, ఉపాధ్యక్షుడు భూపాల్, జగన్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, పట్టణ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత...

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

అవసరం లేనప్పుడు ఫ్యాన్లు, లైట్లు, టీవీలను

తప్పనిసరిగా స్విచ్ ఆఫ్ చేయాలి

పొదుపు చేసిన విద్యుత్తు ఉత్పత్తి

చేసిన విద్యుత్తుతో సమానం

బీఈఈ స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్

ఉపకరణాలను వినియోగించాలి

విద్యుత్ పొదుపుపై అధికారులతో

ప్రతిజ్ఞ చేయించిన జిల్లా కలెక్టర్





ఖమ్మం, నవంబర్ -02: లోకల్ గైడ్: సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించి, విద్యుత్‌ను పొదుపు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.సోమవారం కలెక్టరేట్‌లో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి విద్యుత్ పొదుపుపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం ఎంతో అవసరమని తెలిపారు. ఇళ్లలో, కార్యాలయాల్లో అవసరం లేనప్పుడు ఫ్యాన్లు, లైట్లు ఆఫ్ చేయాలని, టీవీలను వినియోగించని సమయంలో పూర్తిగా స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. పొదుపు చేసిన విద్యుత్తు ఉత్పత్తి చేసిన విద్యుత్తుతో సమానమని, విద్యుత్ ఆదా చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడిన వారమవుతామని తెలిపారు.లైఫ్ మిషన్‌లో భాగంగా పర్యావరణహిత జీవనశైలిని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. చిన్న చిన్న మార్పులు, అలవాట్ల ద్వారా పెద్ద మొత్తంలో విద్యుత్‌ను ఆదా చేయవచ్చని పేర్కొన్నారు.విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు బీఈఈ స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్ ఉపకరణాలు, ఇంధన సామర్థ్యం కలిగిన పరికరాలను వినియోగించాలని సూచించారు. వీటి ద్వారా విద్యుత్ వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్ బిల్లులు కూడా తగ్గుతాయని తెలిపారు.సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని, ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించడం ద్వారా వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వల్ల ఇంధన ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.వేసవిలో ఏసీలను 25 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉంచడం ద్వారా విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చని, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఎనర్జీ సేవింగ్ మోడ్‌ను వినియోగించాలని సూచించారు. దీనివల్ల విద్యుత్ ఆదా కావడంతో పాటు పరికరాల బ్యాటరీ సామర్థ్యం, జీవితకాలం పెరుగుతాయని తెలిపారు.విద్యుత్ పొదుపు వల్ల విద్యుత్ బిల్లుల తగ్గింపు, ఇంధన భద్రత, మెరుగైన ఆరోగ్యం, స్వచ్ఛమైన పర్యావరణం, సహజ వనరుల పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు స్థిరమైన పర్యావరణాన్ని అందించవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.కార్యక్రమం ముగింపులో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్‌తో పాటు అధికారులు, సిబ్బంది విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞ చేశారు. విద్యుత్‌ను అవసరమైన మేరకే వినియోగిస్తామని, అనవసర విద్యుత్ వినియోగాన్ని నివారిస్తామని, విద్యుత్ ఆదా చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపును తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకొని, విద్యుత్ ఆదా చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం విద్యుత్ ఆదాకు సంబంధించిన గోడ ప్రతిని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా కామారెడ్డికి చెందిన ణతీ వీ. జైపాల్ రెడ్డి నియామకం..



(లోకల్ గైడ్ 2నవంబర్ కామారెడ్డి టౌన్) : కామారెడ్డిజిల్లాకు చందిన తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్, స్థానిక ఆర్మీ గ్రూప్ సీఈఓ, ప్రముఖ విద్యావేత్త, కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉ కామారెడ్డి ఒలింపిక్ డే రన్ చైర్మన్ ణతీ. వీ. జైపాల్ రెడ్డిని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమించింది.. క్రీడారంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఒలింపిక్ అసోసియేషన్ ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకాన్ని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి. మల్లారెడ్డి గారు అధికారికంగా నిర్ధారించారు.తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్, మాజీ ఫీ జితేందర్ రెడ్డి గారు చైర్మన్‌గా, మాజీ మంత్రి వేణుగోపాల్ చారి గారు వైస్ చైర్మన్‌గా, మరియు డిప్యూటీ చైర్మన్ తెలంగాణ రావస్త్రఅంర్రీఫ్అజవ కౌన్సిల్ బండ ప్రకాష్ గారు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ఈ అడ్వైజరీ కమిటీలో కామారెడ్డి జిల్లా నుండి జైపాల్ రెడ్డి ఎంపిక కావడంపై స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విద్యావంతుడైన జైపాల్ రెడ్డి గారు నిరంతరం విద్యార్థులను, యువతను అథ్లెటిక్స్ వైపు, క్రీడల వైపు ప్రోత్సహిస్తూ, అందరినీ చైతన్యపరుస్తూ ముందుకు తీసుకెళ్తున్నందుకే తనకు ఈ గొప్ప అవకాశం దక్కిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.జైపాల్ రెడ్డి నియామకం పట్ల కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, వివిధ క్రీడ సంఘాలు, వివిధ కళాశాలల అధ్యాపక బృందం, విద్యార్థులు, స్థానిక అథ్లెట్లు, క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేశారు.క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం -- జైపాల్ రెడ్డి:ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ... తనకు ఇంతటి బాధ్యత ను అప్పగించినందుకు స్టేట్ ఒలింపిక్ కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో కామారెడ్డి జిల్లా క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సముచిత స్థానం దక్కేలా, అన్ని రకాల క్రీడల్లో మన జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించేలా కృషి చేస్తానని తెలిపారు. తద్వారా తెలంగాణ రాష్ట్రానికి క్రీడా రంగంలో మంచి పేరు తీసుకువస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, కాబట్టి యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుతో పాటు ఆటలను కూడా సమానంగా బ్యాలెన్స్ చేయాలని పిలుపునిచ్చారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వం, ఆరోగ్యం, మానసిక ఉల్లాసం లభిస్తాయని, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులకు, విద్యార్థులకు ఎల్లప్పుడూ తన వంతు సంపూర్ణ ప్రోత్సాహం ఉంటుందని జైపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

రోడ్డుపై దాన్యం పోయడం వల్ల వాహనాలు అదుపుతప్పి తీవ్ర రోడ్డు ప్రమాదాలు ప్రాణ ఆస్తి నష్టం వాటిల్లే అవకాశం ఉంది.



. ఎస్ ఐ. పుష్పరాజు. (లోకల్ గైడ్ 2నవంబర్ కామారెడ్డి టౌన్) : రైతులు పోలీసులకు సహకరించాలని. రైతుల భద్రతతో పాటు ప్రయాణికుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని.ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనిసదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్ సూచించారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్రంలో కొన్ని గ్రామాలో వరి కోతలు జోరుగా సాగుతున్న వేళ రైతులు ధాన్యాన్ని ఎండబెట్టే పనుల్లో మునిగిపోయారు అయితే కొన్ని గ్రామాలలో కొందరు రైతులు తమకు కేటాయించిన కల్లాల్లో కాకుండా రోడ్డుపైనే వారి ధాన్యాన్ని ఎండబెడుతున్నారని తుది అటువైపు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సదాశివ నగర్ మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలోని రోడ్డుపై దాన్యం కుప్పలు కనిపిస్తున్నాయి తుది ఎప్పుడు ఏ ప్రమాదం ఏ ప్రమాదం జరుగుతుందొనని వాన దారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో మరింత ప్రమాదం. పగటిపూట రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పలు కనిపించిన రాత్రివేళ వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదని చెప్పవచ్చు ముఖ్యంగా సింగిల్ రోడ్డుపై ఎదురుగా మరో వారం వస్తున్నప్పుడు దాని లైట్ వెలుతురు ఎదురుగా వెళ్తున్న మరొక్క వాహనం నడిపే వ్యక్తి కళ్ళల్లోకి నేరుగా పడటం వల్ల రోడ్డుపై ఉన్న దాన్యం కుప్పలు సరిగ్గా కనిపించడం లేదు వాహనాలు ధాన్యం కుప్పల పైకి వెళ్లడం లేదా రోడ్డు కనిపించక రోడ్డు కిందికి వెళ్లి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది ద్విచక్ర వాహనదారులకు కూడా ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదం జరిగే ముప్పు ఉంది. రాళ్లు కట్టెలు పెడితే ప్రమాదమే రోడ్డుపై దాన్యం పోసిన కొందరు రైతులు వాహనదారులకు కనిపించేలా హెచ్చరికలు పెట్టకుండా రాళ్లు కట్టెలు పెట్టుకున్నారు. చీకట్లో అవి కనిపించకపోతే వాహనాలు వాటిని ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దాన్యం కుప్పలపై దూరం నుంచి కనిపించేలా హెచ్చరిక గుర్తులు ఏర్పాటు చేయాలి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వాహనదారులు కూడా జాగ్రత్త పడాలి. కొన్ని గ్రామాల్లో రైతులు అత్యవసర పరిస్థితిల్లో వరి ధాన్యం ఎండబెడితే వాహనదారులు కూడా అప్రమత్తంగా ఉండాలి. వాన దారులు రోడ్డుపై దాన్యం కుప్పలు ఉన్నచోట వేగం తగ్గించి జాగ్రత్తగా ప్రయాణించాలి ముఖ్యంగా రాత్రి సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి రైతులు సొసైటీలు ఐకెపి కేంద్రాల నిర్వాహకులు. సమన్యాయంతో వ్యవహరిస్తే ధాన్యం ఆరబెట్టే సమయంతో పాటు రోడ్డు భద్రతలను కూడా నివారించవచ్చు. రైతులు వీలైనంత వరకు తమకు కేటాయించిన కల్లాల్లోనే ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలి. ఇటీవల కొంతమంది రహదారిపై వడ్లు మొక్కలు ఇతర ధాన్యాన్ని ఆరబెడుతున్నట్టు మా దృష్టికి వచ్చిందని ఇది చట్టరీత్యా నేరమని ప్రమాదకరమని అన్నారు. దీనివల్ల ప్రాణనష్టం జరిగితే దానికి పూర్తి బాధితులు ధాన్యం ఆరబెట్టిన వారేనన్నారు ఇకపై ఎవరు ప్రధాన రహదారిపై గ్రామ రహదారులపై ధాన్యం మారబెట్టరాదని నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేసి జరిమానా చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని దీనివల్ల జరిగే ఏ ప్రమాదానికైనా రోడ్డుపై పోసిన ధాన్యం యజమానిదే బాధ్యత వహించాలా ఉంటుందని సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్ తెలిపారు

తనిఖీ లు ఇర్వాంచిన ఆహారా భద్రత అధికారి విక్రమ్.





(లోకల్ గైడ్ 2నవంబర్ కామారెడ్డి టౌన్.) : రెస్టారెంట్లలో కృత్రిమ ఆహార రంగుల వినియోగం,కామారెడ్డి జిల్లా అపరిశుభ్రతపై తనిఖీలు అనుమతిలేని కృత్రిమ రంగులు వినియోగిస్తే కఠిన చర్యలు: ఆహార భద్రత అధికారి విక్రమ్ కామారెడ్డి జిల్లాలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలనే లక్ష్యంతో ఆహార భద్రతా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రెస్టారెంట్లు, ఆహార విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా కామారెడ్డి పట్టణంలోని అల్ సుభాన్ రెస్టారెంట్‌ను ఆహార భద్రత అధికారి విక్రమ్ తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా చికెన్ కూరలు, వేయించిన అన్నం తదితర వంటకాల తయారీలో అనుమతిలేని కృత్రిమ ఆహార రంగులు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా వంటశాల అపరిశుభ్రంగా ఉండటం, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, వంట సిబ్బంది తల కవర్లు, చేతి తొడుగులు, ఏప్రాన్లు ధరించకపోవడం వంటి లోపాలను గుర్తించారు. ఈ సందర్భంగా మానవ వినియోగానికి పనికిరాని సుమారు 15 కిలోల నిల్వ ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అనుమానిత ఆహార నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. సంబంధిత ఆహార వ్యాపార సంస్థకు ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006లోని సెక్షన్ 32 ప్రకారం నోటీసు జారీ చేశారు.అదేవిధంగా కామారెడ్డి పట్టణంలోని ఎస్ఎస్ఎస్ టిఫిన్ సెంటర్‌ను కూడా తనిఖీ చేశారు. అక్కడ వంటశాల అపరిశుభ్రంగా ఉండటం, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి పరిశుభ్రతా లోపాలను గుర్తించారు. సంబంధిత సంస్థకు మెరుగుదల నోటీసు జారీ చేసి, అనుమానిత ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. ప్రయోగశాల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆహార భద్రత అధికారి విక్రమ్ మాట్లాడుతూ, హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆహార తయారీలో నాణ్యమైన ముడి పదార్థాలను మాత్రమే వినియోగించాలని, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆహార పదార్థాల్లో నిబంధనలకు విరుద్ధంగా కృత్రిమ రంగులు కలపడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలకు విజ్ఞప్తి:

ప్రజలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాలను కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అధికంగా కృత్రిమ రంగులు కలిపిన ఆకర్షణీయమైన ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో అనుమానాలు ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

ఢిల్లీ సభ విజయవంతం..
తెలంగాణ కాంగ్రెస్ సత్తా చాటింది

'ఓట్ బచావో -- దేశ్ బచావో'

సభకు 15 వేల మందికి పైగా కాంగ్రెస్ శ్రేణుల తరలింపు

లోకల్ గైడ్ ఆమనగల్లు, నవంబర్ 2: ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల సంరక్షణ లక్ష్యంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి నిర్వహించిన 'ఓట్ బచావో -- దేశ్ బచావో' సభ విజయవంతం కావడంపై కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సభ ద్వారా తెలంగాణ కాంగ్రెస్ తన ఐక్యతను, సంస్థాగత బలాన్ని చాటుకుందని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మార్గదర్శకత్వంలో, ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో నిర్వహించిన ఈ సభకు దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల సంఘం పనితీరులో పారదర్శకత, ఓటర్ల జాబితాల సవరణలో అవకతవకలపై ప్రజలకు వివరించడమే సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.15 వేల మందికి పైగా తెలంగాణ కాంగ్రెస్ శ్రేణుల తరలింపుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో తెలంగాణ నుంచి 15 వేల మందికి పైగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి తరలివెళ్లి సభను విజయవంతం చేశారని కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.ప్రత్యేక రైళ్లకు చివరి నిమిషంలో అనుమతి నిరాకరించినప్పటికీ పార్టీ శ్రేణులు వెనుకడుగు వేయలేదని, 100కు పైగా ప్రత్యేక బస్సులు, కార్లు, ఇతర వాహనాలు, విమానాల ద్వారా ఢిల్లీ చేరుకున్నారని అన్నారు.పకడ్బందీ ఏర్పాట్లుఢిల్లీకి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులకు ఇబ్బందులు కలగకుండా పీసీసీ సుమారు 800 హోటల్ గదులతో పాటు భోజనం, వసతి, వైద్య, ప్రోటోకాల్, రవాణా సదుపాయాలు కల్పించిందని ఎమ్మెల్యే వివరించారు.ప్రత్యక్షంగా సభకు వెళ్లలేని లక్షలాది మంది తెలంగాణ ప్రజలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సభను వీక్షిస్తూ సంఘీభావం తెలిపారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కొనసాగుతున్న ఓటు హక్కుల పరిరక్షణ పోరాటంలో తెలంగాణ కాంగ్రెస్ ఎల్లప్పుడూ ముందుంటుందని కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

ఘనంగా శ్రీ ఉడిపి కృష్ణ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం.

- ప్రారంభించిన తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

- కార్యక్రమంలో పాల్గొన్న యువ నాయకుడు బర్కెట్ రఘు



లోకల్ గైడ్/తాండూర్: తాండూర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఉడిపి కృష్ణ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ అభివృద్ధి చెందుతూ వినియోగదారులకు నాణ్యమైన ఆహార సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ యజమానులు, నిర్వాహకులు, యువ నాయకుడు బిర్కెట్ రఘుతో పాటు పలువురు నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అందులకు చూపునిచ్చిన ఆడెపు వజ్రమ్మ....



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవపూర్ గ్రామానికి చెందిన ఆడెపు వజ్రమ్మ(65) సోమవారం అనారోగ్యంతో మరణించారు.నేత్రదాత బంధువులు ఆడెపు వెంకన్న,ఆడెపు గణేష్,జనహిత సేవా సమితి ప్రచార కార్యదర్శి నేత్రదాన కమిటీ బాద్యులు డోలి సుకుమార్ లు కుటుంబ సభ్యులకు నేత్రదానం గురించి వివరించగా నేత్రదానం ద్వారా ఇద్దరు జీవితాల్లో వెలుగులు నింపాలని భావించి నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చారు.ఎల్ వి ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ ప్రదీప్ నేత్రదానం లో భాగంగా ఆమె కార్నియా స్వీకరించారు.ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతు ఆడెపు వజ్రమ్మ మృతి బాధాకరమని దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు నేత్రదానం ద్వారా ఇద్దరి అందులకి చూపునివ్వాలని నేత్ర దానానికి ముందుకు రావడం అభినందనీయం అని వీరి స్ఫూర్తితో దేవాపూర్ ప్రాంతంలో ప్రజలందరు మరణానంతరం నేత్ర అవయవ దానానికి ముందుకు రావాలని కోరారు.తమ సేవా సమితి ద్వారా 26వ నేత్రధాన కార్యక్రమం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఆడెపు వెంకన్న,ఆడెపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుని అభినందించిన ఎమ్మెల్యే ప్రేం సాగర్ రావు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : ఎస్ జి ఎఫ్ ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్17బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి,జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మంచిర్యాల అభ్యాస జూనియర్ కళాశాలకు చెందిన సీఈసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి రాచకొండ సాత్విక్ చారిని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,జిల్లా మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా విద్యార్థి సాత్విక్ చారిని ప్రత్యేకంగా అభినందించి,రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయి పోటీల్లోను అద్భుత ప్రతిభ కనబరిచి మంచిర్యాల జిల్లాకు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.సాత్విక్ చారి సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని,చదువుతో పాటు క్రీడల్లోను విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్,డిప్యూటీ మేయర్ సల్ల రమ్య,కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు,కార్పొరేటర్ తూముల నరేష్,మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్,పట్టణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గజ్జల హేమలత,అభ్యాస జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్ శ్రీనివాస్,కళాశాల కరస్పాండెంట్ రమణ,డైరెక్టర్లు సత్యనారాయణ రెడ్డి,మానయ్య తదితరులు పాల్గొన్నారు.

లీ సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ వి రాములు...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వి రాములు అన్నారు.సోమవారం జిల్లా భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి శ్రీనివాస్,డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే,సంబంధిత సర్వేయర్లు,అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రీ సర్వే కోసం కేటాయించిన ప్రతి గ్రామంలో సర్వే ప్రక్రియకు సంబంధించిన అన్ని దశలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన సర్వే పనులు,రికార్డుల పరిశీలన తదితర ప్రక్రియలను వేగవంతం చేసి,9(2) నోటీసుల జారీ వరకు అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేస్తు,తమకు కేటాయించిన గ్రామాలలో అన్ని అంశాలను పూర్తి చేయాలని తెలిపారు.

గర్భిణీ స్త్రీ రాధ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన బీఎస్పీ శ్రేణులు..!

బాధిత కుటుంబానికి జరిగిన అన్యాయానికి

ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి..

షాద్ నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్

పై సమగ్ర విచారణ జరిపించాలి.

బీఎస్పీ జిలా నాయకులు బాలయ్య....

షాద్‌నగర్ అసెంబ్లి ఇంచార్జి తుప్పరి కుమార్... నీరటి రాజు..



లోకల్ గైడ్ న్యూస్ 02 కొందుర్గ్.. : రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం, చెరుకుపల్లి గ్రామానికి చెందిన మల్లని రాధ రమేష్ కుటుంబాన్ని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు సోమవారం సందర్శించి, పరామర్శించారు. షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీ పట్ల వైద్యులు ప్రదర్శించిన నిర్లక్ష్యం వల్ల ఎదురైన విషాద పరిస్థితులపై నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధితులకు ఎదురైన అన్యాయాన్ని అడిగి తెలుసుకున్న అనంతరం, వారి కుటుంబానికి బీఎస్పీ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా బీఎస్పీ నాయకులు బాలయ్య మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే న్యాయంచేయాలి ఆ కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు బీఎస్పీపార్టీ తరపున అండగా నిలుస్తామని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వం నుండి ఆ కుటుంబానికి అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు నష్టపరిహారం వచ్చేలా తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.షాద్‌నగర్ అసెంబ్లీ ఇంచార్జి తుప్పరి కుమార్ మాట్లాడుతూ బాధిత కుటుంబం ఎంతమాత్రం ఒంటరిది కాదని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ వారికి రక్షణగా ఉంటారని పేర్కొన్నారు. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు వారి పక్షాన నిలబడి న్యాయం కోసం పోరాడటమే బీఎస్పీ ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ రకమైన తీవ్రమైన ఘటనల్లో కూడా వైద్యులు, పోలీసులు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని తక్షణమే వీడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షులు శివగల్ల ఆంజనేయులు, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ నీరటి రాజు, కొందుర్గ్ మండల నాయకులు ఆర్. చెన్నయ్య, శరత్ చామర్ మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

కదం తొక్కిన కేబుల్ టీవీ జర్నలిస్టులు.

ఐఅండ్ పీఆర్ కార్యాలయం ఎదుట ధర్నా.

-కమీషనర్ ఛాంబర్ ముందు బైఠాయింపు.

ఆందోళనలో పాల్గొన్న టీడబ్ల్యూజేఎఫ్ నేతలు.

సమస్యను వెంటనే పరిష్కరించాలి -టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 02: (లోకల్ గైడ్): కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ళ పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న అణిచివేత వైఖరికి నిరసనగా అనేకమంది కేబుల్ చానళ్ళ జర్నలిస్టులు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార భవన్(ఐఅండ్ పీఆర్ కమీషనర్ కార్యాలయం)ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. తెలంగాణ కేబుల్ చానల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టులు ఐఅండ్ పీఆర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కమీషనర్ బయటకు రావాలని కేబుల్ చానళ్ళ నిర్వహకులు, జర్నలిస్టులు ఒక్కసారిగా పోలీసుల



వలయాన్ని చేదించుకొని కార్యాలయంలోకి దూసుకెళ్ళారు. కమీషనర్ చాంబర్ ముందు బైఠాయించి నినాదాలు చేస్తున్న జర్నలిస్టులను



పోలీసులు బలవంతంగా బయటకు తరలించారు. అంతకుముందు ధర్నాలో పాల్గొన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, కేబుల్ చానళ్ళ పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అనుచిత వైఖరిని ఖండించారు.తెలంగాణ రాష్ట్రంలో అనేక ఏళ్ళుగా నడుస్తున్న కేబుల్ చానళ్ళకు ఐపీ చానళ్ళ పేరుతో అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని ధ్వజమెత్తారు. చిన్న పత్రికలను, కేబుల్ చానళ్ళ సంఖ్యను కుదించాలనే కుట్రలో భాగంగానే ఇటీవల ఇంటర్నెట్ ప్రోటోకాల్(ఐపీ) నెట్వర్క్ ద్వారా నడుస్తున్నాయనే సాకుతో అనేక కేబుల్ చానళ్ళకు, వాటిలో పని చేస్తున్న జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అన్యాయం చేశారని అన్నారు. అక్రెడిటేషన్ కార్డుల జారీలో అనేక అవకతవకలు జరిగాయని, లక్షల రూపాయల పెట్టుబడితో నడుపుతున్న అసలైన కేబుల్ చానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చారని వారు ఆరోపించారు.కేబుల్ చానళ్ళకు గతంలో జిల్లాకు నాలుగు కార్డులు, రాష్ట్ర స్థాయిలో 12 కార్డులు ఉండగా వీటిని సగానికి తగ్గించారని అన్నారు. కేబుల్ చానళ్ళకు ఒకవైపు ప్రభుత్వం నుంచి ఎటువంటి అడ్వర్టయిజ్మెంట్లు, ఇతర సబ్సిడీలు గానీ లేకపోవడం, మరోవైపు కనీసం అక్రెడిటేషన్ కార్డులు కూడా లేకపోవడం వల్ల అనేక చానళ్ళు మూతపడే పరిస్థితి నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



జర్నలిజం వృత్తి పై ఆధారపడి ఎన్నో ఏళ్ళుగా కేబుల్ చానళ్ళు నడుపుతున్న వేలాది మంది జర్నలిస్టులను ప్రభుత్వం రోడ్డున పడేస్తుందని ధ్వజమెత్తారు.రాష్ట్రవ్యాప్తంగా తమ ప్రభుత్వం జర్నలిస్టులకు 44 వేలకు పైగా అక్రెడిటేషన్లు ఇస్తుందని చెప్పిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి...ఇప్పటి వరకు ఎన్ని అక్రెడిటేషన్లు ఇచ్చారు, ఎవరికి ఇచ్చారు, కేబుల్ చానళ్ళకు ఎన్ని ఇచ్చారో వెల్లడించాలని అన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న కేబుల్ చానళ్ళకు ఎటువంటి కొర్రీలు పెట్టకుండా న్యాయ బద్ధంగా అక్రెడిటేషన్లు ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం లో చిన్న పత్రికలు, కేబుల్ ఛానళ్ళ పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం సరైంది కాదని, ఐపీ ఛానళ్ళ పేరుతో కేబుల్ చానళ్ళను మూసివేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకొని అన్ని కేబుల్ చానళ్ళకు వెంటనేఅక్రెడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్,నేషనల్ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్,టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్ ఎం. రవికుమార్,గద్వాల జిల్లా అధ్యక్షుడు గిరిబాబు, కేబుల్ చానళ్ళ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కాలనీల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక తనిఖీలు...

ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ ప్రాధాన్యత..


మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : గాంజా నివారణకు ప్రజల సహకారం అవసరం అని అనుమానాస్పద వ్యక్తులు,వాహనాలు,అక్రమ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ సూచించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి బెల్లంపల్లి బస్టీలో టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ హాజరై స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కాలనీలో శాంతిభద్రతల పరిస్థితులు,చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఆరా తీసి,నేరాల నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా పోలీసులు కాలనీలోని ఇళ్లను తనిఖీ చేసి నివాసితుల వివరాలను పరిశీలించారు.అలాగే వాహన తనిఖీలు నిర్వహించి సుమారు 80వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను తనిఖీ చేశారు.సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.సంబంధిత వాహనదారులు సరైన ధ్రువపత్రాలను సమర్పించిన అనంతరం నిబంధనల ప్రకారం వాహనాలను అప్పగిస్తామని,లేని పక్షంలో చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఏసీపీ పేర్కొన్నారు.కాలనీలలో పరిసర ప్రాంతాల్లో గంజాయి,మాదకద్రవ్యాల వినియోగం,విక్రయం లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు అనుమానం కలిగితే ప్రజలు భయపడకుండా వెంటనే డయల్112కు సమాచారం అందించాలని



సూచించారు.సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోను ప్రోత్సహించకుండా వాటి నియంత్రణలో పోలీసులకు సహకరించాలని కోరారు.నంబర్ ప్లేట్లు లేకుండా లేదా అనుమానాస్పదంగా వాహనాలపై సంచరిస్తున్న వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అయితే వారితో నేరుగా వాగ్వాదానికి దిగకుండా,అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.ఈ చలాన్లు లేదా ట్రాఫిక్ చలాన్లు పడుతున్నాయనే కారణంతో వాహనాలకు నంబర్ ప్లేట్లు తొలగించి తిరగడం చట్టవిరుద్ధమని,ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చలాన్లకు భయపడాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు.కాలనీలో స్వీయ రక్షణ,నేరాల నియంత్రణ,ప్రజల భద్రత కోసం ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణలో పోలీసులతో ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు,వాహనాలు,అక్రమ కార్యకలాపాలు,గాంజా తాగే వారి వివరాలు,సప్లై దారుల వివరాలు పోలీస్ వాళ్లకి తెలియచేయాలని వారు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించి బాధ్యతాయుత పౌరులుగా సహకరించాలని ఏసీపీ కిరణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు హనోక్,దేవయ్య,ఎస్సైలు రామకృష్ణ, ప్రశాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి..

రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి..



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు.సోమవారం హైదరాబాద్ నుండి ఇతర ఎలక్ట్రోరల్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు,అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.నూతన ఓటరు నమోదు,సవరణలు,మార్పులు,తొలగింపుల కొరకు ఫారం 6,7,8 ద్వారా అందిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని సూచించారు.ఓటరు జాబితా నుండి తొలగించిన ప్రతి ఓటరును,తొలగించడానికి గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని,స్వీప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే వ్యాసరచన,రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని,ఫారం 6,7,8 దరఖాస్తుల పరిష్కారంలో అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు.స్వీప్ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన,రంగోలి పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సింగరేణిలో కాంగ్రెస్ నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక: తోటకూరి రాంబాబు

సింగరేణి, నవంబర్ 2 (లోకల్ గైడ్ న్యూస్): మండల ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రత్యేక వేదికగా నిలుస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు అన్నారు. సింగరేణి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూరి రాంబాబు మాట్లాడుతూ.. మండల ప్రజలు వివిధ పనుల నిమిత్తం, తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి రావచ్చని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పనిచేస్తుందని, మండల ప్రజలకు ఒక చిరునామాగా నిలుస్తుందని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి బానోత్ రామ్మూర్తి నాయక్, సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ), జిల్లా నాయకుడు గుగులోత్ భీముడు నాయక్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్, మాజీ చైర్మన్ ఈసాల నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పెద్దబోయిన ఉమాశంకర్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు కడియాల సుధాకర్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు తాజుద్దీన్, మండల పార్టీ సమన్వయకర్త వాంకుడోత్ గాంధీ, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నునావత్ సాయికిరణ్, మైనారిటీ సెల్ నాయకుడు షఫీ, భూక్యా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు..

ఫేజ్-2కు రూ.150 కోట్లు

మెట్రో ఫేజ్-2కు రూ.150 కోట్లు మంజూరు

రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయింపు

పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఫేజ్-2 అధ్యయనాలు, సర్వేలకు నిధుల వినియోగం

శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో అనుసంధానం ప్రతిపాదన

ఎయిర్‌పోర్టు నుంచి పాతబస్తీ వరకు.. మెట్రో రెండో దశకు ఊతం



హైదరాబాద్: హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపడంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది. రెండో దశ (ఫేజ్-2) పనుల కోసం రూ.150 కోట్లు, ప్రభుత్వ రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయించింది. నగరంలో పెరుగుతున్న జనాభా, ఐటీ, పారిశ్రామిక రంగాల విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను శివారు ప్రాంతాలకు విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తాజా నిధులతో ఫేజ్-2కు సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనాలు, ప్రాథమిక పనులు, ప్రతిపాదిత కారిడార్ల సర్వేలు వేగవంతం కానున్నాయి. రెండో దశలో శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్ పరిధిలోని రాయదుర్గం-కోకాపేట, పాతబస్తీ పరిధిలోని ఎంజీబీఎస్-చంద్రాయణగుట్టతో పాటు ఇతర శివారు ప్రాంతాలను కలిపే కారిడార్లను ప్రతిపాదించారు. మరోవైపు ప్రభుత్వ రుణాల పద్దు కింద కేటాయించిన రూ.125 కోట్లతో మెట్రో ప్రాజెక్టు నిర్వహణ, ఆర్థిక బకాయిలకు సంబంధించిన అవసరాలను సమతుల్యం చేయాలని భావిస్తున్నారు. ఈ నిధుల కేటాయింపుతో ఫేజ్-2 పనులకు సంబంధించిన తదుపరి చర్యలు ముందుకు సాగనున్నాయి.

59 కోట్లకు చేరిన జన్‌ధన్ ఖాతాలు..

వీటిల్లో ఎంత డబ్బుందో తెలుసా?

ఖాతాల్లో రూ.3.17 లక్షల కోట్ల డిపాజిట్లు

మహిళల పేరిట 56 శాతం ఖాతాలు

78 శాతం ఖాతాలు గ్రామీణ ప్రాంతాల్లో

ఒక్కో ఖాతాలో సగటు డిపాజిట్ రూ.5,356

రూపే కార్డుతో రూ.2 లక్షల బీమా

ఢిల్లీ: దేశంలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) ఖాతాల సంఖ్య 59 కోట్లు దాటింది. ఈ ఖాతాల్లో మొత్తం రూ.3.17 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. 2014 ఆగస్టు 28న ప్రారంభమైన ఈ పథకం 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. జన్‌ధన్ ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోనే ఉన్నాయి. సుమారు 56 శాతం ఖాతాలు మహిళల పేరిట ఉన్నాయి. పేదలు, మారుమూల ప్రాంతాల ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 ఆగస్టు 19 నాటికి ఒక్కో ఖాతాలో సగటున రూ.5,356 ఉన్నాయి. గత 12 ఏళ్లలో ఒక్కో ఖాతాకు సగటు డిపాజిట్ 3.4 రెట్లు పెరిగింది. ఖాతాలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారని, పొదుపు అలవాటు పెరిగిందని ఇది సూచిస్తోందని ఆర్థిక శాఖ తెలిపింది. జన్‌ధన్ ఖాతాదారులకు ఉచిత రూపే డెబిట్ కార్డు లభిస్తుంది. దీనితో రూ.2 లక్షల ప్రమాద బీమా ఉంటుంది. అత్యవసర సమయంలో రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం కూడా ఉంది. జన్‌ధన్-ఆధార్-మొబైల్ (జేఏఎం) వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతోంది. మధ్యవర్తులు, జాప్యానికి అవకాశం లేకుండా ఆర్థిక సాయం అందుతోందని కేంద్రం తెలిపింది.

జపాన్‌లో శాశ్వత నివాసం ఇక అంత ఈజీ కాదు..

ఏకంగా 1900 శాతం పెరిగిన ఫీజు!

పీఆర్ ఫీజు అక్టోబర్ 1 నుంచి భారీగా పెంపు

2 లక్షల యెన్‌లకు చేరనున్న ఫీజు

పీఆర్ ఫీజులో 1900 శాతం పెంపు

ఏడాది నివాస పొడిగింపునకు 33,000 యెన్‌లు

ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువకు 75,000 యెన్‌లు

ఢిల్లీ: జపాన్‌లో శాశ్వతంగా స్థిరపడాలనుకునే విదేశీయులకు భారీ షాక్ తగలనుంది. అక్టోబర్ 1 నుంచి శాశ్వత నివాస అనుమతి (పీఆర్) కోసం చెల్లించే ఫీజు ఏకంగా 1900 శాతం పెరగనుంది. ప్రస్తుతం 10,000 యెన్‌లు (సుమారు రూ.6 వేలు)గా ఉన్న ఫీజు.. ఇకపై 2 లక్షల యెన్‌లు (సుమారు రూ.1.2 లక్షలు) కానుంది. విదేశీయుల నివాస అనుమతికి సంబంధించిన ఇతర ఫీజులను కూడా జపాన్ ప్రభుత్వం పెంచింది. ఈ మార్పులకు మంగళవారం కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది తీసుకొచ్చిన ఇమ్మిగ్రేషన్ చట్ట సవరణల్లో భాగంగా కొత్త ఫీజులు అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం నివాస అనుమతిని పొడిగించేందుకు లేదా మార్చుకునేందుకు 6,000 యెన్‌ల (సుమారు రూ.3,600) ఫీజు ఉంది. అక్టోబర్ నుంచి గడువును బట్టి ఫీజు మారుతుంది. మూడు నెలల వరకు పొడిగింపునకు 10,000 యెన్‌లు చెల్లించాలి. ఏడాది పొడిగింపునకు 33,000 యెన్‌లు (సుమారు రూ.19,800) అవుతుంది. మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు నివాసానికి 64,000 యెన్‌లు (సుమారు రూ.38,400) చెల్లించాలి. ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలానికి 75,000 యెన్‌లు (సుమారు రూ.45 వేలు) ఫీజు ఉంటుంది. తాత్కాలిక నివాస ప్రక్రియలకు గరిష్ఠంగా 1 లక్ష యెన్‌లు (సుమారు రూ.60 వేలు), శాశ్వత నివాస ప్రక్రియకు గరిష్ఠంగా 3 లక్షల యెన్‌లు (సుమారు రూ.1.8 లక్షలు) వరకు ఫీజు నిర్ణయించే అవకాశం ప్రభుత్వానికి ఉంది. తుది మొత్తాలను ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ఖరారు చేస్తారు. అయితే ఆర్థికంగా లేదా మానవతా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొందరికి ఫీజులో రాయితీ లభించనుంది. జపాన్ పౌరుల పిల్లలను ఒంటరిగా పెంచుతున్న కొందరు విదేశీయులు కూడా ఈ మినహాయింపుకు అర్హులయ్యే అవకాశం ఉంది.

అర్ధ శతాబ్దపు సుదీర్ఘప్రయాణం

50వ ఏట అడుగుపెట్టిన 'రాయలసీమ ఎక్స్‌ప్రెస్'

49 ఏళ్ల సుదీర్ఘ సేవలను పూర్తి చేసుకున్న రాయలసీమ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

1977లో మీటర్ గేజ్ పట్టాలపై సాధారణ సర్వీసుగా సేవలను ప్రారంభించిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్

దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత ప్రజాదరణ పొందిన రాయలసీమ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఒక అరుదైన, చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. 49 ఏళ్ల సుదీర్ఘ సేవలను విజయవంతంగా పూర్తి చేసుకుని, ఈ రైలు ఇప్పుడు 50వ సంవత్సరం (అర్ధ శతాబ్దం)లోకి అడుగుపెట్టింది. 1977లో మీటర్ గేజ్ పట్టాలపై అత్యంత సాధారణ సర్వీసుగా ప్రయాణాన్ని ప్రారంభించిన ఈ రైలు ఐదు పదుల కాలంలో పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యంత నమ్మకమైన 'పేదల బండి'గా నిలిచింది. కాలక్రమేణా ప్రయాణికుల నుంచి వచ్చిన భారీ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ఈ రైలును హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వరకు పొడిగించింది. అంతేకాకుండా సాధారణ ఎక్స్‌ప్రెస్ నుంచి సూపర్ ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్ చేయడమే కాక, ఆధునిక ఎల్హెచ్‌బి (ఎఎచ్‌డీ) కోచ్‌లతో పాటు శక్తివంతమైన ఇంజన్లను అమర్చారు. ప్రస్తుతం ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మీదుగా 890 కిలోమీటర్ల సుదీర్ఘ దూరాన్ని ప్రతిరోజూ విజయవంతంగా చేరుకుంటోంది. తరాలు మారుతున్నా, ఆధునిక సాంకేతికతతో ఎన్ని వందే భారత్, ఇతర కొత్త రైళ్లు వచ్చినా రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కున్న క్రేజ్, ఆదరణ మాత్రం ఇసుమంతైనా తగ్గలేదు. ముఖ్యంగా వికారాబాద్ జిల్లా తాండూరుతో పాటు పలు ప్రాంతాల ప్రజలతో ఈ రైలుకు విడదీయరాని ప్రత్యేక అనుబంధం ఉంది. మూడు రాష్ట్రాల ప్రజల రవాణా అవసరాలను తీరుస్తూ, ఆత్మీయ బంధాన్ని పెనవేసుకున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ 50వ ఏట ప్రవేశించడంపై రైల్వే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ రెండు రకాల వైపరీత్యాలతో సతమతమవుతోంది.. తక్షణమే సాయం అందించండి: కేంద్రబృందంతో చంద్రబాబు

అర్నబ్ తుపాను నష్టం అంచనా వేసేందుకు ఏపీలో పర్యటిస్తున్న కేంద్రబృందం

కేంద్రబృందంతో సమావేశమైన సీఎం చంద్రబాబు

అర్నబ్ తుపాను వల్ల ప్రాథమికంగా రూ.4,526 కోట్ల నష్టం వాటిల్లినట్టు చంద్రబాబు వెల్లడి

రాష్ట్రానికి త్వరితగతిన సాయం అందించాలని కేంద్ర బృందానికి సీఎం విజ్ఞప్తి

ఒకవైపు కరవు, మరోవైపు తుపానులతో ఏపీ ఇబ్బందులు పడుతోందని వెల్లడి



అమరావతి: అర్నబ్ తుపాను కారణంగా రాష్ట్రానికి ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.4,526 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటిస్తున్న కేంద్ర బృందంతో సోమవారం ఆయన సమావేశమై పరిస్థితిని వివరించారు. ఈ కష్టకాలంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుపాను సమాచారం అందిన వెంటనే స్పందించి, నష్టాన్ని అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ), ఆధునిక టెక్నాలజీని సమర్థంగా ఉపయోగించుకోవడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. తుపాను నష్టంపై ప్రాథమిక నివేదికను వెంటనే కేంద్రానికి పంపించాం" అని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని, ఒకవైపు రాయలసీమలో ఎల్ నినో వంటి తీవ్ర కరవు పరిస్థితులు నెలకొంటే, మరోవైపు కోస్తా ప్రాంతం వరుస తుపానులతో అతలాకుతలమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్నబ్ తుపాను మిగిల్చిన నష్టం నుంచి కోలుకోకముందే 'మురసు' రూపంలో మరో తుపాను ముప్పు పొంచి ఉందని గుర్తుచేశారు. తుపాను ప్రభావంతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని సీఎం వివరించారు. ముఖ్యంగా కొబ్బరి, అరటి తోటలు పూర్తిగా నేలమట్టమయ్యాయని తెలిపారు. కరవును తట్టుకునేందుకు రాయలసీమ రైతులను ఉద్యాన పంటల వైపు ప్రోత్సహిస్తుంటే, ఇప్పుడు ఆ పంటలు కూడా తుపానుల బారిన పడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆక్వా కల్చర్ రంగానికి కూడా భారీ నష్టం వాటిల్లిందని, మత్స్యకారుల పడవలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. గతంలో హుద్ హుద్, తిత్లీ, మొంథా వంటి తుపానులు కూడా రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశాయని ప్రస్తావించారు. ప్రస్తుతం 7 వేల మంది సిబ్బందితో విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని, సహాయక చర్యలను ఆర్టీజీఎస్ ద్వారానే పర్యవేక్షిస్తున్నామని సీఎం వివరించారు. కేంద్ర బృందం త్వరితగతిన తమ సిఫార్సులను కేంద్రానికి అందించి, రాష్ట్రానికి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. కేంద్రం అందించే సత్వర సాయం, ఈ కష్టకాలంలో రాష్ట్రానికి ఎంతో ఊరటనిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.

త్రివర్ణ పతాకం చేతబూని హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర.. కదంతొక్కిన కాషాయ శ్రేణులు

'ఇండియా' కూటమికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా మహా పాదయాత్ర

'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' నినాదంతో బీజేపీ ర్యాలీ

బషీర్‌బాగ్ నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు 1.5 కిలోమీటర్ల మేర పాదయాత్ర

పాదయాత్రకు ముందు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమిత్ షా ప్రత్యేక పూజలు

కాంగ్రెస్ తీరుపై సోషల్ మీడియా వేదికగా అమిత్ షా తీవ్ర విమర్శలు




హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో మహా పాదయాత్ర చేపట్టారు. 'ఇండియా' కూటమి చేపట్టిన ప్రచారాన్ని తిప్పికొట్టే లక్ష్యంతో బీజేపీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ పాదయాత్ర సాగింది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' అనే నినాదంతో ఈ ర్యాలీని నిర్వహించారు. నగరంలోని బషీర్‌బాగ్‌లో ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఈ పాదయాత్ర ప్రారంభమైంది. జాతీయ జెండా చేతబూని అమిత్ షా ముందుకు సాగగా, ఆయనతో పాటు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. సుమారు 1.5 కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్ర మొజాంజాహీ మార్కెట్ వద్ద ముగియనుంది. అక్కడ జరిగే కార్నర్ మీటింగ్‌లో అమిత్ షా ప్రసంగించనున్నారు. ఢిల్లీలో ఆదివారం 'ఇండియా' కూటమి నిర్వహించిన ర్యాలీలో బీజేపీపై చేసిన విమర్శలకు ఆయన ఇక్కడ దీటైన సమాధానం ఇచ్చే అవకాశం ఉంది. పాదయాత్రకు ముందు, కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని అమిత్ షా సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "పరుస ఓటములతో కుంగిపోయిన కాంగ్రెస్, ఇప్పుడు అరాచక చర్యలతో ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి అయినా సరే అధికారాన్ని దక్కించుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ కుట్రపూరిత ప్రయత్నాల నుంచి మన ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ మహా పాదయాత్రలో పాల్గొంటున్నాను" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. నగర పర్యటనలో భాగంగా, తొలుత అమిత్ షా చారిత్రక చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఇతర బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర నేపథ్యంలో బషీర్‌బాగ్, నాంపల్లి, అబిడ్స్, కోఠి, అఫ్జల్‌గంజ్ సహా పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించి, వాహనాలను దారి మళ్లించారు.

సరస్సు అడుగున నగరం!

కిర్గిస్తాన్‌లో బయటపడ్డ చారిత్రక టోర్ ఐగిర్ ఆనవాళ్లు

రష్యా పురావస్తు పరిశోధకుల అన్వేషణలో గుర్తింపు

రాతి దూలాలతో నిర్మించిన కట్టడాలు, సిరామిక్ కళాఖండాలు వెలుగులోకి..



అది కిర్గిస్థాన్‌లోని ఇస్సిక్ కుల్ ఉప్పునీటి సరస్సు. ప్రపంచంలో ఎన్నో చెరువులుండగా దీని గురించే ఎందుకు చెప్పుకోవాలంటే ఆ చెరువు కింద ఓ పురాతన నగరం దాగి ఉంది కాబట్టి! 15వ శతాబ్దంలో సంభవించిన భారీ భూకంపం టోరు ఐగిర్ అనే నగరాన్ని నాశనం చేయగా అనంతర కాలంలో సంభవించిన మార్పులతో అక్కడ ఏర్పడిన ఉప్పునీటి సరస్సు ఆ నగరాన్ని మింగేసింది. అయితే పశ్చిమాసియా దేశాల్లో మధ్యయుగ నివాస ప్రదేశాల గురించి అధ్యయనం చేస్తున్న రష్యా పరిశోధకుల బృందం.. అంతర్ధానమైన సిల్క్‌రూట్ ఆనవాళ్లను వెలికితీయడంతోపాటు 13, 14వ శతాబ్దాల నాటి నెక్రోపోలిస్ సైట్‌ల శోధన మొదలుపెట్టింది. ఈ క్రమంలో రష్యాకు చెందిన అండర్‌వాటర్ ఆర్కియాలాజిస్ట్ మ్యాక్సిమ్ మెన్షికోవ్ ఆధ్వర్యంలోని పరిశోధన బృందం ఇస్సిక్ కుల్ సరస్సు కింద దాగి ఉన్న టోరు ఐగిర్ నగరాన్ని గతేడాది గుర్తించింది.

క్రీస్తుపూర్వ నగరమిది..

క్రీస్తుపూర్వం ఒకటవ శతాబ్దంలో వర్తక, వాణిజ్యం కోసం సిల్?కరూట్‌లో ఏర్పడిన నగరాల్లో టోరు ఐగిర్ నగరం కూడా ఒకటి. చైనా నుంచి పశి?చిమ దేశాలకు ప్రయాణించే వర్తకులకు ఇది మజిలీ నగరంగా ఉండేది. ఈ నగరం ఆనవాళ్లను గుర్తించేందుకు సరస్సు అడుగుకు వెళ్లిన పరిశోధకులకు ఇటుకలతో నిర్మించిన కట్టడాలు, టర్కీ రాజవంశీయుల, ఇస్లామిక్ పాలన ఆనవాళ్లు, ఇస్లాం సంప్రదాయ సమాధులు కనిపించాయి. ధాన్యాన్ని పిండి చేయడానికి ఉపయోగించిన మన తిరగలి వంటి సాధనాలు, చెక్క, రాతి దూలాలతో నిర్మించిన భవనాలు, సిరామిక్ కళాఖండాలు కూడా కంటబడ్డాయి. అక్కడ ఓ మసీదు, స్నానశాల, ఇస్లామిక్ విశ్వవిద్యాలయంతోపాటు చక్కటి ఎక్స్‌టీరియర్‌తో ఒక కమ్యూనిటీ బిల్డింగ్ కూడా ఉంది. అండర్ వాటర్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డ్రోన్ షూటింగ్ ప్రక్రియల ద్వారా నీటి అడుగున ఉన్న నగరం గురించి అండర్‌వాటర్ ఆర్కియాలజిస్టులు ప్రపంచానికి తెలియచేశారు. ఈ ఫొటోలను పరిశీలిస్తే నాటి భవన నిర్మాణంలో కాలి?చన ఇటుకలను ఉపయోగించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఇటుకలతో పోలిస్తే నాటి ఇటుకలు పరిమాణంలో చాలా పెద్దవి. ఒక్కమాటలో చెప్పాలంటే టోరు ఐగిర్ నగరం క్రీస్తు పూర్వం 1,300 నుంచి 3,300 ఏళ్ల మధ్య విరాజిల్లిన సింధు నాగరకతను గుర్తుచేసింది.

బీటలువారిన ఒపెక్!



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒకటి తలిస్తే జరిగేది ఎప్పుడూ మరోటి. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై క్షిపణుల వర్షం కురిపిస్తే అది నాలుగురోజుల్లో పాదాక్రాంతమవుతుందని అంచనావేసుకుని ప్రారంభించిన యుద్ధం కాస్తా వికటించి ఆయన ఆ ఊబిలో కూరుకుపోయారు. దాన్నుంచి ఎలా బయటపడాలో తెలియని తరుణంలో పశ్చిమాసియాలో ఆయన ఉద్దేశించని పరిణామం సంభవించింది. మే 1 నుంచి పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్)నుంచి తప్పుకోవాలని నిర్ణయించినట్టు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రకటించింది. దాన్నుంచి మాత్రమే కాదు... 2016లో ఏర్పడిన 'ఒపెక్ ప్లస్'నుంచి కూడా వైదొలగనున్నట్టు తెలిపింది. ఒపెక్‌లో సభ్యత్వం తీసుకోని రష్యావంటి ఇతర చమురు ఉత్పత్తి దేశాలతో ఈ గ్రూప్ ఏర్పడింది. ఒపెక్ ప్రపంచ చమురు ఉత్పత్తుల పరిమాణాన్నీ, ఎగుమతుల్నీ, వాటి ధరల్నీ నిర్దేశిస్తున్న కీలక సంస్థ. ప్రపంచ ఆర్థికవ్యవస్థ తీరుతెన్నులు దానిపైనే ఆధారపడతాయి. ప్రపంచ పెట్రో ఉత్పత్తుల్లో ఒపెక్ వాటా మూడోవంతుకన్నా ఎక్కువ. ఒపెక్ నుంచి తప్పుకోవాలన్న యూఏఈ ఆలోచన చాలా పాతది. కానీ ఎప్పటికప్పుడు వాయిదా వేసుకుంటూ వచ్చింది. కానీ ఇరాన్ యుద్ధంతో అది తుది నిర్ణయానికొచ్చింది. ఒపెక్ సంస్థ ఆవిర్భావానికీ, విస్తరణకూ పాశ్చాత్య బహుళజాతి సంస్థల నిర్వాకం కారణం. చమురు దేశాలు ఎంత ఉత్పత్తి చేయాలో, ఏ ధర నిర్ణయించాలో అవి నిర్దేశించేవి. వాటి చెప్పుచేతల్లో ఉండటం ఇక సాధ్యంకాదన్న నిర్ణయానికొచ్చిన చమురు దేశాలు 1960 సెప్టెంబర్‌లో బాగ్దాద్‌లో సమావేశమై ఒపెక్ ఏర్పాటుకు తీర్మానించాయి. ఇరాన్, కువైట్, ఇరాక్, సౌదీ అరేబియా, వెనెజులా దేశాలు ఇందులో భాగస్వాములు. 1967లో యూఏఈ చేరింది. 1973లో అరబ్--ఇజ్రాయెల్ యుద్ధంలో ఇజ్రాయెల్‌ను వెనకేసుకొస్తున్న అమెరికా, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, పోర్చుగల్ తదితర దేశాల వైఖరిపై ఆగ్రహించిన ఒపెక్... చమురు ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ, ఆ దేశాలకు ఎగుమతుల్ని నిషేధించింది. దాంతో పెను సంక్షోభం ఏర్పడింది. అనంతరకాలంలో ఈ దేశాలన్నీ అమెరికాకు సాగిలబడ్డాయి. అది వేరే కథ! ఒపెక్‌లో రాజుకుంటున్న అసంతృప్తికి సౌదీ పెద్దన్న పాత్ర పోషిస్తుండటం ఒక కారణం. ఏ దేశం ఎంత ఉత్పత్తి చేయాలో అదే నిర్ణయించటంవల్ల తమకు అన్యాయం జరుగుతున్నదని సభ్యదేశాల్లో ఎప్పటినుంచో అసంతృప్తి ఉంది. అందుకే 2019లో ఖతార్, ఆ మరుసటి ఏడాది ఈక్వెడార్, 2024లో అంగోలా సంస్థనుంచి వైదొలగాయి. ఆ వరసలో యూఏఈ నాలుగో దేశం. అంతర్జాతీయ చమురు ధరల్ని బట్టి ఉత్పత్తిని నియంత్రించుకుంటూ, అది కోరుకున్న ధరలో ఉండేలా చూసుకోవటం ఒపెక్ అలవాటు. తన తొలి ఏలుబడిలో ఒపెక్ దేశాలపై ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడిన సందర్భాలున్నాయి. చమురు ధరలు పెంచుతూ ప్రపంచ ఆర్థికవ్యవస్థను అస్తవ్యస్థం చేస్తున్నాయన్నది ఆయన ఆరోపణ. అయితే 2020లో కోవిడ్ సమయంలో పాతాళానికి పడిపోయిన చమురు ధరలతో దివాలా స్థితికి చేరిన అమెరికన్ సంస్థల్ని కాపాడుకునేందుకు ఉత్పత్తిని తగ్గించమని ఒపెక్‌ను వేడుకున్నది కూడా ఆయనే. సౌదీ తీరుపై యూఏఈ ఆగ్రహంతో ఉండటానికి కారణం ఉంది. అది ప్రస్తుతం రోజుకు 35 లక్షల బ్యారెళ్ల చమురు ఉత్పత్తి చేస్తోంది. తనకున్న సామర్థ్యంతో అంతకన్నా ఎక్కువ చేయగలిగినా, సౌదీ అరేబియా నిర్దేశిస్తున్న కోటా ఆటంకంగా ఉంది. వచ్చే ఏడాదికల్లా దాన్ని 50 లక్షల బ్యారెళ్లకు పెంచాలంటే తప్పుకోవటమే ఉత్తమమని అది భావిస్తోంది. ఈలోగా ఇరాన్ యుద్ధం దాని సమస్యల్ని పెంచింది. గల్ఫ్ దేశాల్లో ఇరాన్ దాడుల్లో ఆ దేశమే అధికంగా నష్టపోయింది. కనుకనే ఈ బాదరబందీని వదుల్చుకోవాలని నిర్ణయించుకుంది. పర్యవసానంగా వెనువెంటనే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధర మూడు శాతం పెరిగిన మాట వాస్తవమే అయినా, దీర్ఘకాలంలోగానీ దాని అసలు ప్రభావం కనబడదు. యూఏఈ మిత్రదేశంగా భారత్‌కు ఈ పరిణామం లాభదాయకమే. కానీ ఒపెక్ ఎలాంటి ఆంక్షలు పెడుతుందో చూడాలి. మొత్తానికి ఇన్నాళ్లూ కలిసికట్టుగా ఉన్నట్టు కనబడిన గల్ఫ్, ఒపెక్ బీటలువారుతున్నాయి. ఈ పరిణామం పశ్చిమాసియాలో అమెరికా పలుకుబడిని తగ్గిస్తుంది. ఇరాన్ పాదాక్రాంతం మాటేమోగానీ... అమెరికాకు ముమ్మాటికీ ఇది సమస్యాత్మకం.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: చలకమర్తి రంగారెడ్డి
www.localguidenews.com
మంగళవారం - 03 - నవంబర్ - 2026

అందాల రాశి అనడంలో సందేహమా?





ఆర్ఎక్స్ 100 సినిమాతో టాలీవుడ్‌లో జెండా పాతిన ముద్దుగుమ్మ పాయల్ రాజ్‌పూత్ ఆ తర్వాత పలు సూపర్ హిట్ సినిమాల్లో హీరోయిన్‌గా నటించడంతో పాటు, టాలీవుడ్‌లో దశాబ్ద కాలం క్రితం 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో కాస్త చబ్బీగా కనిపించిన రాశి ఖన్నా ఇప్పుడు మాత్రం సన్నగా నాజూకుగా కనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఈమె ఫోటోలు రెగ్యులర్‌గా షేర్ చేస్తోంది. సన్నగా నాజూకుగా ఉన్న రాశి ఖన్నా ఫోటోలు ఈ మధ్య కాలంలో వైరల్ అవుతూ ఉన్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో కంటే కోలీవుడ్, బాలీవుడ్‌లో ఎక్కువ బిజీగా ఉంటుంది. దాదాపు మూడు ఏళ్ల తర్వాత హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు దూరంగా ఉన్న రాశి ఖన్నా తెలుగులో రీ ఎంట్రీకి సిద్ధం అయింది. రాశి ఖన్నా హీరోయిన్‌గా తెలుసు కదా అనే సినిమాతో రాబోతుంది. నిహారిక నాగ చైతన్య హీరోగా వచ్చిన థాంక్యూ సినిమాలో రాశి ఖన్నా చివరగా తెలుగు తెరపై కనిపించింది. మళ్లీ ఇన్నాళ్లకు సిద్ధు జొన్నలగడ్డ హీరోగా రూపొందిన సినిమాలో ఈమె హీరోయిన్‌గా కనిపించబోతుంది. హీరోయిన్‌గా రాశి ఖన్నాతో పాటు 'తెలుసు కదా' సినిమాలో కేజీఎఫ్ బ్యూటీ శ్రీనిధి శెట్టి సైతం హీరోయిన్‌గా నటించింది. సిద్ధు సినిమాలంటే యూత్‌లో మంచి బజ్ ఉంటుంది. అలాంటి హీరోకు జోడీగా నటించడం ద్వారా రాశి ఖన్నా మరోసారి టాలీవుడ్‌లో బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో రాశి ఖన్నా తాజాగా షేర్ చేసిన ఫోటోల గురించి ఆమె ఫాలోవర్స్‌తో పాటు మీడియా వర్గాల వారు, అభిమానులు తెగ ముచ్చటించుకుంటున్నారు. బ్లాక్ డ్రెస్‌లో స్కిన్ షో చేసిన రాశి ఖన్నా అందాల ఆరబోతకు అభిమానులు ఫిదా అవుతున్నారు. ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చి దశాబ్ద కాలం దాటింది. అయినా కూడా ఈమె అందం ఏమాత్రం తగ్గలేదు. పైగా ఈమె రోజు రోజుకు మరింత అందంగా కనిపిస్తుంది అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. థైస్ అందాలతో మతి పోగొడుతున్న ముద్దుగుమ్మ రాశి ఖన్నా ఫోటోలను అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో రాశి ఖన్నా ఇలా అందంగా కనిపిస్తున్న ఫోటోలు రెగ్యులర్‌గా వస్తూనే ఉన్నాయి. అయితే రాశి ఖన్నా షేర్ చేసిన తాజా ఫోటోలు మాత్రం మరింత అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆకట్టుకునే అందం తో రాశి ఖన్నా మెప్పించింది. రాశి ఖన్నా బాలీవుడ్‌లో బిజీగా ఉంటుంది. ది సబర్మతి రిపోర్ట్ సినిమాలో రాశి ఖన్నా నటించింది. బాలీవుడ్‌లో రాశి ఖన్నాకు ఆశించిన స్థాయిలో పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకోలేదు. యోధ సినిమాతో సైతం హీరోయిన్‌గా బాలీవుడ్‌లో రాశి ఖన్నా నటించింది. ఆ సినిమా కూడా రాశి ఖన్నాకు అంతగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. హిందీతో పాటు తమిళ్‌లో ఈ అమ్మడు పలు సినిమాల్లో నటించింది. ప్రస్తుతం తెలుగులో ఒక సినిమాలో నటిస్తున్న ఈ అమ్మడు తమిళ్‌లో ఒక సినిమాను చేస్తుంది. ఈ ఏడాదిలో రెండు సినిమాలతో రాశి ఖన్నా వచ్చే అవకాశం ఉంది. వచ్చే ఏడాదిలో ఈ అమ్మడు తెలుగులో కనీసం రెండు మూడు సినిమాలు అయినా చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు.

టాలీవుడ్ లో కన్నడ భామల డిమాండ్

హీరోయిన్ శ్రీనిధి శెట్టి కి ఎంతో టాలెంట్ ఉంది. కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాల్లో హీరోయిన్ గా నటించి అందరికీ పరిచయమైంది శ్రీనిధి. కానీ ఆ సినిమాలు హీరో పాత్ర ప్రధానంగా తెరకెక్కడంతో శ్రీనిధి శెట్టి కేవలం గ్లామర్ పాత్రకే పరిమితమైంది. కెజిఎఫ్ సినిమాల్లో



నటించడం ద్వారా శ్రీనిధికి పాన్ ఇండియా స్థాయిలో అటెన్షన్ అయితే వచ్చింది కానీ స్టార్‌డమ్ మాత్రం రాలేదు. కానీ రీసెంట్ గా తెలుగులో శ్రీనిధి చేసిన హిట్3 సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో ఆ సినిమా అమ్మడికి మంచి స్టార్ డమ్‌ను తెచ్చి పెట్టింది. హిట్3 సక్సెస్ తో శ్రీనిధి తెలుగులో బిజీ అయ్యే అవకాశాలు పుష్కలంగానే కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడో ఇంట్రెస్టింగ్ విషయముంది. కన్నడ సినిమా నుంచి వచ్చిన రష్మిక మందన్నా, శ్రీలీల తమ కెరీర్ ను కన్నడలోనే మొదలుపెట్టారు కానీ ఎప్పుడైతే తెలుగు సినిమాలు చేశారో అప్పట్నుంచి వారికి విపరీతమైన స్టార్‌డమ్ వచ్చి ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీ అయ్యారు. రష్మిక, శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్ లో కూడా తమ సత్తా చాటుతున్నారు. రీసెంట్ టైమ్ లో సప్త సాగారాలు దాటి ఫ్రాంచైజ్ సినిమాలతో సక్సెస్ అందుకున్న రుక్మిణి వసంత్ కూడా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న డ్రాగన్ సినిమాలో ఛాన్స్ కొట్టేసింది. డ్రాగన్ మూవీ షూటింగ్ కూడా పూర్తవకముందే రుక్మిణి డిమాండ్ టాలీవుడ్ లో బాగా పెరిగింది. దీంతో ఇప్పుడు శ్రీనిధి శెట్టి కూడా కన్నడ లో కెరీర్ ను స్టార్ట్ చేసి తెలుగులో స్టార్‌డమ్ అందుకున్న హీరోయిన్ల లిస్ట్ లో చేరింది. ఇక శ్రీనిధి విషయానికొస్తే ఆమె మధ్యలో కోబ్రా అనే తమిళ సినిమా చేసింది, కానీ అది శ్రీనిధికి అనుకున్న గుర్తింపు ఇవ్వలేదు. మూడేళ్ల తర్వాత ఆమె హిట్3తో తిరిగి సిల్వర్ స్క్రీన్ పై మెరిసి మంచి హిట్ తో పాటూ భారీ గుర్తింపును కూడా అందుకుంది. హిట్3 రిలీజ్ కు ముందే ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటూ సోషల్ మీడియాలో ఎంతోమందిని ఎట్రాక్ట్ చేసిన శ్రీనిధి గురించి అందరూ డిస్కస్ చేసుకున్నారు. హిట్3 సక్సెస్‌తో ఆల్రెడీ శ్రీనిధికి టాలీవుడ్ లో డిమాండ్ పెరిగింది. హిట్3 సక్సెస్ తో ఆమె వెంటనే స్టార్ హీరోయిన్ల లీగ్ లోకి ఎంటరయ్యే ఓ భారీ ఛాన్స్ దొరకడమే ఆలస్యం. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ హీరోగా శ్రీనిధి శెట్టి తెలుసు కదా అనే సినిమా చేస్తోంది. ఈ సినిమాతో పాటూ కన్నడలో సుదీప్ తో ఓ సినిమా చేస్తోంది శ్రీనిధి.



అందాల పాయల్ స్పెషల్ షో

పలు సినిమాల్లో ఐటెం సాంగ్‌ను చేయడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. అయితే ఈ యంగ్ బ్యూటీ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకోవడంలో విఫలం అయింది. ఆర్ఎక్స్ 100 సినిమాలో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించడం ద్వారా ఈ అమ్మడి నటన ప్రతిభ ఏంటో అందరికీ తెలిసింది. సాధారణంగా హీరోయిన్స్ అందంతో గుర్తింపు దక్కించుకుంటారు. కానీ పాయల్ రాజ్‌పూత్ మాత్రం తన నటనతోనూ మంచి గుర్తింపు దక్కించుకుంది. కానీ ఆ గుర్తింపు కెరీర్‌కి అంతగా హెల్ప్ అవ్వడం లేదు అని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాలకు పరిమితం అయిన పాయల్ రాజ్ పూత్ నుంచి ఆమె అభిమానులు కమర్షియల్ సినిమాలను ఆశిస్తున్నారు. కానీ ఆమెకు మాత్రం అలాంటి అవకాశాలు దక్కడం లేదు. ముందు ముందు అయినా పాయల్ కి స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కుతాయా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ అమ్మడికి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హీరోయిన్‌గా స్టార్‌డం దక్కించుకోక పోయినా, స్టార్ హీరోయిన్స్ రేంజ్‌లో ఇన్‌స్టాగ్రామ్‌లో 4.2 మిలియన్ ఫాలోవర్స్‌ను దక్కించుకుంది. సోషల్ మీడియాలో ఈమె ఫాలోయింగ్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అనడంలో సందేహం లేదు. రెగ్యులర్‌గా ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తుంది. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలు మరోసారి ఈమె ఫాలోవర్స్, ఫ్యాన్స్‌కి కిక్ ఇచ్చే విధంగా ఉన్నాయి. వాతావరణం బాగున్నప్పుడు, మీరు కొన్ని ఫోటోలు తీయడానికి మిమ్మల్ని మీరు ప్రేరేపించుకుంటారు... అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ అందమైన ఫోటోలను షేర్ చేసింది. అందమైన ఫోటోలను తీయించుకోవడంలో పాయల్‌కి ప్రేరణ ఉన్నట్లుగానే, ఆమె ఫోటోలను చూడటం వల్ల అభిమానులకు, ఆమె ఫాలోవర్స్‌కి కచ్చితంగా పాజిటివ్ ఎనర్జి అనేది వస్తుంది అంటూ కొందరు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తాజా ఫోటోల్లో ఈ అమ్మడి అందం అందరిని ఆకర్షిస్తుంది. పాయల్ అందానికి ఎంతటి వారు అయినా ఫిదా అవ్వాల్సిందే. ఇంతటి అందానికి ఇండస్ట్రీలో దక్కిన గుర్తింపు చాలా తక్కువ అని, పాయల్ స్టార్ హీరోయిన్ మెటీరియల్ అంటూ అభిమానులతో పాటు అంతా కూడా కామెంట్ చేస్తున్నారు.



సింపుల్ అండ్ స్వీట్ లుక్‌లో థైస్ అందాలను చూపిస్తూ, క్లీ వేజ్ షో తో పాయల్ రాజ్‌పూత్ ఎప్పటిలాగే ఫాలోవర్స్‌ను చూపు తిప్పనివ్వడం లేదు. సాధారణంగానే పాయల్ ఫోటోలు షేర్ చేస్తూ చూపు తిప్పడం కాస్త కష్టమే. అలాంటిది ఇలా స్కిన్ షో చేస్తే, స్పెషల్ షో చేస్తే

ఆ టైమ్ లో బాలీవుడ్ ను వదిలేద్దామనుకున్నా

రీసెంట్ గా కీర్తి సురేష్ నటించిన బేబీ జాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన వామికా గబ్బి ఆ సినిమాతో మంచి గుర్తింపే దక్కించుకుంది. సుధీర్ బాబు హీరోగా పదేళ్ల కిందట వచ్చిన భలే మంచి రోజు సినిమాలో హీరోయిన్ గా నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన వామికా గబ్బి ఆ తర్వాత ఇక్కడ కనిపించలేదు. వామికా ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు 20 ఏళ్లవుతుంది. కెరీర్ స్టార్టింగ్ లో జూనియర్ ఆర్టిస్టుగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేసిన వామికా ప్రస్తుతం బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తూ కెరీర్ లో ముందుకెళ్తుంది. రీసెంట్ గా కీర్తి సురేష్ నటించిన బేబీ జాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన వామికా గబ్బి ఆ సినిమాతో మంచి గుర్తింపే దక్కించుకుంది. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే వామికాకు ప్రస్తుతం ఆఫర్లు బాగానే వస్తున్నాయి. త్వరలోనే వామికా నుంచి వరుస సినిమాలు రానున్నాయి. భలే మంచి రోజు తర్వాత ప్రస్తుతం తెలుగులో అడివి శేష్ తో కలిసి జీ2 సినిమాలో నటిస్తోంది వామికా. కమల్ హాసన్ బోల్డ్ స్టేట్‌మెంట్.. శివరాజ్ కుమార్‌పై విమర్శల వెల్లువ! తెలుగు, తమిళ, పంజాబీ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తున్న వామికా సినిమాలతో పాటూ వెబ్ సిరీస్‌ల్లో కూడా నటిస్తోంది. రీసెంట్ గా వామికా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని సంచలన వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కింది. ప్రస్తుతం పలు భాషల్లో బిజీగా ఉన్న వామికా 2019లో బాలీవుడ్ ను వదిలి వెళ్లిపోవాలని అనుకున్నట్టు కామెంట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే బాలీవుడ్ ను విడిచి వెళ్లాలనుకోవడానికి రీజన్ ను మాత్రం వామికా బయటపెట్టలేదు. దాంతో పాటూ తాను కేవలం లండన్ వెళ్లేందుకు మాత్రమే 83 అనే సినిమాలో చిన్న క్యారెక్టర్ లో నటించానని, ఆ ఎక్స్‌పీరియెన్స్ తనలో యాక్టింగ్ పట్ల ఇష్టాన్ని పెంచిందని వామికా వెల్లడించింది. కబీర్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కిన 83 సినిమాలో వామికా అన్ను లాల్ పాత్రలో కనిపించింది.

శ్రీలీల బౌన్స్ బ్యాక్ అవుతుందా..?



ఇక నెక్ట్స్ బాలీవుడ్ లో కూడా అక్కడ యువ హీరో కార్తీక్ ఆర్యన్ తో సినిమా చేస్తుంది అమ్మడు. ఆ సినిమా టీజర్ తోనే బీ టౌన్ ఆడియన్స్ కి దగ్గరైంది శ్రీలీల. ధమాకాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన శ్రీలీల ఆ సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్ గా మారింది. అప్పటి నుంచి స్టార్ ఛాన్స్ లతో అదరగొట్టేస్తున్న అమ్మడు ప్రతి సినిమాతో తనను అభిమానిస్తున్న ఆడియన్స్ ను సర్ ప్రైజ్ చేస్తూనే వస్తుంది. హీరోయిన్ గా నటించడం అందరు చేస్తారు కానీ హీరోలతో ఈక్వల్ గా డ్యాన్స్ చేసే కథానాయికలు చాలా తక్కువ మంది ఉన్నారు. వారిలో శ్రీలీల పేరు బాగా వినిపిస్తుంది. స్టార్ ఛాన్స్ లు వచ్చాయి కానీ వాటి ఫలితాల వల్ల శ్రీలీల కాస్త వెనకపడింది. గుంటూరు కారం తర్వాత పెద్దగా అవకాశాలు అందుకోని శ్రీలీల నెక్ట్స్ సినిమాల విషయంలో కాస్త జాగ్రత్త వహిస్తుంది. ప్రస్తుతం అమ్మడు మాస్ మహారాజ్ రవితేజతో మాస్ జాతార సినిమా చేస్తుంది. ఈ సినిమాతో మరోసారి ధమాకాని మించిన హిట్ అందుకోవాలని చూస్తుంది అమ్మడు. కమల్ హాసన్ బోల్డ్ స్టేట్‌మెంట్.. శివరాజ్ కుమార్‌పై విమర్శల వెల్లువ! ఇక నెక్ట్స్ బాలీవుడ్ లో కూడా అక్కడ యువ హీరో కార్తీక్ ఆర్యన్ తో సినిమా చేస్తుంది అమ్మడు. ఆ సినిమా టీజర్ తోనే బీ టౌన్ ఆడియన్స్ కి దగ్గరైంది శ్రీలీల. ఆషికి ఫ్రాంచైజీలో భాగంగా ఆషికి 3 గా వస్తున్న ఈ సినిమా మీద శ్రీలీల కూడా చాలా హోప్స్ పెట్టుకుంది. ఐతే ఈ సినిమాలతో శ్రీలీల తిరిగి బౌన్స్ బ్యాక్ అవ్వాలని చూస్తుంది. తన యాక్టింగ్ టాలెంట్ తో ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల నెక్ట్స్ సినిమాలతో హిట్ ట్రాక్ ఎక్కాలని చూస్తుంది. తెలుగు, హిందీలోనే కాదు తమిళ్ లో కూడా శ్రీలీల శివ కార్తికేయన్ తో పరాశక్తి సినిమాలో నటిస్తుంది. ఆ సినిమా మీద కూడా ఆడియన్స్ లో మంచి బజ్ ఉంది. తప్పకుండా రాబోతున్న ఈ సినిమాలు శ్రీలీలకు మంచి క్రేజ్ తెచ్చేలా ఉన్నాయి. టాలీవుడ్ డాన్సింగ్ క్వీన్ గా శ్రీలీల ఇప్పటికే టాప్ లీగ్ లో ఉండగా ఇక నెక్ట్స్ సినిమాలు కూడా ఆమె కి హిట్ ఇచ్చి ఎంకరేజ్ చేస్తే తప్పకుండా మళ్లీ శ్రీలీల తిరిగి ఫాంలోకి వచ్చే అవకాశం ఉంటుంది. ఒకటి రెండు ఫ్లాపులు పడితే వెనక్కి తగ్గే టైపు తను కాదని ఇప్పటికే ప్రూవ్ చేసిన శ్రీలీల రాబోతున్న సినిమాలకు ఆమెకు అంత మంచిగా కలిసి రావాలని ఆమె ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

బిఆర్ఎస్ హయాంలోనే చౌటుప్పల్ అభివృద్ధి: బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి చౌటుప్పల్ నవంబర్ 2 (లోకల్ గైడ్): చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బొమ్మి రెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యం లో పార్టీ ముఖ్య కార్యకర్తల తో విలేకరుల సమావేశం ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ లు పెట్టి మాజీ మునుగోడు శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. గ్రామ పంచాయతీ గా ఉన్న చౌటుప్పల్ మున్సిపాలిటీగా , ఆర్డిఓ కార్యాలయం ను ఏర్పాటు చేసి చౌటుప్పల్ ను రెవిన్యూ డివిజన్ గా చేశారని ఎన్ హెచ్ ఎ ఐ వారితో ఆరో గారితో మాట్లాడి అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారని సీఎస్ఐఆర్ నిధుల ద్వారా మున్సిపాలిటీలో డ్రైనేజీలు సిసి రోడ్ల నిర్మాణంలో చేపట్టారని చౌటుప్పల్ లో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చేసిన అభివృద్ధిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు కూసుకుంట్ల పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. చౌటుప్పల్ బిఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి చెందిందనీ ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి శూన్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మల్లాపురం సర్పంచ్ నిరంజన్ గౌడ్, పి ఏ సి ఎస్ మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్, కౌన్సిలర్ యాదయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్, నేలపట్ల ఉపసర్పంచ్ చిన్న బాలరాజు, ఢిల్లీ మాధవరెడ్డి మహేష్ గౌడ్, గంగాదేవి శివ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అమిత్ షాను కలిసిన చిరంజీవి, రామ్ చరణ్

కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చిరంజీవి, రామ్ చరణ్ భేటీ

ఏఐ డీప్‌ఫేక్, మార్ఫింగ్ సమస్యపై అమిత్ షాకు వివరించిన వైనం

కఠిన చట్టాలు తెస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హామీ

ఈ అంశంపై లిఖితపూర్వక వినతిపత్రం ఇవ్వాలని చిరంజీవికి సూచన

సమన్వయ బాధ్యతలు కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి అప్పగింత



కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మెగాస్టార్ చిరంజీవి, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సోమవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. బీజేపీ మహా పాదయాత్రలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన అమిత్ షాను, బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో వారు కలిశారు. చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న ఓ తీవ్రమైన సమస్యను చిరంజీవి ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.ప్రస్తుతం సినీ ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని, వారి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఏఐ టెక్నాలజీని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్, మార్ఫింగ్ ద్వారా అసభ్యకరమైన, అభ్యంతరకరమైన కంటెంట్‌ను సృష్టిస్తున్నారని, దీనివల్ల కళాకారులు, ముఖ్యంగా నటీమణులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని వివరించారు. టాలీవుడ్‌తో పాటు యావత్ భారత సినీ పరిశ్రమ తరఫున ఈ సమస్యపై కఠినమైన చట్టాలు తీసుకురావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు.చిరంజీవి చెప్పిన విషయాలను అమిత్ షా సావధానంగా విన్నారు. ఈ సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన, దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. టెక్నాలజీని దుర్వినియోగం చేసి కళాకారులు, మహిళల గౌరవానికి భంగం కలిగించే వారిపై కఠినమైన మార్గదర్శకాలు, శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు.ఈ విషయంపై పూర్తి వివరాలతో లిఖితపూర్వక వినతిపత్రం సమర్పించాలని చిరంజీవికి అమిత్ షా సూచించారు. దీనికి సంబంధించిన సమన్వయ బాధ్యతలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి అప్పగించారు. హోంమంత్రి సానుకూలంగా స్పందించడంపై చిరంజీవి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకునే చర్యలతో చిత్ర పరిశ్రమకు త్వరలోనే ఊరట లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ భేటీలో చిరంజీవి అమిత్ షాను శాలువాతో సత్కరించి, మెమెంటోను బహూకరించారు.

'అర్నబ్' తుపానుతో పోలిస్తే 'మురసు' తీవ్రత తక్కువే.. అయినా అప్రమత్తంగా ఉండాలి: సీఎం చంద్రబాబు

బంగాళాఖాతంలో మురసు తుపాను

ఈ రాత్రికి తీరం తాకుతుందని నివేదికలు

పలు కోస్తా జిల్లాల్లో నేటిరాత్రి నుంచి భారీ వర్షాల హెచ్చరిక

మరోసారి ఆర్టీజీఎస్ లో చంద్రబాబు సమీక్ష

45 వేల మంది సిబ్బందిని అప్రమత్తం చేసిన సీఎం

బుడమేరు, ప్రకాశం బ్యారేజీకి భారీ వరద ప్రవాహం అంచనా

ప్రాణ నష్టం నివారించడమే లక్ష్యమని అధికారులకు ఆదేశం



'అర్నబ్' తుపానుతో పోలిస్తే 'మురసు' తీవ్రత తక్కువే అయినా, అధికార యంత్రాంగం ఏమాత్రం అలసత్వం ప్రదర్శించవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, ఆస్తి నష్టాన్ని వీలైనంత మేర తగ్గించడంపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. 'మురసు' తుపాను సన్నద్ధతపై అమరావతిలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రం (ఆర్టీజీ) నుంచి ఆయన సోమవారం మరోసారి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్సులో రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన దాదాపు 45 వేల మంది క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.'మురసు' తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని సీఎం తెలిపారు. ముఖ్యంగా పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ఈ రోజు రాత్రి 12 గంటల నుంచి రేపు రాత్రి 12 గంటల వరకు కోస్తాంధ్రపై తుపాను ప్రభావం ఉంటుందని, రాష్ట్రంలోని 848 స్థర్డ గ్రామ, వార్డు కార్యాలయాల పరిధిలో దీని ప్రభావం కనిపించవచ్చని అంచనా వేశారు. ప్రతి గంటకూ రియల్ టైమ్ లో తుపాను హెచ్చరికలను ప్రజలకు జారీ చేయాలని సూచించారు.తుపాను కారణంగా నాగార్జునసాగర్, పులిచింతల, బుడమేరు క్యాచ్‌మెంట్ ఏరియాలకు వరద ప్రవాహాలు వస్తాయని హెచ్చరించారు. ముఖ్యంగా బుడమేరుకు మంగళవారం నాటికి 30 వేల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉందని, దీనిపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని జలవనరుల శాఖను ఆదేశించారు. అదేవిధంగా, నవంబర్ 4వ తేదీ నాటికి కృష్ణా నదిపై ఉన్న ప్రకాశం బ్యారేజీకి 2.75 లక్షల క్యూసెక్కుల మేర వరద రావొచ్చని, ఆ తర్వాత తగ్గుముఖం పడుతుందని అంచనా వేశారు. గుండ్లకమ్మకు కూడా వరద ప్రవాహం ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.భారీ గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకూలే అవకాశం ఉన్నందున, పునరుద్ధరణ పనుల కోసం 5 వేల మంది సిబ్బందిని సిద్ధం చేశామని సీఎం తెలిపారు. గుంటూరు, నెల్లూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు అంతరాయం కలగవచ్చని, సరఫరాలో సమస్య తలెత్తిన వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 14,760 చిన్న నీటిపారుదల చెరువులకు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆక్వా, హార్టికల్చర్ రంగాలపై ప్రభావం ఉంటుందని అప్రమత్తం చేశారు.గతంలో అర్నబ్ తుపాను సమయంలో ముందస్తు జాగ్రత్తలతో నష్టాన్ని చాలావరకు తగ్గించగలిగామని గుర్తుచేశారు. ఈసారి కూడా ప్రాణ నష్టం జరగకుండా, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గిస్తే ప్రజల్లో ప్రభుత్వ పట్ల భరోసా పెరుగుతుందని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, తుపాను షెల్టర్లకు తరలించాలని, క్షేత్రస్థాయి సిబ్బంది చిన్నపాటి నిర్లక్ష్యం కూడా చూపరాదని, తుపాను తీరం దాటేంత వరకు పూర్తి సన్నద్ధంగా ఉండాలని గట్టిగా ఆదేశించారు.

భారత 29వ వైమానిక దళాధిపతిగా బాధ్యతలు చేపట్టిన ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్



భారత వైమానిక దళ 29వ అధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించారు. భారత వాయుసేనను ఆధునీకరించడం, పోరాట సంసిద్ధతను మెరుగుపరచడం, స్వదేశీ రక్షణ సామర్థ్యాలను పెంపొందించడంపై ఆయన దృష్టి సారించనున్నారు. 40 ఏళ్లకు పైగా విశిష్ట సేవలందించిన దీక్షిత్, మిరాజ్-2000, తేజస్ వంటి విమానాల ఆధునీకరణలో కీలక పాత్ర పోషించారు. ఇక తాజాగా ఆయన్ను కలిసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దీక్షిత్‌ను అభినందించారు.భారత 29వ వైమానిక దళాధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దేశానికి 42 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్ స్థానంలో అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ కొత్తగా నియమితులైన ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ ను కలిసి అభినందించారు. అశుతోష్ దీక్షిత్ పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వాయుసేనకి అద్భుతమైన నాయకత్వానికి పేరుగాంచిన ఒక విశిష్ట వాయు యోధుడుగా అశుతోష్ దీక్షిత్ ను కొనియాడారు. భారత వాయుసేన పోరాట సంసిద్ధత, వాయుసేన సామర్థ్యాన్ని పునరుద్ధరించడం, స్వదేశీ రక్షణ సామర్థ్యాలు, సాంకేతిక ఆవిష్కరణలు సాయుధ దళాల మధ్య సమన్వయం వంటి అంశాలపై దృష్టి సారిస్తానని అశుతోష్ దీక్షిత్ స్పష్టం చేశారు

ఎవరీ అశుతోష్ దీక్షిత్..

నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్, 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళంలోని ఫైటర్ స్ట్రీమ్లోకి నియమితులయ్యారు. నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన కెరీర్లో, ఎయిర్ చీఫ్ ఆపరేషన్స్, ఫ్లైట్ టెస్టింగ్, సామర్థ్య అభివృద్ధి జాయింట్ స్టాఫ్ అసైన్మెంట్లు వంటి విభిన్న రంగాలలో విస్తారమైన అనుభవం ఉంది. ఆయన నిష్ణాతుడైన ఫైటర్ పైలట్, అర్హత కలిగిన ఫ్లయింగ్ ఇన్స్ట్రక్టర్ , ప్రయోగాత్మక టెస్ట్ పైలట్ అయిన ఆయనకు, మిరాజ్-2000, వివిధ మిగ్ వేరియంట్లు, జాగ్వార్ అనేక రవాణా విమానాలతో సహా విస్తృత శ్రేణి విమానాలలో 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం ఉంది. భారత వైమానిక దళ ఆధునీకరణకు ఆయన చేసిన కృషికి విస్తృతంగా గుర్తింపు పొందిన ఆయన, జాగ్వార్ , మిగ్-27 ఆధునీకరణ ప్రాజెక్టులను ఖరారు చేయడంలో, ఎల్సిఎ మార్క్-1 తేజస్ యొక్క ఇనీషియల్ ఆపరేషనల్ క్లియరెన్స్ (ఐఓసి) ఫైనల్ ఆపరేషనల్ క్లియరెన్స్ (ఎఫ్ఓసి) కార్యకలాపాలను పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించారు. అశుతోష్ దీక్షిత్ కార్యాచరణ కమాండ్ నియామకాలలో మిరాజ్ -- 2000 స్క్వాడ్రన్, పశ్చిమ సెక్టార్లోని ఫార్వర్డ్ బేస్ సపోర్ట్ యూనిట్ ఐఎఎఫ్ ,యొక్క ప్రధాన ఫైటర్ శిక్షణా స్థావరమైన బీదర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ కమాండ్ ఉన్నాయి. అశుతోష్ దీక్షిత్ ఎయిర్ ఆఫీసర్ సదరన్ ఎయిర్ కమాండ్లో ఎయిర్ డిఫెన్స్ కమాండర్ గా సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్లో సీనియర్ ఎయిర్ స్టాఫ్ ఆఫీసర్ గా , డిప్యూటీ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ గా పనిచేస్తూ, కీలక సామర్థ్య అభివృద్ధి కార్యక్రమాలకు సారథ్యం వహించారు. సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్గా బాధ్యతలు చేపట్టారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్ కు చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ గా పనిచేశారు. చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు, ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ గా కూడా పనిచేశారు.అశుతోష్ దీక్షిత్ సైనిక సేవలకు గానూ పరమ విశిష్ట సేవా పతకం (2026), అతి విశిష్ట సేవా పతకం (2023), వాయు సేనా పతకం (2006), విశిష్ట సేవా పతకం (2011) పొందారు.

చార్మినార్ భాగ్య లక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న అమిత్ షా



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవారం రోజు హైదరాబాద్ పర్యాటనలో భాగంగా భాగ్యలక్ష్మీ అమ్మవారిని సందర్శించుకున్నారు. అమిత్ షా పర్యాటన రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. బేగంపేట విమానాశ్రయంలో దిగిన ఆయనకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సహా కమలం పార్టీ ముఖ్య నేతలు సాదరంగా ఆహ్వానం పలికారు.కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవారం రోజు హైదరాబాద్ పర్యాటనలో భాగంగా భాగ్యలక్ష్మీ అమ్మవారిని సందర్శించుకున్నారు. అమిత్ షా పర్యాటన రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. బేగంపేట విమానాశ్రయంలో దిగిన ఆయనకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సహా కమలం పార్టీ ముఖ్య నేతలు సాదరంగా ఆహ్వానం పలికారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవారం రోజు హైదరాబాద్ పర్యాటనలో భాగంగా భాగ్యలక్ష్మీ అమ్మవారిని సందర్శించుకున్నారు. అమిత్ షా పర్యాటన రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. బేగంపేట విమానాశ్రయంలో దిగిన ఆయనకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సహా కమలం పార్టీ ముఖ్య నేతలు సాదరంగా ఆహ్వానం పలికారు. ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా పాతబస్తీ చేరుకున్న హోంమంత్రి, చారిత్రక చార్మినార్ చెంత వెలసిన శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. వీఐపీ పర్యటన నేపథ్యంలో పాతబస్తీలో పోలీసులు భారీ ఎత్తున నిఘా పెంచి భద్రతను పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన కాకతీయ హోటల్‌కు చేరుకుని కొంత సమయం గడిపారు. ఇక భాగ్య లక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, అమిత్ షా హైదరాబాద్‌లోని శ్రీ భాగ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారికి పూజలు చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రజలందరూ సుఖశాంతులు, సిరిసంపదలతో ఎల్లప్పుడూ వర్ధిల్లాలని ఆ లక్ష్మీదేవిని మనసారా ప్రార్థించాను. అంటూ ట్వీట్ చేశారు. ఇక భాగ్య లక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, అమిత్ షా హైదరాబాద్‌లోని శ్రీ భాగ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారికి పూజలు చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రజలందరూ సుఖశాంతులు, సిరిసంపదలతో ఎల్లప్పుడూ వర్ధిల్లాలని ఆ లక్ష్మీదేవిని మనసారా ప్రార్థించాను. అంటూ ట్వీట్ చేశారు. పర్యటన మొదట్లోనే కాంగ్రెస్ లక్ష్యంగా అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో వరుస పరాజయాలను జీర్ణించుకోలేక, హింసాత్మక లేదా అరాచక మార్గాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని అణచివేసి అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ తరహా కుట్రలను తిప్పికొట్టి రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసమే తాను నగరంలో గళమెత్తుతున్నట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం.. సాయంత్రం 4 గంటలకు నిజాం కళాశాల సమీపంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించి.. ప్రజాస్వామ్య పరిరక్షణ అరాచక నిర్మూలన అనే నినాదంతో భారీ ర్యాలీగా మొజాంజాహీ మార్కెట్ వరకు పాదయాత్ర చేపడతారు. షెడ్యూల్ ప్రకారం.. సాయంత్రం 4 గంటలకు నిజాం కళాశాల సమీపంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించి.. ప్రజాస్వామ్య పరిరక్షణ – అరాచక నిర్మూలన అనే నినాదంతో భారీ ర్యాలీగా మొజాంజాహీ మార్కెట్ వరకు పాదయాత్ర చేపడతారు. ఎంజే మార్కెట్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా కీలక ప్రసంగం చేస్తారు. ఇక్కడి నుంచే బీజేపీ శ్రేణులకు రాజకీయ దిశానిర్దేశం చేయనున్నారు. ఎంజే మార్కెట్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా కీలక ప్రసంగం చేస్తారు. ఇక్కడి నుంచే బీజేపీ శ్రేణులకు రాజకీయ దిశానిర్దేశం చేయనున్నారు. బహిరంగ కార్యక్రమం ముగియగానే ఆయన ప్రత్యేక విమానంలో హన్మకొండకు తిరుగుపయనం కానున్నారు. హోంమంత్రి రాకను పురస్కరించుకుని నగర పోలీస్ శాఖ భారీగా బలగాలను మోహరించి, ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టింది. బహిరంగ కార్యక్రమం ముగియగానే ఆయన ప్రత్యేక విమానంలో హన్మకొండకు తిరుగుపయనం కానున్నారు. హోంమంత్రి రాకను పురస్కరించుకుని నగర పోలీస్ శాఖ భారీగా బలగాలను మోహరించి, ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టింది.

ఆరేళ్లలో అతిపెద్ద జంప్.. మళ్లీ భారత నెం.1 కుబేరుడిగా ముకేశ్ అంబానీ

అంచనాలను మించిన రిలయన్స్ త్రైమాసిక ఫలితాలతో షేర్ల భారీ ర్యాలీ

ఒక్కరోజే ముకేశ్ అంబానీ సంపద బిలియన్ల డాలర్ల మేర పెరుగుదల

ప్రపంచంలోనే ఆ రోజు అత్యధిక సంపద ఆర్జించిన వ్యక్తిగా రికార్డు

గౌతమ్ అదానీని అధిగమించి మళ్లీ భారత కుబేరుడిగా అగ్రస్థానం

రిఫైనింగ్, టెలికాం విభాగాల అద్భుత ప్రదర్శనే వృద్ధికి ప్రధాన కారణం



భారత పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ సంపద సోమవారం ఒక్కరోజే ఉవ్వెత్తున ఎగిసింది. కంపెనీ అంచనాలను మించి త్రైమాసిక ఫలితాలను ప్రకటించడంతో రిలయన్స్ షేర్లు భారీగా లాభపడ్డాయి. ఈ పరిణామంతో అంబానీ సంపద ఒక్కరోజే బిలియన్ల డాలర్ల మేర పెరిగి, ఆయన తిరిగి భారతదేశంలో అత్యంత సంపన్నుడిగా అవతరించారు.వివరాల్లోకి వెళితే, దీపావళి పండుగ సమీపిస్తున్న తరుణంలో నవంబర్ 2న రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు మార్కెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాయి. బీఎస్ఈలో రిలయన్స్ షేరు ధర ఏకంగా 11.64% పెరిగి రూ.1,299 వద్ద ముగిసింది. గత ఆరేళ్లలో కంపెనీ షేరుకు ఇది ఒక్కరోజులో అతిపెద్ద లాభం కావడం విశేషం. ఈ ర్యాలీతో నిష్టీ 50 సూచీకి రిలయన్స్ అతిపెద్ద కంట్రిబ్యూటర్‌గా నిలిచింది.షేర్ల ర్యాలీ నేరుగా ముకేశ్ అంబానీ నికర సంపదపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ఫోర్బ్స్ రియల్-టైమ్ బిలియనీర్స్ జాబితా ప్రకారం, సోమవారం ఒక్కరోజే అంబానీ సంపద 6.3 బిలియన్ డాలర్ల నుంచి 8.5 బిలియన్ డాలర్ల మధ్య పెరిగింది. దీంతో ఆయన సంపద మొత్తం 88.8 బిలియన్ డాలర్లకు (రూ.8.4 లక్షల కోట్లు) చేరుకుంది. ఈ వృద్ధితో ఆయన ప్రపంచవ్యాప్తంగా ఆ రోజు అత్యధిక సంపదను ఆర్జించిన వ్యక్తిగా (టాప్ గ్లోబల్ గెయినర్) నిలిచారు. ఈ క్రమంలో గౌతమ్ అదానీని వెనక్కి నెట్టి, ఫోర్బ్స్ ర్యాంకింగ్స్‌లో భారత నంబర్ వన్ కుబేరుడిగా తన స్థానాన్ని తిరిగి దక్కించుకున్నారు.

అద్భుత ఫలితాలే కారణం

ఈ భారీ ర్యాలీకి జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో రిలయన్స్ కనబరిచిన అద్భుత ఆర్థిక ఫలితాలే ప్రధాన కారణం. ఈ క్వార్టర్‌లో కంపెనీ వాటాదారుల లాభం ఏకంగా 40.6% వృద్ధితో రూ.25,548 కోట్లకు చేరింది. ముఖ్యంగా ఆయిల్-టు-కెమికల్స్ విభాగం బలమైన రిఫైనింగ్ మార్జిన్లు, పెరిగిన ముడి చమురు ప్రాసెసింగ్, మెరుగైన పెట్రోకెమికల్స్ లాభదాయకతతో అద్భుత పనితీరు కనబరిచింది. మరోవైపు, టెలికాం విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ కూడా త్రైమాసిక లాభంలో దాదాపు 14% వృద్ధిని నమోదు చేసి స్థిరమైన పనితీరును కొనసాగించింది.ఈ ఫలితాల నేపథ్యంలో పలు అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థలు రిలయన్స్ షేరుపై సానుకూలంగా ఉన్నాయి. గోల్డ్‌మన్ శాక్స్ రూ.1,840, నోమురా రూ.1,560 టార్గెట్ ధరతో తమ సానుకూల దృక్పథాన్ని కొనసాగించాయి. అయితే, రిటైల్ వ్యాపారంలో లాభదాయకత ఒత్తిళ్లు, నూతన ఇంధన రంగ పెట్టుబడులపై స్పష్టమైన రాబడి రావాల్సి ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏదేమైనా, తాజా ఫలితాలు మార్కెట్‌కు బలమైన సంకేతాలను పంపడంతో పాటు, అంబానీ సంపదను గణనీయంగా పెంచాయి.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDYPublished from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499